





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 230 | సోమవారం | 20-07-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





## కుట్రలు తిప్పికొట్టాలి

● పోడు సాగుదారులకు పూర్తి రక్షణ కల్పించాలి ● గిరిజన సంక్షేమం సిద్ధించేదాకా రాజీలేని పోరాటాలు చేయాలి ● గిరిజన హక్కుల సాధనకు ఐక్యంగా కదలాలి : సిపిఐ జాతీయ కార్యదర్శి అనీరాజా పిలుపు ● భూములపై నిర్బంధాలను అడ్డుకుందాం : కూనంనేని




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం


తరాలుగా అడవిని నమ్ముకుని బ్రతుకుతున్న గిరిజన బిడ్డలను భూములకు దూరం చేసే కుట్రలను తిప్పి కొట్టాలని అఖిలభారత ఆదివాసీ మహాసభ ఇన్‌చార్జి సిపిఐ జాతీయ కార్యదర్శి అనీరాజా పిలుపునిచ్చారు. పోడుసాగు దారులకు పూర్తి రక్షణ కల్పించేంత వరకు, గిరిజన సంక్షేమం సిద్ధించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల సాధనకు ఏజెన్సీ చట్టాల పరిరక్షణకు గిరిజన లోకం ఐక్యంగా కదలాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక లారీఓనర్స్ అసోసియేషన్ హాల్ అమరజీవి సోయం గంగులు నగర్ రామానాయక్ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) రాష్ట్ర 3వ మహాసభలు రెండో రోజు ప్రతినిధుల సభ అత్యంత ఉత్సాహంగా జరిగింది. ముందుగా టిజిఎస్ పతాకాన్ని గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం అనీరాజా మాట్లాడుతూ పాలకులు ప్రజావ్యతిరేక విధానాల వల్ల గిరిజన ప్రాంతాల్లో హక్కులు కాలరాయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్య ఉద్యమాలతోనే గిరిజన హక్కుల రక్షణతో పాటు న్యాయం సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు అన్నారు. ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ పాలకుల అణచివేత వైఖరిని గిరిజన లోకం ఐఖ్యంగా ఎదుర్కొవాలన్నారు. గిరిజన భూములుపై ఎలాంటి నిర్భంధాలను పెట్టినా సహించేది లేదని, అడవిపై సర్వహక్కులు గిరిజనులవే అని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా పక్షాన ఉంటూ బలమైన ఉద్యమాలను నిర్మించి గిరిజన బిడ్డలకు పూర్తి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో సుమారు రెండు లక్షల మంది ఆదివాసీలను జలసమాధి చేస్తున్నారని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. తరాలుగా అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న అమాయకులను అభివృద్ధి పేరుతో అడవి నుండి దూరం చేసే తరువాయి 12లో

## ఇది రెండవ స్వాతంత్ర్య ఉద్యమం

● పార్లమెంట్ మార్చ్ విజయవంతం చేయండి ● మద్దతుదారులకు పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పిలుపు ● భయం, అన్యాయం నుంచి విముక్తి కావాలని ఉద్ఘాటన



(ఫైల్ ఫొటో)

**న్యూఢిల్లీ :** పర్యావరణ కార్యకర్త, విద్యావేత్త అయిన సోనమ్ వాంగ్‌చుక్, ఈనెల 20న ప్రతిపాదిత పార్లమెంట్ మార్చ్‌ను భారతదేశపు 'రెండవ స్వాతంత్ర్య ఉద్యమం'గా అభివర్ణించారు. ఈ పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని మద్దతుదారులకు ఆయన పిలుపునిచ్చారు. 'భయం నుండి స్వేచ్ఛ', 'అన్యాయం నుండి విముక్తి' కావాలని ఆయన పిలుపునిచ్చారు. నీట్ పేపర్ లీక్, పరీక్షల్లో అవకతవకలపై జవాబుదారీతనం, విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21రోజులుగా నిరవధి నిరాహారదీక్ష చేపట్టిన సోనమ్‌ను శనివారం ఢిల్లీ పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్ తన భార్య గీతాంజలి ద్వారా తన చేతితో రాసిన ఒక సందేశం పంపించారు. తన సందేశంలో, వాంగ్‌చుక్ పరీక్ష పేపర్ లీకేజీలు అనే అన్యాయంపై పోరాడాలని అన్నారు. బలవంతంగా, అక్రమంగా తనను నిర్బంధించారని ఆరోపిస్తూ, భయం నుంచి కూడా విముక్తి కావాలని అన్నారు. వీటికి వ్యతిరేకంగా అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. 'జులై 20 మార్చ్ భారతదేశపు రెండో స్వాతంత్ర్య ఉద్యమం. అన్యాయం నుంచి విముక్తి (పేపర్ లీకేజీలు వంటివి), భయం నుంచి విముక్తి (నా అక్రమ నిర్బంధం) కావాలి. అందుకే పార్లమెంట్ మార్చ్‌లో అందరూ పాల్గొనండి. దయచేసి దానిని పెద్దస్థాయిలో విజయవంతం చేయండి. ఇదే సందేశాన్ని నా భార్య గీతాంజలి ద్వారా పంపించాను' అని సోనమ్ వాంగ్‌చుక్ ఎక్స్‌లో తరువాయి 8లో


20th JULY
आज़ादी का दूसरा आन्दोलन
भय मुक्त भारत, अन्याय मुक्त भारत
Freedom from injustice (like paper leaks)
Freedom from Fear (my illegal detention)
India's 2nd FREEDOM MOVEMENT
March to the Parliament
Please make it a big success
Sent through Gitanjali
from my illegal detention at Safdarjung

### గీతాంజలి పిటిషన్‌పై అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు అంగీకారం

07




## జపాన్ ఓపెన్ విజేత పి.వి. సింధు

● చరిత్ర సృష్టించిన భారత షట్లర్
● సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

భారత షట్లర్ పివి సింధు చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన తొలి భారత షట్లర్‌గా రికార్డు సాధించింది. మహిళల సింగిల్స్ ఫైనల్‌లో జపాన్ స్టార్ ప్లేయర్ యమగుచిని వరుసగా గేమ్‌ల్లో ఓడించి ఈ టైటిల్‌ను గెలుచుకుంది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో 21–17, 21–17 తేడాతో విజయం సాధించింది. మహిళల సింగిల్స్ మ్యాచ్ ప్రారంభం నుంచే పివి సింధు దూకుడుగా ఆడింది. క్రాస్‌కోర్ట్ డ్రాప్స్, శక్తివంతమైన స్మాష్‌తో యమగుచిపై ఒత్తిడి పెంచింది. తొలి గేమ్‌లో చివరి వరకు హోరాహోరీ పోరు సాగినా.. తరువాయి 8లో

## ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులు

● వర్షాభావ పరిస్థితుల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం నియామకాలు
● ఉత్తర్వులు జారీచేసిన సిఎస్ సంజయ్ జాజు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వర్షాభావం (ఎల్‌నినో ప్రభావం) నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా తీవ్ర మవుతున్న తాగు,సాగు నీరు, విద్యుత్ కొరత వంటి సమస్యలను అధిగమించే క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం నిమ్మితం రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఎఎస్ అధికారులను ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక అధికారులు సోమవారం నుంచే తమకు కేటాయించిన జిల్లాలలో పర్యటించనున్నారు. పర్యాటనతో పాటు శాఖల వారీగా నిర్వహించే సమావేశాల ఏజెండాను కూడా ప్రభుత్వం ఖరారు చేసింది. ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రుల అధ్యక్షతన సోమవారం జరిగే జిల్లా స్థాయి 'ఎల్‌నినో కంటింజెన్సీ' సమీక్షా సమావేశాల్లో జిల్లా ప్రత్యేక అధికారులు తరువాయి 8లో

## రద్దీకి తగిన బస్సులేవీ?

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా నిత్యం పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులోకి తీసుకురావడంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) తీవ్ర జాప్యం చేస్తోంది. ఇప్పటికే పలు రకాల బస్సులు ప్రవేశపెట్టినప్పటికీ ఇంకా కొరత తీరలేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు అనేక మార్గాల్లో బస్సుల కొరత కనిపిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న జనాభాకు అనుగుణంగా సుమారు 13 వేల బస్సులు అవసరం ఉండగా, టిజిఎస్ ఆర్‌టిసి వద్ద సంస్థకు చెందిన 5300 బస్సులు, ప్రైవేట్ హైర్ బస్సులు 3500, ప్రైవేట్ ఎలక్ట్రిక్ హైర్ బస్సులు 1050, స్వయం సహాయక మహిళా సంఘాలకు చెందిన 150 డీజిల్ బస్సులు మొత్తం కలిసి దాదాపు 10 వేల వరకు బస్సులు మాత్రమే తరువాయి 8లో






## రామాలయ విరాళాల చోరీపై స్వతంత్ర విచారణ

● పూర్తి లెక్కలను బహిరంగ పర్చాలి
● దోషులను న్యాయస్థానం ముందు నిలబెట్టాలి
● కాంగ్రెస్ డిమాండ్ : ప్రధానికి రాహుల్, ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ :** అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీపై 'స్వతంత్ర' విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. విశ్వాసంతో తమ కష్టార్జితాన్ని విరాళంగా ఇచ్చిన లక్షలాది మంది భక్తులు ఈ దొంగతనంతో ద్రోహానికి గురైనట్లు భావిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రధానమంత్రి మౌనం ఆమోదయోగ్యం కాదని లోక్‌సభ, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు అన్నారు. జవాబుదారీతనం, నష్టపరిహారం అందేలా చూడాలని వారు ఆయనను కోరారు. ప్రభుత్వ విశ్వసనీయత ఇప్పుడు అది చేసే చర్యలపై ఆధారపడి ఉందని రాహుల్‌గాంధీ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. 'శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై స్వతంత్ర, సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రధాని మోదీకి మేము సంయుక్త లేఖ రాశాము. విశ్వాసం, భక్తి, నమ్మకంతో తమ కష్టార్జితాన్ని విరాళంగా ఇచ్చిన లక్షలాది మంది భక్తులు ఈ దొంగతనంతో మోసపోయినట్లు భావిస్తున్నారు' అని ఈనెల 18 నాటి ఆ లేఖను పోస్ట్ చేస్తూ ఖర్గే ఆదివారం తరువాయి 8లో

## ఆగస్టు 3 వరకూ క్షేత్రస్థాయిలోనే ఉండాలి

● పార్టీ పదవులు, చైర్మన్ పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరగొద్దు
● ఎస్ఐఆర్‌పై జూమ్ సమావేశంలో కాంగ్రెస్ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ● సర్ ప్రక్రియలో నాయకుల నిర్లక్ష్యాన్ని సహించం : టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆగస్టు 3 వరకు పార్టీ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ పదవులు, చైర్మన్ పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరగకుండా పూర్తిగా నియోజకవర్గాల్లోనే ఉండాలని నాయకులకు సిఎం స్పష్టం చేశారు. సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు ఎవరూ గాంధీభవన్‌కు రావద్దని, కొందరు నాయకులు హైదరాబాద్‌లోనే ఉంటూ క్షేత్రస్థాయిలో పనిచేయకపోవడం సరికాదని హెచ్చరించారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచార తరహాలో ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జూమ్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, తరువాయి 8లో

## పార్లమెంటులో బాధ్యతల నుండి తప్పించుకోవద్దు


అఖిలపక్ష భేటీలో రాజ్యసభ సిపిఐ పక్షనేత సందోష్ కుమార్ డిమాండ్




**న్యూఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని రాజ్యసభలో సిపిఐ (భారత కమ్యూనిస్టు పార్టీ) పక్ష నాయకుడు సందోష్ కుమార్ ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారాలు చెప్పకుండా, పార్లమెంటులో జవాబుదారీ వహించకుండా బాధ్యతల నుండి తప్పించుకోవద్దని కేంద్ర ప్రభుత్వానికి సంతోష్ కుమార్ హితవు చెప్పారు. సోమవారం నుండి తరువాయి 12లో

## ఇరాన్ ప్రత్యక్ష దాడిలో ఇద్దరు యుఎస్ సైనికులు హతం

● యుద్ధంలో ఇదే మొదటిసారి : ట్రంప్ నివాళులు
● ఇరాన్‌పై సెంట్‌కామ్ సైన్యాల ప్రతీకార దాడులు



**వాషింగ్టన్:** ఇరాన్ ప్రత్యక్ష దాడిలో మరణించిన ఇద్దరు అమెరికా సైనికులకు ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నివాళులు అర్పించారు. దుష్ట దేశం ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించకుండా అడ్డుకోవడంకోసమే అమెరికా సైనికులు ప్రాణ త్యాగం చేశారని పేర్కొన్నారు. ''ఇరాన్ వద్ద మేం అణ్వాయుధాన్ని చూడకూడదు'' అనే భావనతోనే వారు ప్రాణత్యాగం చేశారని, ఇరానీయులు ఎంత చెడ్డవారో ఈ ఘటనే నిరూపిస్తోందన్నారు. ''ఇది వారికి సిగ్గుచేటు, వారిని నివారించకపోతే ఈ ప్రాంతం మరింత పెద్ద సంఘర్షణలోకి జారిపోతుంది'' అని హెచ్చరించారు. ఇప్పటివరకూ మరణించిన 14 మంది సైనికులు ఇప్పటివరకూ యుద్ధంలో వివిధ ప్రమాదాలవల్ల మరణించారు తప్ప ఇరాన్ సైనికుల ప్రత్యక్షదాడిలో మరణించలేదు. ఈ ఘటన సంభవించడం ఇదే మొదటిసారి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివారం తరువాయి 8లో

## అమెరికాకు మరచిపోలేని గుణపాఠం నేర్పుతాం

ఇరాన్ సర్వాధినేత మొజ్తాబా ఖమేనీ హెచ్చరిక

**టెహ్రాన్ :** ఎప్పటికీ మరచిపోలేని ఒక పెద్ద గుణపాఠం అమెరికాకు నేర్పుతామని ఇరాన్ సర్వాధినేత మొజ్తాబాఖమేనీ హెచ్చరించారు. జోర్డాన్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ ఐఆర్‌జిసి ప్రత్యక్షంగా జరిపిన దాడుల్లో మొట్టమొదటిసారి ఇద్దరు అమెరికా సైనికులు మరణించారు. మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటన తర్వాత మొజ్తాబా ఖమేనీ పేరిట ఒక ప్రకటనను ఇరాన్ టెలివిజన్ విడుదల చేసింది.'ఇస్లామాబాద్ ఒప్పందం'గా ఇరాన్ పిలుస్తున్న తాత్కాలిక ఎంఓయు నుండి పూర్తిగా వైదొలగామని, ఇక ఆ ఒప్పందం అమలుతో తమకు సంబంధం లేదని, తెగదెంపులు చేసుకున్నామని జులై 18న ఇరాన్ అధికారికంగా ప్రకటించిన మరునాడే మొజ్తాబా పేరుతో ఆదివారం ఈ హెచ్చరిక జారీ అయ్యింది. జూన్ 17,18 తేదీలలో అమెరికా–ఇరాన్‌లకు చెందిన ఉన్నత నాయకులు ఎంఓయుపై తుది సంతకాలు చేయడంతో ఈ ఒప్పందం అమలులోకి వచ్చాక స్విట్జర్లాండ్‌లో సాంకేతిక చర్చలు కూడా మొదలయ్యాయి. ఆ తర్వాత హోర్ముజ్ జలసంధిలో సుంకాల వసూలు, జలసంధిపై తరువాయి 8లో

## కల సాకారం దిశగా మామునూరు ఎయిర్ పోర్ట్

● విమానాశ్రయ అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచిన ఎఎఐ
● కాకతీయ కళా వైభవం చాటేలా నిర్మాణాలకు అవకాశం
● 2028లో విమానాలు టేకాఫ్ అయ్యేలా కార్యాచరణ




ప్రజాపక్షం/హనుమకొండ

మామునూరు ఏయిర్ పోర్టుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. ఉత్తర తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదు రుచూస్తున్న మామునూరు విమానాశ్రయం కల సాకారం దిశగా కీలక అడుగు పడింది. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సుమారు రూ.208.49 కోట్లతో విమానాశ్రయ అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచింది. రన్ వే ఆధునికీకరణ నుంచి టెర్మినల్ కు అనుసంధాన తరువాయి 12లో

# దాశరథి.. తెలంగాణ చైతన్య సారథి

తెలంగాణ చరిత్రను పుస్తకాలలో మాత్రమే వెతికితే అది తేదీల సమాహారంగా కనిపిస్తుంది. కానీ అదే చరిత్రను కవుల అక్షరాల్లో చదివితే, అక్కడ మనకు నేల ఊపిరి వినిపిస్తుంది. కాలం రాసిన గాయాలు కనిపిస్తాయి. బానిసత్వాన్ని చీల్చుకుంటూ స్వేచ్ఛ వైపు పరుగెత్తిన ప్రజల అడుగుల చప్పుడు వినిపిస్తుంది. అలాంటి చరిత్రకు సాక్షిగా నిలిచిన అరుదైన కవి దాశరథి కృష్ణమాచార్యులు. తెలుగు సాహిత్య చరిత్రలో కొందరు కవులు కవిత్వాన్ని అందం కోసం రాశారు. మరికొందరు ఆలోచన కోసం రాశారు. ఇంకొందరు సమాజాన్ని ప్రశ్నించడానికి రాశారు. కానీ అరుదుగా కొందరు మాత్రమే తమ కాలాన్ని అక్షరాల్లో బంధించి, ఒక ప్రాంతపు ఆత్మను దాశరథిలా శాశ్వతంగా నిలబెడతారు. ఆయనను కేవలం తెలంగాణ ఉద్యమ కవిగా పేర్కొనడం, ఆయన సాహిత్య పరిధిని కుదించడమే. ఎందుకంటే దాశరథి రాసింది ఉద్యమం గురించే కాదు... మనిషి గురించి రాశాడు. స్వేచ్ఛ గురించి రాశాడు. భాష గురించి రాశాడు. ఆత్మగౌరవం గురించి, తెలంగాణ చరిత్ర గురించి రాశాడు. నిజానికి, తెలంగాణ రాజకీయంగా ఎన్నో పాలనలను చూసింది. కాకతీయుల వైభవం నుంచి ఆసఫ్‌జాహీల నిరంకుశ పాలన వరకు, రైతు తిరుగుబాట్ల నుంచి స్వాతంత్ర్యానంతర రాజకీయ పరిణామాల వరకు అంతులేని మలుపులు తెలంగాణ సొంతం. కానీ ఆ నేల పడిన బాధను, ఆవేదనను, ఆకాంక్షను ఒక కవి తన హృదయంలో మోసుకుని పద్యంగా మార్చిన సందర్భాలు చాలా అరుదు. దాశరథి అలాంటి చారిత్రక అవసరం నుంచి జన్మించిన కవి. అందుకే ఆయన రచనలను చదివినప్పుడు అవి కేవలం కవితలుగా కాకుండా, ఒక కాలం మనతో మాట్లాడుతున్నట్టుగా అనిపిస్తుంది. దాశరథి జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు గా ఆయన జన్మించిన తెలంగాణను అర్థం చేసుకోవాలి. ఆ కాలంలో నిజాం పాలనలో ప్రజాస్వామ్యం అనే భావనకే స్థానం లేదు. భాషకు స్వేచ్ఛ లేదు. రైతుకు భూమిపై హక్కు లేదు. సామాన్యుడికి గౌరవం లేదు. భయమే పాలనగా, విధేయతే జీవన విధానంగా మారిన రోజులు అవి. అలాంటి వాతావరణంలో పెరిగిన యువకుడి చేతిలో కలం పడితే, సహజంగానే అది ప్రేమగీతాలు లేదా విరహ గీతాలను మాత్రమే రాసేది. కానీ, దాశరథిది భిన్న వ్యక్తిత్వం. విభిన్న మనస్తత్వం. అందుకే ఆయన రచనలు ప్రజల నిశ్శబ్దాన్ని స్వరంగా మలిచాయి. దాశరథి 1925 జులై 22న మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో జన్మించారు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూ, సంస్కృతం, ఆంగ్ల భాషలపై ఆయనకు చిన్న వయసులోనే పట్టు ఏర్పడింది. ఈ బహుభాషా పరిచయం ఆయన కవిత్వానికి అరుదైన సౌందర్యాన్ని తీసుకొచ్చింది. సంస్కృతం నుంచి శాస్త్రీయ గాంభీర్యం, ఉర్దూ నుంచి భావలాలిత్యం, తెలుగు నుంచి ప్రజల మట్టి వాసన సొంతం చేసుకున్నాడు. అందుకే ఆయన ఈ మూడు ప్రవాహాల కలయికగా, సాహిత్య '**త్రివేణి సంగమం**'గా వెలుగొందాడు. అందుకే ఆయన కవిత్వం ఒకేసారి పాండిత్యాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ మోసుకెళ్లగలిగింది. దాశరథిని పుస్తకాల కంటే జీవితమే ఒక కవిగా తీర్చిదిద్దింది అనడం సబబు. చదివిన విశ్వవిద్యాలయాలకంటే, చూసిన సామాజిక అసమానతలే ఆయనకు గురువులు. నిజాం పాలనలో అణచివేతను, రైతుల దౌర్భాగ్యాన్ని, రజాకార్ల హింసను ప్రత్యక్షంగా చూసిన ఆయన, కవిత్వాన్ని వినోద సాధనంగా చూడలేదు. అది సమాజాన్ని మేల్కొలిపే శక్తిగా భావించాడు. ఈ దృక్పథమే ఆయనను తన సమకాలీనులకు భిన్నంగా నిలబెట్టింది. తెలుగు సాహిత్యంలో విప్లవ చైతన్యానికి శ్రీశ్రీ ఒక నూతన దిశను చూపితే, తెలంగాణ నేలపై అదే చైతన్యానికి ప్రాంతీయ ఆత్మను ఇచ్చిన కవి దాశరథి. అయితే ఈ ఇద్దరి మధ్య ఒక కీలకమైన తేడా ఉంది. శ్రీశ్రీ ప్రపంచ కార్మిక వర్గాన్ని తన కవిత్వ కేంద్రంగా ఎంచుకున్నాడు. దాశరథి మాత్రం తన చుట్టూ ఉన్న తెలంగాణ రైతు, కూలీ, నిరుపేద, అణగారిన మనిషిని కేంద్రంగా నిలబెట్టాడు. అతని దృష్టిలో విప్లవం అనేది సిద్ధాంత గ్రంథాల్లోని పదం కాదు.. తన ఊరి మనిషి కన్నీటిలో కనిపించిన వాస్తవం. దాశరథి కవిత్వాన్ని చదివితే ఆయన కోపం కూడా మనిషి కోసమని, ఆయన ప్రేమ కూడా మనిషి కోసమేనని అర్థమవుతుంది. అధికారం పట్ల ఆయనకు ఉన్న నిరసన భావం వ్యక్తుల మీద లేదు. అందుకేనేమో, ఆయన పద్యాల్లో ఎక్కడా ద్వేషం కనిపించదు. కానీ దౌర్జన్యాన్ని సహించే బలహీనత కూడా కనిపించదు. ఈ సమతుల్యతే ఆయనను రాజకీయ ప్రచారకుడిగా కాకుండా, శాశ్వత కవిగా నిలబెట్టింది. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో పాల్గొన్నందుకు దాశరథి జైలుశిక్ష అనుభవించాడు. నిజామాబాద్ కోట జైలులో గడిపిన రోజులు ఆయన జీవితంలోనే కాదు, తెలుగు సాహిత్య చరిత్రలోనూ ఒక ప్రత్యేక అధ్యాయం. పళ్లు తోము కోవడానికి ఇచ్చిన బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాశారన్న సంఘటన, ఒక కవి తన స్వేచ్ఛను ఎవరూ బంధించలేరని చెప్పే ప్రతీకగా నిలిచిపోయింది. '**శరీరాన్ని జైలులో పెట్టవచ్చు.. కానీ ఆలోచనను కాదు**' అనే సత్యాన్ని ఆయన తన జీవితంతో నిరూపించాడు. ఆయన ప్రసిద్ధ పంక్తి '**నా తెలంగాణ కోటి రతనాల వీణ**' ఒక కవితా పాదంగా ఉండిపోలేదు. అది తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో అది ఒక గుర్తింపుగా ఎదిగింది. ఒక ప్రాంతాన్ని గొప్పదిగా చెప్పడం సులభం. కానీ ఆ ప్రాంతపు ఆత్మను ఒకే రూపకంలో వ్యక్తపరచడం అత్యంత క్లిష్టం. దాశరథి ఆ అసాధ్యాన్ని సాధించాడు. 'వీణ' అనే ప్రతీక ద్వారా తెలంగాణను కేవలం భూభాగంగా కాకుండా, అనేక స్వరాల సమ్మేళనంగా చిత్రించారు. రైతు చెమట, జానపద గీతం, భాషా మాధుర్యం, తిరుగుబాటు చరిత్ర వంటివన్నీ ఆ వీణలోని తీగలుగా ఆయన భావించాడు. కాగా, భాషే దాశరథి సాహిత్యాన్ని గొప్పదిగా నిలబెట్టింది. ఆయన పదజాలం పండితులను ఆకట్టుకుంటుంటే, భావవ్యక్తీకరణ సామాన్యుడిని కదిలిస్తుంది. సంస్కృత పదసంపదను వినియోగించినా, ఉర్దూ పదాలను వాడినా, అది కృత్రిమంగా అనిపించదు. తెలంగాణ మట్టిమాటను ఉపయోగించినా అది ప్రాంతీయ పరిమితిలో బందీగా ఉండదు. ఇదే నిజమైన కవి సామర్థ్యం. భాషను అలంకారంగా కాకుండా, భావానికి సేవకురాలిగా మార్చగలిగిన రచయితలు చాలా అరుదు. అలాంటి అరుదైన రచయితల్లో దాశరథి ముందు వరుసలో ఉంటాడు. ఆయన రచనల్లో ప్రకృతి కూడా ఒక పాత్రలా ఉంటుంది. కానీ అది కేవలం అందాల వర్ణన కోసం రాదు. ఎండిన నేల రైతు దుస్థితికి ప్రతీకగా వస్తుంది. వాన ఆశకు సంకేతంగా మారుతుంది. పల్లె జీవితం కేవలం నేపథ్యంలాగాక, కవిత్వ పదాల్లో జీవరక్తమై పారుతుంది. ఈ కారణంగానే దాశరథి కవిత్వం చదివినప్పుడు మనకు తెలంగాణ 'వినిపిస్తుంది'. అంతమాత్రం చేత దాశరథిని కేవలం ఉద్యమ కవిగా భావించడం సరైంది కాదు. ఆయన రచనల్లో ప్రేమ ఉంది, తాత్వికత ఉంది, మానవత ఉంది. మనిషి అంతర్ముఖ ప్రపంచాన్ని అర్థం చేసుకునే సున్నితత్వం ఉంది. అన్యాయాన్ని ఎదుర్కొనే అగ్ని ఎంత బలంగా ఉందో, ఒక తల్లి ఒడిలోని మమతను అనుభూతి చెందే మృదుత్వం కూడా అంతే బలంగా ఉంది. ఈ రెండు ధ్రువాలను సమానంగా మోసుకెళ్లగలిగినందువల్లే ఆయన కవిత్వం నినాదంగా మిగలకుండా, సాహిత్యంగా ఉన్నత శిఖరాలకు చేరింది. దాశరథికి సాహిత్యం అంటే వ్యక్తిగత కీర్తి సంపాదించుకునే మార్గం కాదు. అది ప్రజలతో చేసే సంభాషణ. ఒక రచయిత తన కాలం పట్ల బాధ్యత వహించాలనే విశ్వాసం ఆయన ప్రతి రచనలో కనిపిస్తుంది. అందుకే ఆయన రచనలు చదివిన తరువాత మనకు కవి కాకుండా, ఆయా రచనల్లో ఆయన చూపించిన మనిషిని, ఆయన ప్రశ్నించిన సమాజాన్ని ఎక్కువగా గుర్తుంచుకుంటాము. ఈ కారణంగానే తెలంగాణ సాహిత్య చరిత్రలో దాశరథి ఒక అధ్యాయంగా నిలిచిపోతాడు. ఒక దిశగా మార్గదర్శకం చేస్తునే ఉంటాడు. ఆయన గొప్ప కవి. అనితర సాధ్యమైన చైతన్యం. అక్షరాన్ని కేవలం కాగితంపై ముద్రపడిన సిరా కాకుండా, ప్రజల జీవితాలను మార్చగల శక్తిగా నిలబెట్టిన ఘనత దాశరథిది. ఆయన గురించి మాట్లాడేటప్పుడు చాలామంది తెలంగాణ ఉద్యమ కవిగా మాత్రమే గుర్తు చేసుకుంటారు. అది నిజమే అయినప్పటికీ, అది సంపూర్ణ సత్యం కాదు. ఉద్యమం ఆయన వ్యక్తిత్వంలో ఒక కోణం మాత్రమే. దాశరథి కలం ఒక్క రాజకీయ లక్ష్యానికే పరిమితం కాలేదని ఆయన సాహిత్యాన్ని పూర్తిగా చదివినవారికి స్పష్టమవుతుంది. మనిషి అనుభవించే ప్రేమ, వేదన, త్యాగం, ఆశ, ఆత్మగౌరవం, ప్రకృతి, సంస్కృతి తదితర సమస్త జీవనానుభూతులను ఆయన కవిత్వం ఆలింగనం చేసుకుంది. కాబట్టే, ఆయన రచనలు కాలానుగుణ నినాదాలుగా మిగలకుండా, కాలాతీత సాహిత్యంగా నిలిచిపోయాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉద్యమం ముగిసినా, దాశరథి రచనా ప్రయాణం ఆగలేదు. చాలామంది ఉద్యమకారులు పోరాటం ముగిసిన తర్వాత చరిత్రలో ఒక జ్ఞాపకంగా మిగిలిపోతారు. కానీ నిజమైన కవి మాత్రం ప్రతి కొత్త కాలంతో కొత్త సంభాషణ ప్రారంభిస్తాడు. దాశరథి కూడా అదే చేశారు. ఉపాధ్యాయుడిగా, పంచాయతీ శాఖలో అధికారిగా, ఆకాశవాణి ప్రయోక్తగా వివిధ బాధ్యతలు నిర్వహించినప్పటికీ, ఆయన అసలు పరిచయం మాత్రం ఎప్పుడూ 'కవి'గానే నిలిచింది. ఎందుకంటే ఉద్యోగం జీవనోపాధిని ఇచ్చింది.. కవిత్వం జీవనార్థాన్ని ఇచ్చింది. తెలుగు సాహిత్యంలో ఒక రచయితను అంచనా వేయాలంటే ఆయన భాషను పరిశీలించాలి. దాశరథి భాషలో ఒక అరుదైన సమతుల్యత కనిపిస్తుంది. సంస్కృత గాంభీర్యం ఆయన పదాలలో ఉంటుంది. ఉర్దూ కవిత్వం నుంచి వచ్చిన లాలిత్యం ఆయన భావవ్యక్తీకరణలో కనిపిస్తుంది. తెలంగాణ మట్టిమనిషి మాట ఆయన వాక్యాల్లో ఊపిరి తీసుకుంటుంది. ఈ మూడు ప్రవాహాలను కలపగలిగిన రచయితలు చాలా తక్కువ మంది. అందుకే ఆయన కవిత్వం చదివితే అది పండితునికి పాండిత్యాన్నీ, సాధారణ పాఠకుడికి అనుభూతినీ ఒకేసారి అందిస్తుంది.

ఉర్దూ మహాకవి మీర్జా గాలిబ్ గజల్లను తెలుగులోకి అనువదించడం ఆయన సాహిత్య దృష్టికి మరో నిదర్శనం. అనువాదం అంటే పదాలను ఒక భాష నుంచి మరో భాషకు మార్చడం కాదు; ఒక సంస్కృతిని మరో సంస్కృతిలో జీవింపజేయడం. గాలిబ్ కవిత్వంలోని భావగాంభీర్యాన్ని, తాత్వికతను, మానవీయ వేదనను తెలుగులో సహజంగా పలికించగలిగిన దాశరథి సామర్థ్యం ఆయన భాషా పాండిత్యాన్ని మాత్రమే కాదు, కవిగా ఆయన అంతరంగ విస్తృతిని కూడా తెలియజేస్తుంది. భాషలు వేరు కావచ్చు. కానీ మానవ అనుభూతులు ఒక్కటేనని ఆయన ఈ అక్షర కృషి ద్వారా నిరూపించాడు.



### 'ఆవేశం రావాలి.. ఆవేదన కావాలి'

సినీ గేయ రచయితగా ఎన్నో ఆణిముత్యాల్లాంటి పాటలను దాశరథి మనకు అందించాడు. వాటిలో ఏది మంచి అనే ప్రశ్నకు సమాధానం లభించదు. అన్నీ అద్భుతాలే. అయితే, మనసు.. మాంగల్యం (1971) సినిమాకు రాసిన '**ఆవేశం రావాలి.. ఆవేదన కావాలి**' పాటను తప్పక ప్రస్తావించుకోవాలి. ఈ పాట ఆయనలోని తిరుగుబాటు జ్వాలను పరిచయం చేస్తుంది.

'**గుండెలోని గాయాలు మండించే గేయాలు**
**వేదనలై శోధనలై రగలాలి విప్లవాలు**
**రగలాలి విప్లవాలు**' అంటూ యువతకు ప్రబోధిస్తాడు.

'**నరజాతిని భవితవ్యానికి నడిపేదే ఆవేశం**
**పదిమందికి భవితవ్యాన్ని పంచేదే ఆవేదన**' అంటూ ఆవేశం, ఆవేదనల నిజమైన అర్థాన్ని వివరిస్తాడు. అదే విధంగా..

'**వేగంతో వేడిమితో సాగేదే జీవితం**' అని ప్రగతిశీల తాత్విక బోధన కూడా చేస్తాడు.

'**రణదాహం, ధనమోహం కాలి కూలిపోవాలి**
**సమవాదం, నవనాదం ప్రతి ఇంటా పలకాలి**'
అంటూ పదాలను నాట్యం చేయిస్తూనే, విలువైన సందేశాన్ని అందిస్తాడు. '**ప్రతి మనిషీ క్రాంతి కొరకు రుద్రమూర్తి కావాలి**' అని కర్తవ్యబోధ కూడా చేస్తాడు.

'**తరతరాల దోపిడీల ఉరితాళ్ళను తెగతెంచి**
**నరనరాల అగ్నిధార ఉప్పెనలా ఉరికించి**
**మరో కొత్త ప్రపంచాన్ని మనిషి గెలుచుకోవాలి**' అని దాశరథి చేసిన సూచన అప్పటికి.. ఇప్పటికి... ఎప్పటికీ ప్రాసంగికమే. ఈ పాటను విన్నప్పుడు మహాకవి శ్రీశ్రీ గుర్తుకురావడం శ్రోతల తప్పు ఎంతమాత్రం కాదు. అది దాశరథి కలానికి ఉన్న పదును. ఆయన భాషకు ఉన్న వేడి. ఆయన దార్శనికతకు ఉన్న ప్రత్యేకత.

– సత్య శ్రీ

# అందుబాటులో విజ్ఞానం


అంతర్జాతీయ బుక్‌ఫెయిర్‌లో ఆకట్టుకుంటున్న పుస్తకాల్లో ప్రధానంగా 'యు మస్ట్ లివ్' అనే పాలస్తీనా కవుల సమకాలీన కవితల సంకలనాన్ని పేర్కొవాలి. యుద్ధం, ఆక్రమణ, నిరాశ్రయ జీవితం, జ్ఞాపకాలు, ప్రతిఘటన, ఆశ వంటి అంశాలు ఇందులో ప్రధానంగా కనిపిస్తాయి. వ్యక్తిగత బాధను సామూహిక అనుభవంతో ముడిపెట్టి, పాలస్తీనా ప్రజల అస్తిత్వ పోరాటాన్ని కవిత్వం ద్వారా ప్రపంచానికి పరిచయం చేసే ముఖ్యమైన సంకలనం. అదే విధంగా, భారతీయ ఆంగ్ల కవి బిష్ణు మొహాపాత్ర రచించిన 'రెయిన్ ఇన్కార్నేషన్స్' కవితా సంపుటి ప్రకృతి, వర్షం, కాలం, జ్ఞాపకాలు, మానవ సంబంధాల చుట్టూ తిరుగుతుంది. వర్షాన్ని కేవలం ప్రకృతి సంఘటనగా కాకుండా పునర్జన్మ, మార్పు, ఆత్మపరిశీలనకు ప్రతీకగా చూపించడం ఈ కవితల ప్రత్యేకత. ఆఫ్రికన్–అమెరికన్ కవయిత్రి నిక్కీ జియోవన్ని రాసిన 'మేక్ మి రైన్' కవితా సంకలనం ప్రేమ, జాతి వివక్ష, స్వేచ్ఛ, మహిళా అనుభవాలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రతిబింబిస్తుంది. వ్యక్తిగత అనుభూతులను రాజకీయ చైతన్యంతో మేళవిస్తూ, ఆశావాదం, ప్రతిఘటనను కవిత్వ రూపంలో వ్యక్తపరుస్తుంది. ఇక, ప్రయోగాత్మక కవి ఎ/నిల్ (అ/నిల్) రచించిన 'ది అబ్సెంట్ కలర్' సంపుటి నగర జీవితం, గుర్తింపు, జ్ఞాపకాలు, శూన్యత, భాష పరిమితులను పరిశీలిస్తుంది. ఆధునిక జీవితంలోని ఒంటరితనం, విభజన, అంతర్ముఖ అనుభవాలను సంకేతాత్మక భాషలో వ్యక్తీకరించిన కవితలు ఇందులో ఉంటాయి. రంజిత్ హోస్కోటే రాసిన 'ఐస్‌లైట్' సంకలనంలో చరిత్ర, సంస్కృతి, పురాణం, కళ, వలస జీవితం, జ్ఞాపకాలు ప్రధాన అంశాలు. ఇందులో ప్రపంచ సంస్కృతుల మధ్య సంబంధాలు, కాలం ప్రభావం, వ్యక్తి అంతర్మథనం వంటి విషయాలు సున్నితమైన రూపకాలతో వ్యక్తమవుతాయి. మేధోపరమైన, బహుస్థర అర్థాలతో కూడిన కవితా సంపుటిగా ఇది గుర్తింపు పొందింది. విక్రమ్ సేథ్ రచించిన 'ఆల్ యు హూ స్లీప్ టునైట్' అనే ప్రసిద్ధ కవితా సంపుటి సరళమైన భాషలో లోతైన భావాలను వ్యక్తపరుస్తుంది. ప్రేమ, ఒంటరితనం, మానవ సంబంధాలు, కాలం, ప్రపంచవ్యాప్తంగా మనుషులను కలిపే అనుభూతులు ఇందులో ప్రధానాంశాలు. సంప్రదాయ ఛందస్సును




ఆధునిక భావాలతో సమన్వయం చేయడం ఈ కవితల ప్రత్యేకత. గోపికా జడేజా రచించిన 'వాట్ పార్వతి డస్ నాట్ సే' కవితా సంపుటి పురాణ పాత్ర పార్వతిని ఆధునిక మహిళా దృక్కోణంలో పునర్నిర్వచిస్తుంది. స్త్రీ స్వరం, మౌనం, శక్తి, ప్రేమ, ఆత్మగౌరవం వంటి అంశాలను స్త్రీవాద దృష్టితో పరిశీలిస్తుంది. పురాణాన్ని సమకాలీన జీవితంతో అనుసంధానించే ప్రయత్నం ఈ గ్రంథంలో కనిపిస్తుంది. తాన్యా సింగ్ కలం నుంచి జాలువారిన 'బ్లూ' కవితా సంపుటిలో 'నీలం' అనే రంగు ఒక భావప్రతీకగా మారుతుంది. ఒంటరితనం, ఆశ, నష్టం, ప్రేమ, స్వీయ అన్వేషణ వంటి భావోద్వేగాలను సున్నితమైన భాషలో వ్యక్తపరుస్తుంది. చిన్నచిన్న జీవిత క్షణాల ద్వారా పెద్ద భావ ప్రపంచాన్ని నిర్మించే ఆధునిక కవిత్వానికి ఇది ఒక ఉదాహరణ. అమెరికన్ కవి, రచయిత చార్లెస్ బుకోవ్స్కీ చివరి దశలో రాసిన కవితల సంకలనం 'ది లాస్ట్ నైట్ ఆఫ్ ది ఎర్త్'. వృద్ధాప్యం, మరణం, ఒంటరితనం, మద్యం, నగర జీవితం, ప్రేమ, రచయిత జీవిత అనుభవాలు ఇందులో ప్రధానంగా కనిపిస్తాయి. ఎలాంటి అలంకారాలు లేకుండా నేరుగా, నిజాయితీగా జీవితం గురించి చెప్పే బుకోవ్స్కీ ప్రత్యేక శైలి ఈ గ్రంథమంతా కనిపిస్తుంది. జీవితంలోని కఠిన వాస్తవాలను కూడా వ్యంగ్యంతో, హాస్యంతో, తాత్విక దృష్టితో చిత్రించడం ఈ కవితల విశేషం. కాగా, వివిధ దేశాలు, కాలాలకు చెందిన ప్రముఖ కవుల వంద కవితల సంకలనం '100 పోయెమ్స్ ఆర్ నాట్ ఎనఫ్'. ప్రేమ, ప్రకృతి, యుద్ధం, మానవ జీవితం, మరణం, స్వేచ్ఛ, ఆధ్యాత్మికత వంటి అనేక భావ ప్రపంచాలను పరిచయం చేస్తుంది. ప్రపంచ కవిత్వ వైవిధ్యాన్ని ఒకే గ్రంథంలో ఆస్వాదించాలనుకునే పాఠకులకు ఇది మంచి ఎంపిక. మంచి రచనలకు, అర్థవంతమైన కవితలకు పట్టం కట్టే పాఠకులు తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలో ఇవి చేరుతాయి. అంతర్జాతీయ స్థాయిలోనేగాక, వివిధ దేశాల్లో నగర, పట్టణ, గ్రామ స్థాయిల్లో కూడా ఇలాంటి పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అత్యవసరంగా మారుతున్నది. సాహిత్యాభిలాషనను పెంచడంతోపాటు, మంచి రచనలను, రచయితలను ప్రోత్సహించడానికి ఇదో ఉత్తమమైన మార్గం.

# చదవడానికి ఒక రోజు చాలు..

ప్రపంచ సాహిత్యంలో అత్యంత ప్రభావవంతమైన, ఒక రోజులో (సుమారు 24 గంటల్లో) పూర్తిగా చదివేయగలిగే 42 చిన్న పుస్తకాల సమాహారానికి సంబంధించిన పోస్టర్ ఒకటి ఇటీవల వివిధ మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. వీటిలో చాలా వరకు 80 నుంచి 250 పేజీల మధ్యే ఉంటాయి. పరిమాణంలో చిన్నవైనా, ఆలోచనల్లో, సాహిత్య విలువలో, తాత్విక లోతులో ఇవి అసాధారణమైన స్థాయిని కలిగి ఉన్నాయి. నవలలు, నవలికలు, వ్యాసాలు, స్మృతులు, తాత్విక గ్రంథాలు వంటి విభిన్న ప్రక్రియలకు చెందిన ఈ రచనలు ప్రపంచ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచాయి. ఈ జాబితాలోని కల్పిత సాహిత్య రచనలు మానవ జీవితం, సమాజం, రాజకీయాలు, ఆధ్యాత్మికత, ప్రేమ, ఒంటరితనం, స్వేచ్ఛ, నైతికత వంటి అనేక కోణాలను స్పృశిస్తాయి. రే బ్రాడ్‌బరీ రచించిన 'ఫారెన్‌హీట్ 451' భావప్రకటన స్వేచ్ఛను అణచివేసే నిరంకుశ సమాజాన్ని చిత్రిస్తే, హెర్మన్ హెస్సే యొక్క 'సిద్ధార్థ' ఆత్మజ్ఞానం కోసం మనిషి చేసే అంతర్ముఖ యాత్రను వివరిస్తుంది. జార్జ్ ఆర్వెల్ రాసిన 'యానిమల్ ఫార్మ్' రాజకీయ అధికార దుర్వినియోగంపై పదునైన వ్యంగ్య రచనగా నిలిచింది. 'ది లిటిల్ ప్రిన్స్', 'ది ఓల్డ్ మ్యాన్ అండ్ ది సీ', 'ది ఆల్కెమిస్ట్' వంటి రచనలు జీవిత పరమార్థం, ఆశ, మానవ ఆత్మవిశ్వాసం గురించి చిరస్మరణీయమైన సందేశాలను అందిస్తాయి. అదే విధంగా ఆల్బర్ట్ కామ్యూ రచించిన 'ది స్ట్రేంజర్', 'ది ఫాల్', ఫ్రాంజ్ కాఫ్కా రచించిన 'ది మెటామార్ఫసిస్', జోసెఫ్ కాన్రాడ్ రచన 'హార్ట్ ఆఫ్ డార్క్‌నెస్', చినువా అచేబే రాసిన 'థింగ్స్ ఫాల్ అపార్ట్', లియో టాల్‌స్టాయ్ రచన 'ది డెత్ ఆఫ్ ఇవాన్ ఇలీచ్', ఆస్కార్ వైల్డ్ యొక్క 'ది పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే' వంటి రచనలు అస్తిత్వవాదం, వలసవాదం, మానవ నైతికత, ఒంటరితనం, సామాజిక సంఘర్షణల వంటి సంక్లిష్ట అంశాలను అత్యంత లోతుగా పరిశీలిస్తాయి. మరోవైపు 'లార్డ్ ఆఫ్ ది ఫ్లైస్', 'ఏ క్లాక్‌వర్క్ ఆరెంజ్', 'ది హాంటింగ్ ఆఫ్ హిల్ హౌస్' వంటి రచనలు మానవ స్వభావంలోని చీకటి కోణాలను ఆవిష్కరిస్తాయి. కాల్పితేతర సాహిత్య విభాగంలో కూడా సమానంగా గొప్ప రచనలు చోటు చేసుకున్నాయి. సెనెకా రచించిన 'ఆన్ ది షార్ట్‌నెస్ ఆఫ్ లైఫ్', 'ఆన్ ట్రాంక్విలిటీ ఆఫ్ మైండ్' వంటి స్టోయిక్ తాత్విక గ్రంథాలు జీవితాన్ని సార్థకంగా ఎలా గడపాలనే విషయాన్ని వివరిస్తాయి. రైనర్ మారియా రిల్కే రచించిన 'లెటర్స్ టు ఎ యంగ్ పోయెట్' సృజనాత్మకత, కళ, ఒంటరితనం గురించి అరుదైన ఆలోచనలను అందిస్తుంది. సుసాన్ సోంటాగ్ యొక్క 'రిగార్డింగ్ ది పెయిన్ ఆఫ్ అదర్స్' యుద్ధం, హింస, మానవ బాధ, మీడియా పాత్రపై విశ్లేషణాత్మక దృక్పథాన్ని అందిస్తుంది. డేవిడ్ ఫోస్టర్ వాలెస్ ప్రసిద్ధ ఉపన్యాసం 'దిస్ ఈజ్ వాటర్' రోజువారీ జీవితాన్ని చైతన్యంతో ఎలా జీవించాలో తెలియజేస్తుంది. ఎలీ విజెల్ రచించిన 'నైట్' హోలోకాస్ట్ దుర్ఘటనకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన హృదయ విదారక స్మృతిగ్రంథం. మొత్తం మీద, ఈ 42 పుస్తకాలు పరిమాణంలో చిన్నవైనా, ప్రపంచ సాహిత్యంలో ఆధునికత, అస్తిత్వవాదం, రాజకీయ విమర్శ, మానవ సంబంధాలు, వలసవాదం, మానసిక సంఘర్షణలు, తాత్విక అన్వేషణ, ఆధ్యాత్మిక చింతన వంటి అనేక ప్రధాన అంశాలను అత్యంత ప్రభావవంతంగా ప్రతిబింబిస్తాయి. ఒక రోజులో ఒక మంచి పుస్తకం చదవాలనే అలవాటు పెంపొందించుకోవాలనుకునే పాఠకులకు ఇవి అద్భుతమైన మార్గదర్శకాలు. తక్కువ సమయంలో చదవగలిగే ఈ క్లాసిక్ రచనలు జీవితాంతం ఆలోచింపజేసే సాహిత్య అనుభూతిని అందిస్తాయి.




ఈ వారం కవితలు

## కాస్త నీ జాడచెప్పవా.. ప్లీజ్

నీతో ఏకాంతంగా మాట్లాడాలని
నీకోసం వెతుకుతున్నాను.
కులం గురించో.. మతం గురుంచో
ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే గాలిమాటల
గురించో మాట్లాడటానికి కాదు.!

శ్రమజీవుల గొంతును నీకు వినిపించాలని...
మతం మత్తులో కొట్టుకుపోతున్న
యువతరం గురించి నీకు చెప్పాలని...
పెరుగుతున్న ధరల తుఫానులో కొట్టుకుపోతున్న
పేద ప్రజల ఆర్తనాదాన్ని కనులారా నీకు
చూపించాలని నీకోసం వెతుకుతున్నాను.
స్వార్థపు మనిషి ముసుగుకప్పుకొని రంగస్థలం మీద
మనిషిలా నాటకం ఆడుతున్నావు కదా.
నిన్నెలా గురుతుపట్టేది.!

నేలరాలుతున్న కన్నీరును తుడిచి
నను ఓదార్చుతావని ఆశల దీపాన్ని
వెలిగించుకొని చూస్తున్నాను
మదిలోని బండరాయిలాంటి బాధల బరువును దించి
ధైర్యపు పసరును నూరిపోస్తావని ఎదురుచూస్తున్నాను.

గొంగలిపురుగులా ఉన్న నన్నుచూసి
నువ్వు ఛీదరించుకుంటున్నావేమో!
నీ ప్రేమ దోసిల్లలో ఒక్కసారి నను బంధించిచూడు.
రంగుల సీతాకొకచిలుకై నింగికి ఎగురుతాను.
ఆనందానికి చిరునామై నీ భుజంపై వాలుతాను.

నువ్వాడుతున్న నాటకం నాకు ఎరుకేలే.
చీకటిలో కొట్టుమిట్టాడుతున్న నా బతుకునుచూసి..
నిశీధికుడా చింతిస్తూ కూర్చుంది.
వెలుగును వెతుక్కుంటూ నాతోపాటు
యుద్ధం చేస్తూనే ఉంది.

నన్నునేనే ఓదార్చుకుంటున్నాను.
దిగులుగుండెతో నాతోనేనే మాట్లాడుకుంటున్నాను.
నాకు ఇపుడు ఒక మనిషితోడంటూ ఎవరూ లేరు.
ఓ మనిషీ... నిన్నెక్కడని వెతకాలి.
కాస్త నీ జాడ చెప్పవా ప్లీజ్.!

– అశోక్ గోనె
9441317361

## కరువు కురుస్తున్నది!



కనక ధారలై చినుకులు
కురువక
కరువు కురుస్తున్నది
కరువు కరువ కరువ వస్తున్నది!

కరువు అందరికీ ఉచితమే
కాకపోతే కొంచెం ముందు వెనక
అనుభవిస్తే కానీ తెలియదు
గులేబకావళి గుచ్ఛం తీర్చదు!

కరువు అంటే ఏదో దయ్యమో
భూతమో కాదు
దాహంతో మొదలై మెల్లగా
నిన్ను కాల్చకనే దహించే నిజం!

కరువు కరువు అనీ
ఏకరువు పెడితే ఏం లాభం
కరువును ఆహ్వానించే
కార్యాలకు స్వస్తి పలకాలి!

కరువును ఎదుర్కొనే
ఒకే ఒక్క ముందు అప్రమత్తత
పచ్చదనం పర్యావరణం
పరిరక్షణకు బద్ధకంకణులై ఉండాలి!

కరువొక్కటే రకాలు వేరు వేరు
దాహం తీర్చుటే మందు ముందు
భగీరథ ప్రయత్నం చేసైనా
కరువును జలకాడించాలి!

– పట్లోళ్ల బక్కారెడ్డి
9705315250

## ఉన్మాదాగ్నికణం!

రగిలే కామపు చిచ్చు ఉచ్చుకు
నిప్పుతో శుద్ధి చేసే తీర్పు రావాలి
నెత్తికెక్కిన కళ్ళ నెత్తుటి కిరణాల్ని
విచ్ఛిన్నం చేసే ఆగ్రహం ఎగసాలి
పసి కూనలని చూడకుండానే
పిడికిళ్ళో పిసికేసే క్రూరత్వాన్ని
బలి పీఠంపై పడుకోబెట్టాలి

ఆడపులిలా లంఘించి దూకే
ధీరత్వాన్ని కసిగా తయారుచేయాలి
కామపు కోరల మృగాల మెడలను
తునాతునకలు చేసే శిక్ష పడాలి
ఆడకూతురు భద్రకాళిగా
ఉగ్రరూపం దాల్చే ధీరవనితవ్వాలి
ఎచట పైశాచికత్వం పడగలిప్పితే
అచటనే విష కోరల్ని తెంపేయాలి

బుసలుకొట్టే కోరికల పాములను
అణగదొక్కే తత్త్వం స్త్రీలో పుట్టాలి
కన్నుగానక మసకబారిన ముఖంతో
చీకట్లో అన్వేషించే కాముకులకు
మలిపొద్దు చూడని శిక్ష విధించాలి

పూజించాల్సిన ఆడబిడ్డను
కబలించే చేతులను బంధించాలి

ఉన్మాదాగ్నికణంతో రగులుతూ
ఉచ్చు బిగించే అమానవీయతకు
చితి పేర్చి అగ్గిరవ్వను రాజేయాలి
అబల కాదు సబలనే హోమానికి
ధైర్యమనే నూనె పోసి వెలిగించాలి
కుటిల మనస్కులపైన కన్ను పెట్టి
కామ పిశాచులను తరిమికొట్టాలి

పాపపుణ్యాల బేరీజు వేయని
నీచపుతత్త్వాన్ని నీరుగార్చాలి
నేటి బాలికే రేపటి అమ్మతనమని
ఎరుగని మృగత్వాన్ని ఖండించాలి
మోసపు దారుల్లో నడిచే చోరుల్ని
స్త్రీ జాతిని వంచించే పురుగుల్ని
పాతాళానికి తొక్కే తీర్పు చెప్పాలి
ఆడబిడ్డల రక్షణ కవచమై చట్టం
ప్రతిక్షణం మూడో కంటితో చూడాలి

– నరెద్దుల రాజారెడ్డి
9666016636

### మెట్ట రైతులకు ఎకరాకు

# రూ.8వేల పరిహారమిచ్చి ఆదుకోవాలి!

ప్రభుత్వ సలహాదారు కమిటీ త్వరితగతిన సిఫారసు చేయాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్



**ప్రజాపక్షం/ యాదాద్రి :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, ఇప్పటికే మెట్ట పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే ఎకరాకు రూ.8వేల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. యాదగిరి గుట్ట పట్టణంలోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో జరుగుతున్న రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతుల నష్టాలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రభుత్వ సలహాదారు జి.చిన్నారెడ్డి నేతృత్వంలోని కమిటీ త్వరితగతిన సమావేశమై, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆమె కోరారు. సెప్టెంబర్ మాసంలో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం లేనందున, మెట్ట పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలను సరఫరా చేయాలని పశ్య పద్మ విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో వంటి ప్రకృతి సవాళ్లను తట్టుకుని రైతులు పండించే పంటలకు ప్రభుత్వం ముందస్తుగానే కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. తద్వారా మార్కెట్లో దళారుల చేతిలో రైతులు మోసపోకుండా అడ్డుకోవచ్చని, మార్కెట్ శక్తులను ప్రభుత్వం కఠినంగా నియంత్రించాలని సూచించారు. కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసి సుందిళ్ల, అన్నారం రిజర్వాయర్ల మీదుగా సాగునీటి ప్రాజెక్టులను నింపి రైతులకు అందించాలని బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఆమె ప్రస్తావిస్తూ, సాంకేతిక కారణాల వల్ల నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాల ప్రకారమే నడుచుకుంటామని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఈ గందరగోళానికి తెరదించాలంటే ఎన్‌డిఎస్‌ఎ అధికారులు మరోసారి ఈ బ్యారేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు, రైతులకు పూర్తి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు.

**అసంపూర్తిగా సాగునీటి నిపుణుల కమిటీ :** రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల నిపుణులతో వేసిన కమిటీ అసంపూర్తిగా ఉందని పశ్యపద్మ విమర్శించారు. తెలంగాణలోని సాగునీటి నిపుణులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, పూర్తిస్థాయి కమిటీని పునర్వ్యవస్థీకరించాలని, వారి విలువైన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రైతులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో పరిస్థితులను తట్టుకునేలా ఆధునిక సాగునీటి యాజమాన్య పద్ధతులపై జిల్లా, మండల స్థాయి వ్యవసాయ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

**సదస్సులో నిపుణుల ప్రసంగాలు :** ఈ శిక్షణా శిబిరంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గాదె శ్రీనివాస్ 'వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై వివరించారు. రిటైర్డ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 'గోదావరి, కృష్ణా జలాల వినియోగం పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి' అనే అంశంపై ప్రసంగించారు. మన నీటి వాటాను మనం సంపూర్ణంగా వినియోగించుకోవడానికి కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు యానాల దామోదర్ రెడ్డి, కొల్లూరి రాజయ్య, దొడ్డ వెంకటయ్య, డి.జి.నరేందర్ ప్రసాద్, ఎం.ప్రభులింగం, కొండపర్తి గోవిందరాజు, వర్ల వెంకటయ్య, కంజర భూమయ్య, నర్ల వెంకటయ్య, గోదా శ్రీరాములు, ఎస్.రవి, దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో రిక్షా డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే..

# కాంగ్రెస్‌కూ బిఆర్‌ఎస్‌కు పట్టినగతే

తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆటోరిక్షా డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే బిఆర్‌ఎస్‌కు పట్టినగతే కాంగ్రెస్‌కు పడుతుందని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక ధోరణి వలన రవాణారంగ కార్మికులతో పాటు అన్నిరంగాల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం (సత్యనారాయణరెడ్డి భవన్)లో తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) హైదరాబాద్ జిల్లా 4వ మహాసభలు యూనియన్ అధ్యక్షుడు ఎన్.అశోక్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా కార్యాలయం ముందు ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్, తెలంగాణ రాష్ట్ర ఆటో, మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం, ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఎఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్ల సమస్యలపై అనేక పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి కార్పొరేట్ సంస్థలను బ్యాన్ చేసి, రాష్ట్ర ప్రభుత్వమే వాటి స్థానాల్లో ఒక ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టాలని కోరారు. అలాగే పర్యావరణ పరిరక్షణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశ పెడుతున్న తరహాలో ఆటోలను కూడా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. బి.వెంకటేశం మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా ఆటో డ్రైవర్లు చేసిన పోరాటాలను గుర్తుచేశారు. కానీ, స్వరాష్ట్రం ఫలించిన ఆటో డ్రైవర్ల కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణారంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటి అనేక ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికై 28న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిఎ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నామని, అలాగే ఆగస్టులో ప్రభుత్వం కళ్లు తెరిచేలా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లను సమైక్యం చేసి 'చలో అసెంబ్లీ' కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.జంగయ్య, ఆఫీస్ బేరర్లు ఎండి. ఒమర్ ఖాన్, ఎ.బిక్షపతి యాదవ్, కొంరెల్లి బాబు, మున్నూరు కృష్ణ, ఎస్.కె. అతీఫ్, తిరుమలేష్ గౌడ్, ఎండి.ఆరిఫ్, ఎండి.సలీమ్, ఎండి.జాకిర్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## నేషనల్ ఎడ్యుకేటర్స్ అవార్డుల ప్రదానోత్సవం

ప్రతిభావంతులకు ఘన సన్మానం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శారద ఎడ్యుకేషనల్ సొసైటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతి వేదికగా 'నేషనల్ ఎడ్యుకేటర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన, అలాగే విస్తృతమైన సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ హాస్య నటుడు పృథ్వీరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలోనూ, విద్యారంగంలోనూ తమ వంతు కృషి అందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి గౌరవించడం అభినందనీయమన్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రస్ట్ చైర్మన్ పట్నం కమలాకర్, మనోహర్, పల్లెపహాడ్ జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఇటికాల రవీందర్ పాల్గొన్నారు.

## బైబ్యాక్ పేరుతో.. రూ.4.42 కోట్ల టోకరా..!

ఐ మార్క్ డెవలపర్స్‌పై సిసిఎస్ ఇఒడబ్ల్యూ కేసు నమోదు

పెట్టుబడిదారులకు రూ.కోటి హామీ..

గడువు ముగిసినా చెల్లింపులు చేయలేదని ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధిక లాభాలు, భూమికి హామీతో కూడిన బైబ్యాక్ ఆఫర్ పేరుతో పెట్టుబడిదారుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి, గడువు ముగిసినా డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐ మార్క్ డెవలపర్స్ సంస్థపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ కేసు నమోదు చేసింది. మొత్తం తొమ్మిది మంది పెట్టుబడిదారుల నుంచి రూ.4.42కోట్లు సేకరించి బైబ్యాక్ హామీలను అమలు చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మియాపూర్‌కు చెందిన భాస్కర్ బొమ్మెర ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, ఐ మార్క్ డెవలపర్స్ ప్రతినిధులు కె.నరసారెడ్డి, కె.నరసింహారావు ఫోన్ ద్వారా సంప్రదించి జూబ్లీ హిల్స్‌లోని కార్యాలయానికి పిలిచి, సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్ద గోపులారం గ్రామంలోని 'వెస్ట్ సిటీ క్యాపిటల్' ప్రాజెక్టులో పెట్టుబడి పెడితే నిర్ణీత గడువులో భారీ లాభాలతో బై బ్యాక్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీలను నమ్మిన ఫిర్యాదుదారు 2022 మే 9 నుంచి మే 27 మధ్య విడతల వారీగా రూ.70లక్షలు సంస్థ ఖాతాలో జమ చేశారు. తర్వాత ఒక ఎకరం వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేసి, 14 నెలల్లో (12+2 నెలల గ్రేస్ పీరియడ్‌తో) రూ.1 కోటి బైబ్యాక్ చేస్తామని ఎంఒయూ కుదుర్చుకుని, భరోసాగా నాలుగు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే గడువు ముగిసిన తర్వాత చెక్కులు బౌన్స్ కావడంతో పాటు, సంస్థ ప్రతినిధులు పదేపదే హామీలు ఇచ్చి చివరకు ఫోన్లు ఎత్తడం కూడా మానేశారని ఆరోపించారు. ఇదే తరహాలో మరో ఎనిమిది మంది పెట్టుబడిదారుల నుంచి కూడా వివిధ మొత్తాల్లో పెట్టుబడులు సేకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం తొమ్మిది మంది నుంచి రూ.4.42కోట్లు సేకరించి, బైబ్యాక్ హామీలను నెరవేర్చలేదని బాధితులు ఆరోపించారు. ఫిర్యాదులో సంస్థ మేనేజింగ్ పార్టనర్ అల్లు వెంకట్ రెడ్డితో పాటు సురేష్ దారా, లలిత్ కుమార్, వెంపల్లె సాయి కృష్ణ పేర్లను నిందితులుగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మోసం జరిగిందా? పెట్టుబడిదారుల నుంచి సేకరించిన నిధులు ఎక్కడికి మళ్లించారనే కోణంలో సిసిఎస్ ఇఒడబ్ల్యూ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

### ఘనంగా 'కొంపెల్ల జనార్దనరావు జీవితం

# సమగ్ర సాహిత్యం' గ్రంథావిష్కరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ సాహిత్యానికి ప్రాంతీయ సాహిత్యం తోడ్పడాలని, ప్రముఖ రచయిత కొంపెల్ల జనార్ధనరావు ఆకాంక్షించారని, ఆయన ప్రతి ప్రక్రియలో సాహిత్య సృజన చేశారని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమి మాజీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి అన్నారు. 'తెలుగు సాహితీ లోకంలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ రచయిత కొంపెల్ల జనార్ధన రావు స్మృత్యర్థం రూపొందించిన 'కొంపెల్ల జనార్దనరావు జీవితం సమగ్ర సాహిత్యం' గ్రంథావిష్కరణ సభ ఆదివారం తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం), నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్, రవీంద్ర భారతిలోని పైడి జయరాజ్ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ సభలో ఏటుకూరి ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

అరసం తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, విశాలాంధ్ర దినపత్రిక సంపాదకుడు ఆర్వీ రామారావు ఈ సభకు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమి మాజీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, గౌరవ అతిథిగా ఇప్టా జాతీయ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ ప్రతాప రెడ్డి హాజరయ్యారు. ఈ గ్రంథాన్ని నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం అభ్యుదయ భావాలతో సాగిన 'కొంపెల్ల జనార్ధన రావు రచనలు' ఎంతో విలువైనవని, ఇలాంటి సమగ్ర గ్రంథాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. ఈ రోజుల్లో పుస్తకం తీసుకురావడానికి పరిశోధకులు కూడా సిద్ధంగా లేరని, కానీ ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్‌లు కొంపెల్ల జనార్ధనరావు పుస్తకం తీసుకురావడానికి చాలా శ్రమించారని కొనియడారు.

ఏటుకూరి ప్రసాద్ తనకున్న పాండిత్యాన్ని పక్కన పెట్టి, అనేక ముఖ్యమైన పుస్తకాలు తీసుకొచ్చారన్నారు. ఏటుకూరి ప్రసాద్ నిస్వార్థ త్యాగపురుషుడన్నారు. కొంపెల్ల జనార్ధన రావు జీవితం సమగ్ర సాహిత్యం పుస్తకం ఉన్నంత కాలం ఏటుకూరి ప్రసాద్ ఉంటారని అన్నారు. 'ఉదయిని పత్రిక' కోసం జనార్ధన రావు తన ఆరోగ్యాన్ని పనంగా పెట్టారన్నారు. అనంతరం కందిమళ్ళ ప్రతాప్ రెడ్డి తమ కుటుంబాల మధ్య ఉన్న అనుబంధాన్ని సాహిత్య పనుల్లో డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ నిబద్ధతను వివరించారు. ఆర్వీ రామారావు మాట్లాడుతూ పుస్తక ప్రచురకర్త ఏటుకూరి ప్రసాద్ గొప్ప పాండిత్య వేత్త అని కొనియడారు. ఆయన తన పాండిత్యాన్ని దాచుకున్నారని, అనేక పాటలు రాశారని గుర్తు చేసుకున్నారు. ఆయన సాహిత్యం కన్నా వ్యక్తిత్వం గొప్పదని కొనియడారు. అనేక మంది సాహితివేత్తలను ఏటుకూరి ప్రొత్సహించారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ ఆహ్వానం పలుకగా, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం వందన సమర్పణ చేశారు. ఈ సభలో అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, నవచేతన విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ మధుకర్, ప్రముఖ హిందీ సాహితీవేత్త డాక్టర్ టి.సి.వసంత, గ్రంథ సంపాదకులు, పాత్రికేయులు, సాహితీవేత్త యామిజాల ఆనంద్, ప్రముఖ కవి, విమర్శకులు కొంపెల్ల కామేశ్వర రావు ప్రసంగిస్తూ కొంపెల్ల జనార్దనరావు, ఏటుకూరి ప్రసాద్ జీవిత విశేషాలను, అభ్యుదయ సాహిత్యంలో వారు పోషించిన అద్వితీయ పాత్రను గుర్తు చేశారు. ఈ సభలో తెలంగాణ అరసం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పల్లేరు వీరస్వామి, అరసం నాయకులు అరుణ్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బిసి కుటుంబాలను లెక్కించాల్సిందే

కుల గణనకై పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీగా పోరాడుతాం

ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ ఓబిసి మహాసభను విజయవంతం చేయాలి : మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తుతం జరుగుతున్న జాతి జనగణలో ఓబిసి కుటుంబాలను లెక్కించాలని, బిసి కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంట్‌లో పోరాడుతామని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ ఓబిసి మహాసభలకు హాజరుకావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి ప్రతినిధుల బృందం ఆదివారం హైదరాబాదులో మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి ఆహ్వానించారు. అనంతరం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి మహేష్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో బిసిలకు చట్టబద్ధమైన హక్కులు దక్కాలంటే జాతి జనగణలో సమగ్ర కులగనన చేపట్టి బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో బిసి రిజర్వేషన్ల బిల్లు, మహిళా బిల్లులు బిసి మహిళలకు సబ్ కోట, డీలిమిటేషన్ డిమాండ్లపై పార్లమెంటులో తమ పార్టీ తరఫున పోరాడుతామని, ఇందుకు రాహుల్ గాంధీని ఒప్పిస్తామని ఆయన తెలిపారు. ఆగస్టు 7 న బెంగళూరులో జరిగే జాతీయ ఓబిసి మహాసభకు బిసిలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మా తదితరులు పాల్గొన్నారు.

### బడ్జెట్ నిధులపైన ఆధారపడకుండా..

## కొత్త ఆర్థిక నమూనాలను రూపొందించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బడ్జెట్ నిధులపైన ఆధారపడకుండా సాగునీటి సంస్థలకు స్థిరమైన ఆదాయ వనరులను కల్పించేందుకు కొత్త ఆర్థిక నమూనాలను రూపొందించాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా సాగునీటి సంస్థల ఖాళీ భూముల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని, లేదా వాటిని లీజుకు ఇచ్చి ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. సాగునీటి సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణను రూపొందించాలని, రుణభారం తగ్గించి, తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలను సమీకరించేలా పది రోజుల్లో సమగ్ర ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో సాగునీటి సంస్థల ఆర్థిక పరిస్థితి, నిధుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణ అంశంపైన ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఇంజనీర్‌ఇన్‌చీఫ్ (జనరల్) రమేష్ బాబు, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గత రుణభారం లేని ఒక సాగునీటి సంస్థ ద్వారా కొత్త నిధులను సమీకరించే అవకాశాన్ని ఈ సమావేశంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిజాంసాగర్‌తో పాటు ఇతర జలాశయాల పరిసరాల్లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల సాధ్యతను అధ్యయనం చేయాలన్నారు. కొత్త ఆదాయ మార్గాల వల్ల రైతులపైన ఎటువంటి అదనపు భారం పడకూడదని మంత్రి స్పష్టం చేశారు.అన్ని ప్రతిపాదనలను చట్టపరంగా పరిశీలించిన తర్వాతే వాటిని అమలు చేయాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక సంవత్సరాల చట్టబద్ధ ఆడిట్లను వెంటనే పూర్తి చేయాలని, ఆడిటర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తక్కువ పెట్టుబడితో త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే శాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల పూర్తి వివరాలను 15 రోజుల్లో సిద్ధం చేసి వనరుల సమీకరణకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ పరిహారానికి సంబంధించిన నిదులను ఇప్పటికే విడుదల చేసిన నేపథ్యంలో రైతులకు ఆలస్యం లేకుండా ఆ నిధులు చేరే విధంగా చూడాలని మంత్రి అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

**11 శాతం వడ్డీని తగ్గించేలా చూడండి...**

గతంలో అధిక వడ్డీతో తీసుకున్న రుణాలను తక్కువ వడ్డీకి పునర్వ్యవస్థీకరిస్తే ప్రభుత్వంపై పడుతున్న ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం సుమారు 11 శాతం వడ్డీతో ఉన్న రుణాలను తక్కువ వడ్డీకి మార్చితే ఏటా సుమారు రూ.250 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రతి సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన రుణ వివరాలు, వడ్డీ, చెల్లింపులు, పనుల పురోగతి, పూర్తి చేయడానికి అవసరమైన నిధులు తదితర అంశాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

**సమష్టిగా నిలబడదాం..**

# మిషన్ మోడ్‌లో ఎల్‌నినోను ఎదుర్కొందాం

కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హాజరైన మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వార్డు సభ్యుడి నుంచి ఎంపి వరకు, పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణారావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్ సింగ్, సంజయ్ కుమార్, గంగుల కమలాకర్, కల్వకుంట్ల సంజయ్, మేయర్లు కొలగాని శ్రీనివాస్, స్వామి, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేష్ దత్ ఎక్కా, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, సిపిలు, ఎస్పీలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా జిల్లాలో ప్రాజెక్టుల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆరుతడి పంటల ప్రోత్సాహం, విద్యుత్ సరఫరా, రైతులకు అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కార్యాచరణ ప్రణాళిక తీసుకుంటున్న చర్యలను సమావేశంలో వివరించారు.జిల్లాల కలెక్టర్లు, సిపిలు, ఎస్పీలు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్తుతో జిల్లా స్థాయి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలపై కూడా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో వర్షపాతం ఆశించిన స్థాయిలో నమోదుకాకపోవచ్చని, అందువల్ల ముందస్తు చర్యలే ప్రజలను రక్షిస్తాయని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభలు, రైతు వేదికలు, రైతు నేస్తం కార్యక్రమాల ద్వారా ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, నీటి వినియోగంలో పొదుపు పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవని, భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

**రాజకీయాలకు అతీతంగా ఎల్‌నినో సవాల్‌ను ఎదుర్కొందాం..మంత్రి దుద్దిళ్ల :** ఎల్‌నినో ప్రభావం రాష్ట్రం ముందున్న పెద్ద సవాల్ అని, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసి రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జిల్లాల కలెక్టర్లు స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌తో క్షేత్రస్థాయిలో పనిచేసి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కూడా రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి రైతులు, ప్రజలను ఆదుకునే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. విలువైన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి అందించి ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

**వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి..**

**మంత్రి పొన్నం ప్రభాకర్ :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టాలని, ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి (మాండేటరీ) చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. వర్షపు నీటి ప్రతి చుక్కను భూమిలోకి పంపించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, దీనిని ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు.

**కరోనా స్ఫూర్తితో ఎల్‌నినోను అధిగమిద్దాం :**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ :** కరోనా మహమ్మారి సమయంలో అందరూ సమష్టిగా పనిచేసి సంక్షోభాన్ని అధిగమించినట్లే, ఇప్పుడు ఎల్‌నినో కారణంగా ఏర్పడుతున్న విపత్కర పరిస్థితులను కూడా సమన్వయంతో ఎదుర్కోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ అప్రమత్తంగా పనిచేయాలని, ప్రజల్లో ధైర్యం నింపాలని మంత్రి సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, విజయరమణరావు, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ సీఎస్ మహేశ్ దత్ ఎక్కా, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్‌లు మాట్లాడారు.

## సమస్యలకు నిలయంగా సంక్షేమ వసతి గృహాలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని వసతి గృహాలను ఎఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలు సమస్యల నిలయంగా కొట్టుమిట్టాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మించాలని అనేకసార్లు అధికారులకు తెలియజేసినా నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం నూతన హాస్టల్ సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హాస్టల్ అధ్యక్షురాలుగా భార్గవి, కార్యదర్శిగా దీక్షిత వారితో పాటు 12 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు గుగులోతు అనిల్ కుమార్, బానోతు బాలాజీ, మండల నాయకులు అఖిల్ రామ్ చరణ్ లిఖితేష్, మరియు అలేఖ్య మేఘన వెన్నెల కావ్య శ్రీ పాల్గొన్నారు.

## ర్యాలీకి సిసిఎ సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాక్రోచ్ పార్టీ సోమవారం తలపెట్టిన జంతర్ మంతర్ ర్యాలీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఖమ్మం ప్రత్యామ్నాయ పౌర సమాజం (సిసిఎ) తెలిపింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను భగ్నం చేయడాన్ని సిసిఎ తీవ్రంగా ఖండించింది. దేశంలో లక్షలాది మందితో చెలగాటమాడిన నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం స్పందించకపోవడం యువత పట్ల అమర్యాదగా వ్యవహరించడం సరి కాదన్నారు. పర్యావరణ ఉద్యమకారుడు, గొప్ప విద్యావేత్త వాంగ్‌చుక్ దీక్ష పట్ల కేంద్రం అనుసరించిన వైఖరి సమర్థనీయం కాదన్నారు. ఇటు కాంగ్రెస్ కానీ, అటు బిజెపి కానీ నిరాహార దీక్షకు మద్దతు తెలియజేయకపోవడం సరి కాదని కేంద్ర నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన పార్టీలు మౌనం వహించడాన్ని సిసిఎ తీవ్రంగా ఖండించింది. నిన్న మొన్నటి వరకు అన్నదాతలను విచ్చిన్నకారులు అన్న కేంద్రం ఇప్పుడు యువతరాన్ని, విద్యార్థులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తుందన్నారు. ప్రజలు హక్కుల కోసం పోరాడాలని పోరాడితేనే హక్కులు పరిరక్షించబడతాయని సిసిఎ కమిటీ తెలిపింది. ప్రకటన విడుదల చేసిన వారిలో సిసిఎ బాధ్యులు రవి మారుత్, కాకి భాస్కర్, డాక్టర్ గోపినాథ్, చిర్రా రవి, డాక్టర్ రవీంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన కారణాల రీత్యా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు దరఖాస్తులు ఇచ్చేందుకు రావద్దని ఆయన సూచించారు.

## సిపిఐ రాజకీయ శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల స్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు ఈనెల 24 నుంచి నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. కారేపల్లి, కామేపల్లి మండలాల శిక్షణా తరగతులు ఈనెల 24న, వైరా, కొణిజర్ల మండలాల స్థాయి శిక్షణా తరగతులు ఈనెల 28న, ఖమ్మం టౌన్, రఘునాథపాలెం మండల శిక్షణా తరగతులు ఈనెల 29న జరుగుతాయని సురేష్ తెలిపారు. బోనకల్, చింతకాని, మధిర శిక్షణా తరగతులు ఈనెల 30న, బోనకల్‌లో సత్తుపల్లి నియోజక వర్గ స్థాయి శిక్షణా తరగతులు ఆగస్టు ఒకటిన, ఖమ్మం రూరల్ మండలం తిరుమలాయపాలెం శిక్షణా తరగతులు ఆగస్టు రెండున, ఏన్కూరు మండల శిక్షణా తరగతులు, ఆగస్టు మూడున జరుగుతాయన్నారు. నేలకొండపల్లి , కూసుమంచి, ముదిగొండ మండల స్థాయి శిక్షణా తరగతులు నేలకొండపల్లిలో జరుగుతాయన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో వర్గ పోరాటం, సామాజిక న్యాయం, జాతీయోద్యమం, కమ్యూనిస్టు పార్టీ పాత్ర, పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం, తక్షణ కర్తవ్యాలు అనే అంశాలను బోధించడం జరుగుతుందన్నారు.

## ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే కోరం కనకయ్య

**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ శాసన సభ, శాసన మండలి సంయుక్త లెజిస్లేచర్ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాలోతు రామదాసు నాయక్, మామిడాల యశస్విని రెడ్డి, పి రాకేష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీలు సుంకరి రాజు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, వంటేరు యాదవరెడ్డిలను నియమించారు. ఈమేరకు శాసన మండలి కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు, శాసన సభ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి సంయుక్తంగా బులెటిన్ విడుదల చేశారు. కోరం కనకయ్య నియామకంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## వర్షం కోసం గ్రామదేవతలకు పూజలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల గ్రామంలో రైతులు , గ్రామస్థులు, యువకులు ఆదివారం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని బోడ్రాయి, ముత్యాలమ్మ, మైసమ్మ చెట్టు వద్ద జలాభిషేకాలు చేసి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిపించాలని రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఆశించిన మేర వర్షాలు కురవక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వరుణుడి ప్రసన్నమై సమృద్ధిగా వర్షాలు కురిపించి పంటలను కాపాడాలని వేడుకున్నారు. గ్రామస్థులు మంచిగా వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా కురువాలని ప్రత్యేక పూజలు చేశారు.

# రామాలయాభివృద్ధి పనులు పుష్కరాల నాటికి పూర్తి


జిల్లాలో మంత్రి పొంగులేటి సుడిగాలి పర్యటన

భద్రాద్రి రామాలయాభివృద్ధి పనులు పరిశీలన

ఎమ్మెల్యే కూనంనేనితో కలిసి

రూ.351 కోట్ల పనులకు శంకుస్థాపన





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రూ.351 కోట్ల నిధుల అంచనాలతో నిర్వహిస్తున్న భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామివారి ఆలయాభివృద్ధి పనులు రానున్న పుష్కరాల నాటికి పూర్తి చేయాలని రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లాలో మంత్రి ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత భద్రాచలం రామాలయానికి చేరుకున్న ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామాలయాభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావుతో కలిసి పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు నిర్వహించాలని సూచించారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆలయాభివృద్ధి పనులు, పుష్కరాల పనులపై చర్చించారు. అక్కడి నుండి పినపాక నియోజకవర్గ పరిధిలోని గొందిగూడెం నుండి మొండికుంట వరకు నిర్మిస్తున్న సుమారు 15 కిలోమీటర్ల బిటి రోడ్డును ప్రారంభించారు. గొందిగూడెం ఆశ్రమపాఠశాల స్కూల్ బిల్డింగ్‌ను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. మణుగూరు మండల పరిధిలోని గట్టుమల్లారంలో రూ.1కోటి అంచనాలతో బిటి రోడ్డు, రూ.2.5 కోట్ల అంచనాలతో లంకమల్లారం వద్ద హై లెవల్ వంతెనకు పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర్‌లో మంత్రి పొంగులేటి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు నిర్వహించారు. అనంతరం పినపాక పట్టీనగర్ నుండి ఉప్పుసాక వెళ్లే సుమారు రూ.2.20 కోట్ల బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రీ భూసర్వేలు చేయించి రెవెన్యూ, అటవీ భూముల సమస్యల పరిష్కారించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పాల్వంచ పట్టణ కేంద్రం దమ్మపేట సెంటర్ నుండి శ్రీనివాస కాలనీ వరకు రూ.14 కోట్ల అంచనాలతో నాలుగు వరసల రహదారి విస్తరణ నిర్మాణానికి, మంచికంటినగర్ నుండి ఎస్‌కె అపార్ట్‌మెంట్స్ వరకు రూ.50 లక్షల అంచనాలతో సిసి రోడ్డు, రూ.50 లక్షల అంచనాలతో కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు నుండి గోదుమవాగు వరకు సెంట్రల్ డివైడర్ల పనులకు ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రివెంట అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించడానికి ఈ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రెండున్నర ఏళ్లుగా రాష్ట్రంలో రహదారులు, విద్యుత్, విద్య, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం కృషి జరుగుతుందన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. అడవిమద్దులపల్లి గ్రామంలో రూ.2.85 కోట్ల అంచనాతో నిర్మించనున్న విద్యుత్ ఉప కేంద్రానికి ఆయన భూమి పూజ చేశారు. 33/11కెవి విద్యుత్ ఉప కేంద్రం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని ఈ సందర్భంగా విక్రమార్క తెలిపారు. తాళ్లగూడెం నుంచి నర్సయ్యకుంట వరకు రూ.3.95 కోట్ల వ్యయతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణానికి, కామేపల్లి స్మశానవాటిక నుంచి ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు నిర్మించనున్న ఆర్అండ్‌బి రహదారికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డును రూ.5కోట్ల అంచనాతో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, రాందాస్ నాయక్, కలెక్టర్ దివాకర టిఎస్, ట్రాన్స్‌కో ఎండి వరుణ్ రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ట్రాన్స్‌కో డైరెక్టర్ మోహన్‌రావు, ఎస్ఈ శ్రీనివాసాచారి, కామేపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఊహాజనిత వార్తలు ఖండిస్తున్నాం

సిపిఐ ప్రజాప్రతినిధులపై

అసత్య ప్రచారాలు మానుకోవాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజాప్రతినిధుల వ్యక్తిత్వాన్నిదెబ్బతీసేలా వార్తలు రాయడం జర్నలిజం విలువలకు విరుద్ధమని సిపిఐ ప్రజాప్రతినిధులపై బురదచల్లే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికల్లో ఆధారాలు లేని ఊహాజనిత తప్పుడు వార్తలను ప్రచురించడం సరి కాదన్నారు. సిపిఐ ప్రజాప్రతినిధులపై ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం వెనుక ఎవరి హస్తం ఉందో తెల్చుకుంటామని ఆయన అన్నారు.కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ కార్పొరేటర్ పడాల ఆకాంక్ష మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పనులపై హైదరాబాద్ వెళ్లిన క్రమంలో తమ సామాజికవర్గానికి చెందిన రాష్ట్రనేత, ఎంపి ఈటెల రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా మాత్రమే కలిశామని స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణలను ఆ పత్రికా యాజమాన్యం వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సలిగంటి శ్రీనివాస్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, నేరెళ్ల రమేష్ పడవాల భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బూటకపు మెడికల్ బోర్డును రద్దు చేయాలి: మిరియాల రంగయ్య

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన సింగరేణి మెడికల్ బోర్డు ప్రక్రియ పూర్తిగా బూటకమని, దానిని వెంటనే రద్దు చేసి గతంలో అమలు చేసిన విధానంలోనే రీమెడికల్ బోర్డు నిర్వహించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చే శారు. ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి ఇచ్చిన సమ్మె నోటీసు ఫలితంగానే యాజమాన్యం మెడికల్ బో ర్డు నిర్వహించేందుకు ముం దుకొచ్చిందని, అ యితే 17, 18 తేదీల్లో జరిగిన బోర్డు పారదర్శకంగా జరగలేదని ఆరోపించారు. ఎంక్వైరీ పేరు తో దళారీల జోక్యాన్ని పెంచి కార్మికులు, వారి కుటుంబాలను మోసం చేసే ప్రయ త్నం జరుగుతోందని విమర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులను ఇన్వాలిడేషన్ చేయకుండా వారి కుటుంబాల భవిష్యత్తుతో యాజమాన్యం చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మెడికల్ బోర్డుకు ఉన్న రెండేళ్ల కాలపరిమితి నిబంధనను తొలగించి, సిక్ లో ఉన్న కార్మికుడికి ఇన్వాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం పేరుతో యాజమాన్యం కాలయాపన చే యకుండా వెంటనే కార్మికులకు న్యాయం చేయాలని, లేకపోతే సింగరేణి వ్యా ప్తంగా ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మదన్ సింగ్ మరణం సిపిఐకి తీరని లోటు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** సిపిఐ సీనియర్ నాయకులు, సుజాతనగర్ రైతు సంఘం మండల అధ్యక్షుడు, అమరజీవి భూక్య మదన్ సింగ్ మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు అని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సుజాతనగర్ మండలంలోని సీతంపేట బంజర గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి భూక్య మదన్ సింగ్ స్థూ పాన్ని ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు బాగం శేషభూషణం ఆవిష్కరించారు. ఈ సంతాప సభ భూక్య ప్రతాప్ సింగ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భూక్య మదన్ సింగ్ తన తుది శ్వాస వరకు పార్టీకి ఎనలేని కృషి చేశారని, రైతు సంఘం అధ్యక్షులుగా ఎంతో సేవ చేశారని వారి కుటుంబం మూడు తరాల నుండి పార్టీకి చేసిన సేవలు గురించి గుర్తు చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబానికి సిపిఐ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ మండల కార్యదర్శి వీర హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య దస్రు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాములు, పాపారావు, వెంకటేశ్వరరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ధర్మారావు, లావుడియా గోపి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు వీర్ల మల్లేష్, సుజాతనగర్ టౌన్ కార్యదర్శి బొడ్డు కేశవరావు, సిపిఐ మండల నాయకులు కుణుసోత్ శంకర్, బోడ రమేష్ , మాలోత్ శంకర్,కుమారి కృష్ణ, సిపిఐ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మధిర సిగలో మరో మణిహారం

ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుకు జిఒ విడుదల



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అభివృద్ధి విషయంలో పరుగులు పెడుతూ అనేక చారిత్రక నిర్మాణాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు వేదికగా మారిన మధిర సిగలో మరో మణిహారం చేరనుంది. ఈ ప్రాంత విద్యార్థులు సాంకేతిక విద్యలో మరింత పురోగమించేందుకు ఉపయోగపడే రీతిలో ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఆధీనంలో ఏర్పాటు చేయనున్న రెండవ ఇంజనీరింగ్ కళాశాల ఇది. గత ప్రభుత్వం పాలేరు నియోజకవర్గం మద్దులపల్లిలో జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు ఈనెల 18న రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి యోగితా రాణా జీవోను విడుదల చేశారు. మధిర ప్రాంతం ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే విద్యాపరంగా అగ్రగామిగా ఉండేది. ఈ ప్రాంతం నుంచి అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ శాఖల్లో అత్యున్నత బాధ్యతలను నిర్వర్తించారు. భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయలను మంజూరు చేయిస్తున్నారు. ముఖ్యంగా రవాణా రంగంలో రాష్ట్రంలోనే మధిర ప్రథమ స్థానంలో నిలవనుంది. వందల కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం జరుపుతూ ప్రతి పల్లెనూ అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే మధిర నియోజక వర్గంలో బిటి రోడ్డు లేని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. సౌర విద్యుత్ రంగంలోనూ మధిర నియోజక వర్గం ముందు వరుసలో నిలిచింది. గృహ అవసరాలతో పాటు వ్యవసాయ రంగానికి కూడా సౌర విద్యుత్‌ను ఉపయోగించుకునేందుకు మధిర నియోజక వర్గంలో సిరిపురం గ్రామాన్ని ఎంపిక చేసి సౌర విద్యుత్‌కు మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతున్నారు. బోనకల్ మండలం రావినూతలలో నూటికి నూరు శాతం సౌర విద్యుత్‌ను వినియోగించేలా పనులు జరుగుతున్నాయి. జవహర్ ఎత్తిపోతల పథకం పేరుతో ఒక పక్క పలు లిఫ్ట్ ఇరిగేషన్‌లు గోదావరి జలాల సద్వినియోగంతో నియోజక వర్గంలో సాగు నీటి కొరతను నివారించేందుకు ప్రయత్నం జరుగుతుంది. ఆసుపత్రుల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు తదితర వాటి ఏర్పాటుకు కృషి చేస్తున్న భట్టి విక్రమార్క ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయడంతో ఈ ప్రాంతం విద్యాపరంగా మరోసారి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

## పెరిగిన నిరుద్యోగం దేశానికి ప్రమాదకరం

ఉద్యోగ, ఉపాధి కల్పనలో పాలకులు విఫలం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల



**ప్రజాపక్షం/ చింతకాని :** పెరిగిన నిరుద్యోగం దేశానికి పెను సవాల్‌గా మారిందని ఇప్పటికే ప్రమాద ఘంటికలు మోగిస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆదివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల మహాసభ స్థానిక గంగవరపు విజయ్‌కుమార్ భవన్‌లో జరిగింది. అబ్బూరి మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచలో ఎక్కడ లేనివిధంగా దేశ జనాభాలో సగ భాగం యువత ఉందని యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలకు సరైన ప్రణాళిక లేదన్నారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన మోడీ ఇప్పుడు గుడులు, గోపురాలు, మతం ఎజెండాగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగం పూర్తిగా ప్రైవేటు రంగంగా మారిపోయిందని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని నియంత్రిస్తున్న సమయంలో ఉపాధి, ఉద్యోగ హక్కుల కోసం పోరాటాలే శరణ్యమని జమ్ముల తెలిపారు. చారిత్రిక నేపథ్యం కలిగిన అఖిల భారత యువజన సమాఖ్య నేతృత్వంలో హక్కుల కోసం పోరాడుతూ సమాజ మార్పుకు కృషి చేయాలన్నారు. పెరిగిన నిరుద్యోగం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని అందుకు యువత సంసిద్ధులు కావాలన్నారు. ఈ మహాసభలో మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు మద్దోజు శ్రవణ్, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్, కొల్లి రవికుమార్, గనపారపు ఉపేందర్, మామిళ్ల కిరణ్, సిపిఐ నాయకులు మార్గం శ్రీను, సత్యనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

### ఎఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక :

అఖిల భారత యువజన సమాఖ్య మండల అధ్యక్షులుగా షేక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా భాను, కార్యనిర్వహక అధ్యక్షులుగా వెం కన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాంబాబు తో పా టు 17 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## మల్లన్న కైంకర్య సేవల్లో అభివృద్ధి కమిటీ జోక్యం

ఉలుకూ పలుకూ లేని దేవాదాయ, ధర్మాదాయ శాఖ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలోఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో గుంటు మల్లేశ్వర స్వామి పుణ్య క్షేత్రమొకటి. నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంత భక్తులకు గుంటుమల్లేశ్వర స్వామిని భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. సనాతన దేవాలయంగా పేరొందిన ఈ దేవాలయంపై అభివృద్ధి కమిటీ పేరుతో కొందరి పెత్తనం, ఆలయంలో జరిగే నిత్య పూజలకు, కైంకర్య సేవలకు అడ్డంకిగా మారింది. అత్యంత ప్రాశస్త్యం కలిగి స్వయంభూ శైవ క్షేత్రంగా వెలుగొందుతున్న ఈ ఆలయానికి సంబంధించి ఇటు భక్తులకు అటు స్వామి సేవలో ఉన్న పూజారులకు అభివృద్ధి కమిటీ పేరుతో ఆ మధనుడి అధికార దర్పం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఆలయ కమిటీ చైర్మన్ కోసం విశ్వ ప్రయత్నం చేసి విఫలమైన వ్యక్తి దొడ్డిదారిలో అభివృద్ధి కమిటీ పేరుతో ఒక పదవిని తెచ్చుకుని ఆలయంపై పెత్తనం చేస్తున్నాడన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిత్య పూజా క్రతువుల్లో ఈ మధనమోహనుడు జోక్యం చేసుకుంటూ ప్రతి దానికి వెనకా ముందు మంత్రి పేరు ఉపయోగిస్తున్నాడు. మంత్రికి చెప్పమంటారా?, తీసేయమంటారా?, మౌనంగా ఉంటారా? అన్న మాటలు తప్ప ఈయన నోటి నుంచి మరో మాట వినపడటం లేదు. అభివృద్ధి చేయాల్సిన అభివృద్ధి కమిటీ ఇతరత్రా విషయాల్లో జోక్యం చేసుకుని ఆలయ ప్రతిష్టకు కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈయనకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖలో అధికారులు నోరు విప్పే పరిస్థితి లేదు. ప్రభుత్వ నిర్ణయాలను సైతం అడ్డుకుంటూ అభివృద్ధి కమిటీ పేరుతో ఉన్న ఆయన తలను తోక ఆడించినట్లుగా మొత్తం దేవాలయ కార్యక్రమాలను తన కనుసన్నల్లో జరిగేందుకు సిద్ధం చేసుకుంటున్నాడు. ప్రతి దానికి మంత్రి పేరు ఉపయోగిస్తూ పూజారులను వారి నిత్య కార్యక్రమాలను కూడా చేయనిచ్చే పని లేదు. తాను ఒక అధికారిలా, చైర్మన్‌లా తెల్లకాగితాలపై హామీలు రాయించుకుం టూ అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయమై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి పరోక్ష పెత్తనాన్ని అరికట్టాలని గుంటు మల్లేశ్వరునికి నిత్య పూజా నైవేద్య కార్యక్రమాలు యధాతథంగా జరిగేలా చూడడంతో పాటు ఆలయ కమిటీని కాదని అభివృద్ధి కమిటీ పేరుతో జరుగుతున్న ఈ తతంగాన్ని నిలువరించాలని భక్తులు కోరుతున్నా రు.



## పెట్రోల్ దాడిలో గాయపడిన కాంగ్రెస్ నాయకుడు మహేశ్ మృతి



**ప్రజాపక్షం/వరంగల్ :** కాంగ్రెస్ పార్టీకి చెందిన 14వ డివిజన్ మాజీ అధ్యక్షుడు అడుప మహేష్‌పై శనివారం అర్ధరాత్రి దారుణ హత్యాయత్నం జరిగింది. వినాయకుల ఎన్జీఆర్ నగర్‌కు చెందిన అడుప మహేష్‌ను దుండగులు నిర్మానుష్య ప్రదేశానికి పిలిచి, పెట్రోల్ పోసి నిప్పంటించారు. కాలిన గాయాలతో ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అడుప మహేష్ ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో వెంటనే హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఎన్జీఆర్ నగర్‌కు చెందిన పత్రి కుమార్ శనివారం రాత్రి కోటిలింగాల ఆలయ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి రావాలని అడుప మహేష్‌ను పిలిచాడు. అక్కడికి వెళ్లిన తర్వాత మద్యం సేవించినట్లు, అక్కడే ఉన్న కుమార్ అనే వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే వద్ద తన గురించి ఏమి చెప్పావని మహేష్‌ను ప్రశ్నించాడు. సమాధానం చెప్పేలోపే మహేష్ ఫోన్ లాక్కుని, దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. తీవ్ర గాయాలతోనే ప్రాణాలు దక్కించుకోవడానికి మహేష్ ఎన్జీఆర్ నగర్‌కు చేరుకోగా స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. తనపై హత్యాయత్నం చేసిన పత్రి కుమార్, తనకు సహకరించిన వారిని గుర్తించాలని మహేశ్ వీడియో ద్వారా పోలీసులను కోరారు. తనను, తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు. కాగా ప్రధాన నిందితుడు పత్రి కుమార్ గతంలోనే ఒక హత్య కేసులో జీవిత ఖైదు పడి, బెయిల్‌పై బయటకు వచ్చాడని అడుప మహేశ్ తెలిపారు. రాజకీయ కక్షల వల్లే పత్రి కుమార్ ఈ దారుణానికి పాల్పడ్డాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. మహేష్ విడియో సామాజిక మాధ్యమల ద్వారా ప్రచారం అయింది.

## దీక్షను విరమింపజేసిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** మామునూరు మండల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆదివారం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సందర్శించి,వారికి నిమ్మరసం అందించి నిరాహారదీక్ష విరమింపజేశారు.మామునూరును నూతన మండల రెవెన్యూ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ స్థానికులు,మామునూరు మండల సాధన సమితి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి గతంలో కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గారు దీక్ష శిబిరాన్ని పలుమార్లు సందర్శించి మామునూరును మండల కేంద్రంగా చేయాలనే పట్టుదలతో రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కమిటీ సభ్యులతో కలిశారు.మంత్రి హామీ ఇవ్వడంతో ఆదివారం ఎమ్మెల్యే దీక్ష చేపట్టిన వారికి మామునూరు దీక్ష శిబిరంలో నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఎమ్మెల్యే సొంత మండలం కావడం వల్ల తొందరగా సంధించిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు,కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు.అనంతరం ఎంతో కృషితో పట్టుదలతో 48 గంటల దీక్షలో పాల్గొన్న వారికి ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఆయుబ్,కన్వీనర్ ఎర్ర విజయ్,కోకన్వీనర్లు మాచర్ల యాదగిరి,బండి సాంబయ్య యాదవ్, నల్లతీగల కోటేశ్వర్,నోముల ముత్తారెడ్డి,మన్నే ఓదెలు,సోషల్ మీడియా కన్వీనర్ కిషోర్ కుమార్,గూడూరి పాపయ్య,మేడిపల్లి నాగేందర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఆర్ఆర్ బంగ్లా సర్పంచ్



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా పాలన ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం చేపడుతున్న సేవా కార్యక్ర మాలకు ఆకర్షితులై ఆదివారం మండలంలోని ఆర్ఆర్ బంగ్లా గ్రామ సర్పంచ్ సునీతకనక రాజు బిఆర్ఎస్ పార్టీకి గుడ్ బాయ్ చెప్పి హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో ఆమెకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించడం జరిగింది. ఈ చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుం దనే అభిప్రాయం నాయకులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లాకావత్ ధన్వంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె మహేం దర్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని లక్ష్మి నారాయణపురం బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ బొడిగె ప్రదీప్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి హైధరాబాద్‌లో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రదీప్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సత్యనారాయణ, మదార్, శ్రీశైలం, కొమురయ్య, మణెమ్మ, యాకాంతరావు, సుధాకర్, ఉపేందర్, పాల్గొన్నారు.

## మంత్రి నాటిన మొక్కలకే రక్షణ కరువు

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో వనమహోత్సవంలో నాటిన మొక్కలు సంరక్షణ లేక నాశనమవుతున్నాయని 9వ వార్డు కౌన్సిలర్ గండ్రకోట వాణికుమార్ ఆరోపించారు. ఇటీవల కలెక్టర్, మంత్రి సీతక్క ఆధ్వర్యంగా బండారుపల్లి రహదారిపై 9, 14, 15 వార్డుల పరిధిలోని మెయిన్ రోడ్డు డివైడర్‌లో సుమారు రూ.50వేల వ్యయంతో మొక్కలు నాటారని తెలిపారు. మొక్కల చుట్టూ కనీస రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో మేకలు, పశువులు వాటిని ధ్వంసం చేస్తున్నాయని చెప్పారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా స్పందించలేదని విమర్శించారు. మంత్రి స్వయంగా నాటిక మొక్కలు అధికారులు సంరక్షించలేకపోతే ప్రజా సమస్యల పరిష్కారంపై ఎలా నమ్మకం కలుగుతుందని ప్రశ్నించారు. ప్రజాధనం వృథా కాకుండా మిగిలిన మొక్కలకు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సంరక్షణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

ఎంపి కడియం కావ్యకు ఎఐఎస్ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ ఎంపీతో విస్తృతంగా చర్చిస్తూ, ప్రతిపాదిత బిల్లులోని నిబంధనలు దేశ విద్యా వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను సమాన హక్కుగా కాకుండా కేంద్రీకృత నియంత్రణ వైపు మళ్లించే పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, రాష్ట్రాల విద్యా విధాన నిర్ణయాధికారాలు బలహీనపడే అవకాశం ఉందని వివరించారు. అదేవిధంగా సామాజిక న్యాయం, సమాన విద్యావకాశాలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణ, విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లును సమగ్రంగా పునఃసమీక్షించి ఉపసంహరించుకోవాల్సిన అవసరం ఉందని కోరారు.విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలని, ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఎంపీని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన కడియం కావ్య ప్రతినిధుల అభిప్రాయాలను శ్రద్ధగా విన్నారు. వారు ప్రస్తావించిన అంశాలను పరిశీలించి, తగిన స్థాయిలో చర్చించేందుకు సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, జిల్లా సమితి సభ్యులు కొండగట్ల అజయ్, హేమంత్, ప్రణీత్, సాయికుమార్, మహేష్, నిహాల్, రాజు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి పేదలకు అండ: ఎమ్మెల్యే గండ్ర

254 మందికి రూ.96.17 లక్షల చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సీఎం సహాయ నిధి పేద వర్గాల ప్రజలకు ఎంతో అండగా నిలుస్తుందని, అధిక ఆసుపత్రుల ఖర్చుతో వైద్యం చేయించుకున్న రోగులకు కొంత ఉపశమనం కల్పిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని మంజూర్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 254 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.96 లక్షల 17 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం అధిక వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో కవర్ కాని చికిత్సల కోసం ఖర్చులు చేసిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిధి ద్వారా ఆర్థిక ఉపశమనం లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర కొమురయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నీట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానం




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్... 2026 పరీక్షలో ప్రతిభ కనబరిచిన న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హైస్కూల్ విద్యార్థి ఎండి అదనాన్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కరీమాబాద్ అండర్ రైల్వే గేట్ సమీపంలోని పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమానికి కరస్పాండెంట్ కోడం శ్రీధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుండే క్రమశిక్షణ, పట్టుదలతో చదివితేనే లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. విజయం ఒక్క రోజులో సాధించేది కాదని, నిరంతర శ్రమ, అంకితభావంతోనే ఉన్నత ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. నీట్ పరీక్షలో 720 మార్కులకు గాను అదనాన్ 528 మార్కులు సాధించి 97.10 పర్సంటేజ్ నమోదు చేశాడని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కోడం సబిత మాట్లాడుతూ విద్యార్థులు ఆదనాన్ విజయాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాల దిశగా కృషి చేయాలని సూచించారు. న్యూ కౌటిల్యాస్ సెయింగ్ ఆమెన్ హైస్కూల్ విద్యార్థులు విద్యతో పాటు పలు పోటీ పరీక్షల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఆద్నాన్‌ను అభినందించారు.

## కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

రైల్వే జెఏసి ఆధ్వర్యంలో కాజీపేటలో ప్రజా పాదయాత్ర

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/కాజీపేట:** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే జేఏసీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మాడికొండ నుంచి కాజీపేట రైల్వే జంక్షన్ స్టేషన్ వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వరంగల్ ప్రాంత యువత ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఉద్యోగాల కల సాకారం కావాలని అన్నారు. ఫ్యాక్టరీలో కల్పించే ఉద్యోగాల్లో స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ విషయంలో రైల్వే జేఏసీ తీసుకునే నిర్ణయాలకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని, జేఏసీ నాయకత్వంలో ఉద్యమం ఐక్యంగా కొనసాగాలని పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీలో సుమారు మూడు వేల ఉద్యోగాలను స్థానిక యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేని యువతకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వం, సంబంధిత సంస్థలు ముందుకు రావాలని, అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించేందుకు తాము కూడా సహకరిస్తామని తెలిపారు. స్థానిక యువతకు వారి అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అదేవిధంగా, కోచ్ ఫ్యాక్టరీ కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు కూడా తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రాంత అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు మైలురాయిగా నిలవాలంటే స్థానికులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ కన్వీనర్ కొండ్ర నర్సింగరావు, కన్వీనర్ దేవులపల్లి రాఘవేంద్రరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య టిఆర్ఎస్ నాయకురాలు ఆవాల రాధిక రెడ్డి, తొట్ల రాజు యాదవ్, ఎంసిపిఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, వాస్కుల నాగరాజు, సిపిఎం నాయకులు ఓరుగంటి సాంబయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, రాస మల్ల దీన, బండ్లోజు రాజమణి, దొమ్మటి ప్రవీణ్ కుమార్, గోకల రాజయ్య, పసునూరి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలి

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/నర్సంపేట:** మారుతున్న వాతావరణ పరిస్థితులు, నీటి వనరుల లభ్యతకు అనుగుణంగా రైతులు పంటల సాగు విధానాన్ని మార్చుకుని శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి రైతులకు సూచించారు. ఆదివారం నర్సంపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన నీటి వనరుల లభ్యత వర్షాభావ పరిస్థితులు, ఆరుతడి పంటలపై రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట డివిజన్ పరిధిలో 6 మండలాల పరిధిలోని రైతులు వర్షాభావ పరిస్థితుల దృశ్య ప్రభుత్వ నిర్దేశాల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలను వెయాలన్నారు. నర్సంపేట నియోజక వర్గ పరిధిలో మొత్తం 1,30 వేల ఎకరాల వ్యవసాయ సాగు చేస్తున్నాం అని, ఇట్టి సాగు పాకాల చెరువు, రంగయ్య చెరువు,మాదన్నపేట చెరువు కింద సాగుచేయడం జరుగుతుందని, మిగతా చిన్న చిన్న చెరువులు , బోర్ల ద్వారా పడుతున్నాయని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎల్ నినో ప్రభావం వలన మబ్బులు కనిపిస్తున్నాయి కాని ,వర్షాలు పడకపోవడం, లేదా అధిక వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం నిర్దేశించిన ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. చెరువుల కింద రైతులు అఖిలపక్షం కమిటీలను ఏర్పాటు చేసుకొని రానున్న కాలంలో రైతులు ఎలాంటి పంటలు పండించాలి అనే దాని కార్యచరణ ప్రణాళికలు చేయాలని అందుకు అధికార యంత్రాగం కృషి చేయాలని అన్నారు. యాసంగి ప్రణాళికలు కూడా సిద్ధం చేసేలా క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా నీటి వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరు తడి పంటల సాగుపై శాస్త్రీయ సూచనలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, అదనపు కలెక్టర్ తహసిల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణ: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాఖ యూనిట్లలలో వివిధ భాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు నిర్వహించిన వ్రాత పరీక్షలు విజయవంతంగా జరిగాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యూనిట్ 1, 2 విభాగాలలో ఖాళీగా ఉన్న పలు పోస్టులను భర్తీ చేయుటకు గాను ఆదివారం కలెక్టరేట్‌లో పరీక్షను నిర్వహించారు. జేసి బెన్షాలోమ్‌తో కలిసి కలెక్టర్ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌డీసీ 1, 2 విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులలో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై భర్తీ చేయుటకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. మొత్తం 615 మంది అభ్యర్థులు దరఖాస్తులు స్వీకరించగా 446 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ నిర్వహణలో అధికారులు కుమారస్వామి, గౌసియాబేగం, తదితరులు పాల్గొన్నారు.

## చిన్న వానకే జలమయమైన ఆత్మకూరు బస్టాండ్




**ప్రజాపక్షం/ఆత్మకూరు:** కాంట్రాక్టర్ కాసుల కక్కుర్తి, అధికారుల కమిషన్ల మత్తు, వెరసి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు... ఇది ఆత్మకూర్ బస్టాండు దుస్థితి...ఆత్మకూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కొద్దిపాటి వర్షానికి నీళ్లు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు ఎక్కడానికి దిగడానికి వారి పాట్లు అగమ్య గోచరంగా మారు స్తావా సందర్భంగాతున్నది. ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చేటువంటి సమ్మక్క సారలమ్మ మేడారం జాతర సందర్భంగా బస్టాండ్ ఆవరణలో మొరం పోయ డానికి కాంట్రాక్టు ద్వారా మొరం పోస్తూ ఉంటారు. కాంట్రాక్టు తూతూ మంత్రంగా మొరంజల్లి తలాపిడికడు కాసులు పంచుకున్నట్లు ఉంటుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సరైన కాంట్రాక్టు విధానంతో, సరైన కాంట్రాక్టర్ తో పనులు చేయించి బస్టాండ్ లో నీళ్లు నిలవకుండా, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూచుకోవాలని అధికారులను ప్రయాణికులు కోరుకుంటున్నారు..

## మామునూరు విమానాశ్రయం నిర్మాణ నమూనా పరిశీలన

ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగి రెడ్డితో వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రత్యేక సమావేశం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు చాటిచెప్పేలా, కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచే విధంగా మామునూరు విమానాశ్రయం నిర్మాణం జరుగుతుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు.ఈ మేరకు హైదరాబాద్‌లో భారతీయ దేవాలయ వాస్తుశిల్పం, శిల్ప శాస్త్రం, వారసత్వ పరిరక్షణ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ స్థపతి, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి డాక్టర్ ఈమని శివనాగి రెడ్డితో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈమని శివనాగి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన పలు డిజైన్ నమూనాలను పరిశీలించి, వాటిపై సవివరంగా చర్చించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు మామునూరు విమానాశ్రయం రూపకల్పనలో వరంగల్ చారిత్రక విశిష్టత, కాకతీయుల వారసత్వం స్పష్టంగా కనిపించేలా డిజైన్ రూపొందించాలని ఎంపీ సూచించారు. విమానాశ్రయం రూపకల్పనలో కాకతీయుల శిల్పకళా వైభవం, వాస్తు సంప్రదాయాలు, వరంగల్ చారిత్రక గుర్తింపును ప్రతిబింబించే అంశాలను పొందుపరచాలని వరంగల్ డాక్టర్ కడియం కావ్య గారు వారిని కోరారు. దేశ విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయంలో అడుగుపెట్టిన క్షణం నుంచే వరంగల్ గొప్ప చారిత్రక, సాంస్కృతిక నగరమనే భావన కలిగేలా నిర్మాణ శైలి ఉండాలని ఎంపీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల ఆలయం, కాకతీయుల అద్భుత శిల్ప సంపదను ప్రతిబింబించే ఆకృతులు, నమూనాలు విమానాశ్రయ నిర్మాణంలో కనిపించేలా చూడాలని ఈ సందర్భంగా కోరారు.వరంగల్‌కు గర్వకారణంగా నిలిచే ఈ విమానాశ్రయం, భవిష్యత్ తరాలకు కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని పరిచయం చేసే సాంస్కృతిక చిహ్నంగా రూపుదిద్దుకోవాలని ఎంపీ కడియం కావ్య ఆకాంక్షించారు.

## మరో ప్రాణాన్ని బలిగొన్న విహారయాత్ర

గుండం జలపాతంలో యువ ఎలక్ట్రీషియన్ మృతి

ములుగు జిల్లా జలపాతాల్లో పది రోజుల వ్యవధిలో రెండో విషాదం



**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలం అరుణాచలపురం అటవీ ప్రాంతంలోని గుండం జలపాతంలో ఆదివారం విషాద ఘటన చోటు చేసుకుంది. విహారయాత్రకు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన యువ ఎలక్ట్రీషియన్ సయ్యద్ అక్తరుద్దీన్ (23) నీటిలో మునిగి మృతి చెందాడు. ఇటీవలే మాసంలొద్ది జలపాతంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మరువకముందే మరో విషాదం చోటుచేసుకోవడం స్థానికులను కలచివేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గాజులరామారంకు చెందిన సయ్యద్ అక్తరుద్దీన్ తండ్రి సయ్యద్ మొయినుద్దీన్ తన స్నేహితులు దూదేకుల అక్బర్, మహమ్మద్ ఇలియాస్, మహమ్మద్ అన్వర్ అలీలతో కలిసి బైక్‌లపై ఆదివారం తెల్లవారుజామున గుండం జలపాతాన్ని సందర్శించేందుకు వచ్చారు. జలపాతాన్ని వీక్షిస్తున్న సమయంలో నీటి లోతును అంచనా వేయకుండా నీటిలోకి దిగడంతో ఒక్కసారిగా లోతైన ప్రాంతంలో మునిగిపోయాడు.అది గమనించిన అతని స్నేహితులు వెంటనే నీటిలోకి దిగి అక్తరుద్దీన్‌ను బయటకు తీసి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం భుజాలపై మోసుకుంటూ కొంతదూరం తీసుకువస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అటవీ శాఖ,ఫైర్ సిబ్బంది, వాజేడు ఎస్సై జక్కుల సతీష్ గ్రామస్తులను సంఘటన స్థలానికి పంపించారు. గ్రామస్తులు, యువకులు, అటవీ శాఖ సిబ్బంది కలిసి అతి కష్టంతో బాధితుడిని బైక్ సహాయంతో ప్రధాన రహదారిపై ఉన్న అంబులెన్స్ వరకు తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది మరోసారి సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ములుగు జిల్లాలోని జలపాతాలను వీక్షించేందుకు తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. అయితే అనుమతి లేని జలపాతాల వద్ద సరైన హెచ్చరిక బోర్డులు, రక్షణ సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మాసంలొద్ది జలపాతంలో జరిగిన మృతి ఘటన తర్వాత కూడా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే గుండం జలపాతంలో మరో ప్రాణం బలికావడానికి కారణమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. .ప్రమాదకర ప్రాంతాల్లో పర్యాటకులను అడ్డుకునేందుకు కఠిన చర్యలు, శాశ్వత హెచ్చరిక బోర్డులు, భద్రతా సిబ్బంది, అవసరమైన రక్షణ పరికరాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో పర్యాటకులు కూడా సాహసాలకు పోకుండా, నీటి లోతు తెలియని ప్రాంతాల్లోకి దిగకూడదని, అటవీశాఖ సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. వరుసగా జరుగుతున్న ఈ తరహా ప్రమాదాలు ములుగు జిల్లా జలపాతాల భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

## ధర్మపురిలో వేగంగా అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణంలో అభివృద్ధి పనులు అన్ని వార్డులలో వేగంగా జరుగుతున్నాయని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ తెలిపారు.ఆదివారం 12వ వార్డులో రూ.24 లక్షలతో డ్రైనేజీ,సిసి రోడ్ల పనులకు ఆమె శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సహాయ సహకారాలతో ధర్మపురి పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. 13 వార్డ్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్ ,కౌన్సిలర్ లు చుక్క సంధ్య,కొమురెల్లి పవనకుమార్,ప్రజాప్రతినిధులు,మున్సిపల్ అధికారులు, వార్డు నాయకులు , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి పోలింగ్ బూత్‌లో 'సర్' హెల్ప్ డెస్క్ ఏర్పాటు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రతి పోలింగ్ బూత్ లో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మండల పార్టీ అధ్యక్షులకు సూచించారు. ఆదివారం సిరిసిల్ల కే కన్వెన్షన్ హాల్ లో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల వివిధ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సమావేశానికి హాజరైన సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి నుండి పదిరోజుల వరకు సర్ ప్రక్రియ బిఎల్ఓలతో సమాచారం సేకరించాలన్నారు. ప్రతి ఓటర్ ఇంటిని సందర్శించాలని సూచించారు. ఒక్క ఓటైన మిస్ కాకుండా ప్రామాణికంగా తీసుకొని సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు, వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, నూతనంగా ఎన్నికైన వివిధ మండలాల అధ్యక్షులు, సర్ ప్రక్రియ నియోజకవర్గ ఇన్చార్జులు, సూపర్వైజర్లు,బూత్ ఇన్‌చార్జులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌ను కలిసిన పెద్దపల్లి పాక్స్ నూతన కమిటీ



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) నూతనంగా ఎన్నికైన చైర్మన్ ముత్యాల నరేష్ ముదిరాజ్, కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణారావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విప్ విజయరమణారావు చైర్మన్ ముత్యాల నరేష్, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకొని సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని, సహకార సంఘాన్ని రైతులకు మరింత ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని విజయ రమణారావు నూతన కమిటీకి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పాక్స్ సిఈఓ మెట్టు మధు, డైరెక్టర్లు నాంసాని సతీష్, ఎనగందుల రవీందర్, పిన్ రెడ్డి సుధాకర్ రెడ్డి, మేకల మల్లేష్, కలవేన సంపత్, జూపల్లి తిరుపతి రావు, ధోనేటి స్వరూప,వేల్పుల శ్రీనివాస్, పూరేళ్ల శంకర్ గౌడ్, భగీరం శ్రీనివాస్, ఈదునూరి ప్రసన్న, మానుపాటి రవి పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని విప్ విజయ రమణారావు ఘనంగా సన్మానించారు.

## జగన్నాథ స్వామి ఆలయంలో జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం /సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో ఆదివారం జగన్నాథ స్వామి ఆలయంలో పూజలలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. వారి వెంట నాయకులు ఆకుల రమేష్, భూక్య భారతి, చిరంజీవి, మాజీ సర్పంచ్ ఆజ్మీర శ్రీలత శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ జెడ్పిటిసి కొలుముల రమణ, మాజీ వైస్ ఎంపిపి రాంచంద్ర రెడ్డి, ప్రసాద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బేర మహేష్, నర్సింహ రెడ్డి, ఆనంద్ రెడ్డి, జగన్, మల్లేశం, సతీష్ గౌడ్, రవి, రాయమల్లు, గంగమల్లు,పురుషోత్తం,మదన్, బాస మల్లేశం తదితర నాయకులు పాల్గొన్నా రు.

## అందరిపై అమ్మవారి కటాక్షం

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/ వేములవాడ:** అమ్మవారి కటాక్షం అందరిపై ఉండాలనీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా వేములవాడ పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం,వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ అమ్మవారి కటాక్షంతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, మంచి వర్షాలు కురిసి రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు.

# వర్షాలు కురవాలని కోరుతూ వరుణయాగం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అడ్లూరి





**ప్రజాపక్షం/ధర్మపురి :** రాష్ట్రంలో వర్షాభావ నేపథ్యం లో వర్షాలు కురిసి రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వరుణ యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కు మార్ హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ వా తావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పుల కారణంగా ఈ ఏ డాది వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చె ందుతున్న నేపథ్యంలో సకాలంలో వర్షాలు కురియాలని ధర్మపురి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.రాష్ట్ర ప్రజలు రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగా ధర్మపురి క్షేత్రంలో వర్షాల కొరకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురావాలని కోరుతూ ధర్మపురి క్షేత్రంలో ఆదివారం వరుణయాగం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో సరైన వర్షాలు లేక రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ల ఆదేశాల మేరకు ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి అనుబంధ ఆలయం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ ంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రా ష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని కోరుతూ ఆలయంలో సంకల్పం,కలశ గణపతి పూజ,108 కలశాల స్థాపన,వరుణ జపాలు,108 కలశాలతో రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం, వరుణ హోమం,పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పాల్గొన్నారు.దేవస్థాన ఈఓ సంకటాల శ్రీనివాస్,మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్,ఎఎంసి చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మ ణ్,దేవస్థానం మాజీ చైర్మన్ జక్కు రవీందర్,ఆలయ సూపరింటెండెంట్ అలువాల శ్రీనివాస్,వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ,పాలేపు ప్రవీణ్ శర్మ,నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, నంబి శ్రీనివాసచార్యులు,భక్తులు పాల్గొన్నారు.

## విబిఎస్ఎ బిల్లును వ్యతిరేకించాలి

**ప్రభుత్వ విద్యారంగా బలోపేతం కోసం కృషి * పెద్దపల్లి ఎంపికి ఎఐఎస్ఎఫ్ బహిరంగ లేఖ* ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రేపటి నుండి జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో విబిఎస్ఎ బిల్లు వ్యతిరేకించి, ప్రభుత్వ విద్యార ంగ బలోపేతం కోసం కృషి చేయాలని కోరుతూ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకి బహిరంగ లేఖ ఏఐఎస్ఎఫ్ పె ద్దపల్లి జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింద ని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం పే ర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భా రత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు 2025 ను తీవ్రంగా వ్యతిరేకిస్తుందని,ఎందుకంటే ఇది రాజ్యాంగ పరిమితులను ఉల్లంఘిస్తూ కేంద్ర మరియు రా ష్ట్రాల మధ్య ఫెడరల్ (సమాఖ్య) విధానాన్ని బలహీన పరుస్తుందని,సంస్థాగత స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తుందని, ఉ న్నత విద్య యొక్క ప్రజాస్వామ్య మరియు సమగ్ర స్వభావాన్ని ముప్పులోకి నెడుతుందని,అదేవిధంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రజాస్వామ్య హక్కులపై ప్రభావాలను చూపుతుందని ఆయన అన్నారు.దేశంలో ఉన్న విద్యారంగ నియంత్రణ సంస్థలైన యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇ ండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ), స్థానంలో ఒ కే ఒక సర్వోన్నత సంస్థగా విబిఎస్ఏ (విబిఎస్ఎ)ను ఏర్పాటు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. విద్యా నియంత్రణ సంస్థలు కేవలం ప్రభుత్వంలో ఒక భాగంగా మారిపోతాయ ని,వర్సిటీల స్వయం ప్రతిపత్తి ( అటానమీ) పూర్తిగా దెబ్బతింటుందని, బిల్లు ద్వారా ఉన్నత విద్యపై రాష్ట్రాలకు ఉన్న హక్కులను కేంద్రం లాక్కుంటోందని,ఐఐటి,ఐ ఐఎమ్,ఎన్ ఐటి, ఐఐఐటి,ఐఐఎస్ఇఆర్‌కూడా విబిఎస్ఎ నియంత్రణలోకి వస్తే విద్యారంగానికి స్వయంకృత ఎక్కడుంటుందని, రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగించేలా ఈ బిల్లు ప్రతిపాదనలు ఉన్నాయని,ఇది పూర్తిగా ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి వ్యతిరేకంగా ఈ బిల్లు ఉందని, ప్రతిపాదిత బి ల్లులోపై అంశాలను తమరు పరిశీలించి,ప్రభుత్వ విద్యారంగా బలోపేతం కోసం ఆ బిల్లును వ్యతిరేకించి, పార్లమెంటులో చ ర్చించాలనిఎఐఎస్ఎఫ్ గా కోరుతున్నామని ఆయన అన్నారు.

## ప్రభుత్వ భూమి కబ్జాదారుల చేతుల్లో



### సిపిఐ పట్టణ అధ్యక్షుడుపంతం రవి, నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటి వేణు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో గత ప్రభు త్వ పాలనలో కబ్జాకు గురైన భూమి ఇంకా సుమా రు 700 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాదారుల చే తుల్లోనే ఉందని సిపిఐ నాయకులు ఆరోపించారు. ఆదివారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సిపిఐ పట్టణ శాఖ కార్యదర్శిల సమావేశము అజ్జ వేణు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి గుంటి వేణు మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ హయాంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో బి ఆర్ఎస్ నాయకులు అప్పటి ప్రభుత్వ అధికారుల అండతో సుమారు 900 ఎకరాల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారని అన్నారు. అధికారుల అండతో రిజిస్ట్రేషన్స్ కూడా చేసుకోవడం జరిగిందని, ఈ విషయంపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్పందించి ప్రభుత్వ స్థలాలను తిరిగి స్వాధీన పరచుకోవడానికి అప్పటి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల కబ్జా దారులపై కఠినంగా వ్యవహరించడం వల్ల కబ్జాదారుల నుండి సుమారు 200 ఎకరాల స్థలాన్ని స్వాధీన పరుచుకున్నారని అన్నారు. కబ్జా చేసుకొనుకున్న స్థలాలకు రైతుబంధు పథకం ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అక్రమంగా పొందుతున్నారని ఆరోపించారు. కబ్జాదారుల చేతుల్లోనున్న ప్రభుత్వ స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని ఇప్పటివరకు వారు రైతుబంధు రూపంలో లబ్ధి పొందిన ప్రజాధనాన్ని రికవరీ చేసుకుని వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సోమ నాగరాజు, రాయమల్లు పాల్గొన్నారు.

## నర్సారెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదు

### మైనంపల్లిని అడ్డుకోకుంటే కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం తప్పదు



**ప్రజాపక్షం / గజ్వేల్:** రాజకీయాల్లో సర్వం కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అశోక్, మాజీ ఎంపిపిలు బాగ నోళ్ల మోహన్, విద్యాసాగర్, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వర్గల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ కుటుంబం నుండి వచ్చిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి 200 ఎకరాలకు పైగా భూమిని కోల్పోగా, పార్టీ పటిష్టతకు ఆ కుటుంబం నాటి నుండి త్యాగం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి రాలేదనే కోపంతో మనోహరాబాద్ మహిపాల్ రెడ్డి విమర్శలు చేస్తుండగా, ఆయనకు నర్సారెడ్డి జీవగంజి పోసి రాజకీయ బిక్ష పెట్టిన విషయాన్ని మర్చిపోవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే భాస్కర్ రెడ్డిని తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి నర్సారెడ్డి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తు చేస్తూ ఆయన చేసుకున్న ద్రోహం తోనే పదవి దక్కకుండా పోయిందని అన్నారు. గ్రూపులను ప్రోత్సహిస్తూ మైనంపల్లి హన్మంత రావు పార్టీకి భస్మాసురుడిగా మారగా, నియోజకవర్గంతో ఎ లాంటి సంబంధం లేని కొందరిని ఆయన రెచ్చగొడుతూ విమర్శలు చేయిస్తున్నట్లు ఎద్దేవా చేశారు. మైనంపల్లి అ నుచరుల చరిత్రంతా ప్రతీ ఒక్కరికి తెలిసిందేనని, తాము నోరు విప్పితే వారు రోడ్డుపై తిరగలేరని చెప్పారు. కాగా వారిని దూషించడానికి తమకు సంస్కారం అడ్డు వస్తుందని, తాము నోరు విప్పితే అంతకన్నా ఎక్కువ తిడతామని అన్నారు. నిరంతరం కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటున్న నర్సారెడ్డి ఆర్థికంగా, అంగ బలం కలిగిన కెసిఆర్‌ను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. పార్టీలో చిచ్చు పెడుతున్న హన్మంత రావును పార్టీ అధిష్టానం అడ్డుకోకుంటే కాంగ్రెస్ పార్టీకి కష్టాలు తప్పవని, అలాగే పద్ధతి మార్చుకోకుంటే మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మైనంపల్లి అనుచరుల భరతం పడతామని హెచ్చరించారు. కాగా జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, మైనంపల్లి హన్మంత రావు చర్యలతో జరుగుతున్న నష్టాన్ని సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి పరిశీలకులు మీనాక్షి నటరాజన్ దృష్టికి తెస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు వహీద్, సర్పంచులు, నేతలు చెన్నయ్య, గణేష్, రవికుమార్, గోరేమియా, కుమార్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, లక్ష్మీనారాయణ, భాను గౌడ్, జయరాంలు గౌడ్, పిట్ల రాజు, మక్తాల రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ ఎక్సెల్ క్యాంపస్‌లో 'నయా దౌర్' సాంస్కృతిక వేడుకలు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ఆల్ఫోర్స్ ఎక్సెల్ క్యాంపస్ నయా దౌర్ పేరుతో నిర్వహించిన ఫ్రెషర్ పార్టీ వేడుకలు కొత్తపల్లిలోని ఒక ప్రై వేట్ వేడుక మందిరంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి హాజరై సరస్వతి మాత విగ్రహానికి పూజ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాల ను ఏర్పాటు చేసుకొని తల్లిదండ్రుల ఆశయాలను నె రవేర్చాలని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విషయ పరిజ్ఞానానని పెంచుకోవడమే కా కుండా వివిధ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చా టి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ఎంతోమంది విద్యార్థులు తమ ప్రతిభతో అమూల్యమైన అవకాశాలను సొంతం చేసుకొని పటిష్టమైన స్థానాలలో స్థిరపడుతున్నారని గుర్తు చేశారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థలు స్ఫూర్తిదాయకమైన విద్యనందిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయమని అన్నా రు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ప్రతిభ ఆధారిత విద్య ను అందిస్తూ అ గ్రగామిగా ఉంటున్నామని తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో వివిధ పరీక్షల ఫలితాల్లో ఆ ల్ఫోర్స్ అగ్రగామిగా నిలిచిందని హర్షం వ్యక్తం చే శారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు. కళాశాల ప్రి న్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన సిపిఐ నేత చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** చిగురుమామిడి మండల సిపిఐ నాయకుడు సూరం కొమురయ్య ఇటీవల మరణించగా ఆయన కుమారుడు సూరం అయిలయ్యను రేకొండ లో ఆదివారం సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పరమర్శించారు. అలాగే ఇందుర్తి లో సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిపి అమరజీవి వేముల వెంకట్రాజం సంవత్సరీకం సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెంకట్రాజం ఈ ప్రాంతంలో పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ హుస్నాబాద్ నియజకవర్గ కన్వీనర్ జాగీరీ సత్యనారాయణ,కరీంనగర్ జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి,బోయిని వల్లభాయ్ పటేల్,బూడిద సదాశివ, తేరాల సత్యనారాయణ ,కాంతాల శ్రీనివాస్ రెడ్డి,గ్రామ శాఖ కార్యదర్శి మహ్మద్ ఉస్మాన్ పాషా, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల సమ్మయ్య, మాజీ ఎంపిటిసిపరకాల కొండయ్య,తమ్మిశెట్టి రవీందర్, బింగి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల పట్టణ మెడికల్ కళాశాల నలువైపులా,ఆర్ అండ్ బిరోడ్డు ,నటరాజ చౌరస్తా,బస్ డిపో రోడ్డు,బసవేశ్వర విగ్రహం నుండి చిన్న కెనాల్ రోడ్డు లో రూ.45 లక్షలతో చేపట్టిన కరెంటు పోల్ షిఫ్టింగ్ పనులను ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపననిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మెడికల్ కాలేజీ చుట్టూ నాలుగు వైపులా45 లక్షలు పోల్ షిఫ్టింగ్ పనులు అధికారులుత్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.730 పడకల ఆసుపత్రి జగిత్యాల కు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు.ప్రజలకు అనువైన స్థలంలో బస్ స్టాండ్‌కి దగ్గరలో మెడికల్ కాలేజీ,ఆసుపత్రులు రాష్ట్రంలో ఎక్కడా లేవని కేవలం జగిత్యాలలో అందుబాటులోకి రానున్నాయన్నారు.జగిత్యాల చరిత్రలో రూ. 11 కోట్లతో రోడ్డు పనులు చేయటం ఇదే మొదటి సారి అని వివరించారు.రాష్ట్రం లో విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిఅధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

**స్వచ్ఛంద సంస్థల సేవలు సద్వినియోగం**

పేదలకు స్వచ్ఛంద సంస్థలు అందించే సేవలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు చెందిన పావని కంటి ఆసుపత్రిలో ఆదివారం ఆపీ,రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గం,పరిసర ప్రాంతాలకు చెందిన 12 మంది నిరుపేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు.అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శస్త్రచికిత్సలు నిర్వహించుకున్న పేదలకు ఉచిత మందులు,కంటి అద్దాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న పావని కంటి ఆసుపత్రి, రోటరీ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు దుమల రాజ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది,పార్టీ నాయకులు పాల్గొన్నారు.


## ముగిసిన ఇసుక లోడింగ్ వివాదం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల మానేరు ఇసుక రీచ్‌లో గత కొద్దిరోజులుగా నెలకొన్న ఇసుక లోడింగ్ వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. ట్రాక్టర్ యజమానులు,స్థానిక కూలీల మధ్య ఏర్పడిన ఈ వివాదం అధికారుల జోక్యంతో సద్దుమణిగింది.గత 15 సంవత్సరాలుగా ఈ రీచ్‌లో ఇసుక లోడింగ్ పనులు చేస్తూ స్థానిక కూలీలు జీవనం సాగిస్తున్నారు.అయితే,ఇటీవల ట్రాక్టర్ యజమానులు మానవ శ్రమకు బదులుగా డోజర్లు,జెసిబియంత్రాలతో ఇసుక లోడింగ్ ప్రారంభించారు. దీనివల్ల తమకు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని, కుటుంబాలు రోడ్డున పడతాయని కూలీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై గత నెల 30వ తేదీన కూలీలంతా కలిసి మంథని ఆర్‌డిఒకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఆర్‌డిఒ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని ఉభయ పక్షాలతో మాట్లాడారు. అధికారుల జోక్యంతో ట్రాక్టర్ యజమానులు సానుకూలంగా స్పందించారు.ఇసుక లోడింగ్ కోసం డోజర్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసేందుకు వారు అంగీకరించారు.సమస్యను సామరస్యంగా పరిష్కరించిన మంథని ఆర్‌డిఒకు కూలీలు,ట్రాక్టర్ యజమానులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యూనియన్ నాయకుడు చింతం శ్రీను,కూలీల ప్రతినిధులు జంగం రమేష్,జాగరి రాజు,పర్శ ప్రశాంత్ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.ఆర్‌డిఒకు ఇచ్చిన ఫిర్యాదును తాము ఉపసంహరించుకుంటున్నట్లు వారు ప్రకటించారు.ఇరువర్గాల మధ్య అవగాహన కుదరడంతో ఇసుక రీచ్‌లో వాతావరణం ప్రశాంతంగా మారింది.

## విరాళాల చోరీ, పేపర్ లీకేజీలపై
# పార్లమెంట్‌లో చర్చ జరపాలి

**అఖిలపక్ష సమావేశంలో ప్రతి పక్షాలు డిమాండ్**
**టిఎంసి రెబల్ ఎంపిలను ఆహ్వానించడంపై వాకౌట్**

**న్యూఢిల్లీ :** నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివాం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష భేటీ జరిగింది సమావేశానికి ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా, 40 రాజకీయ పార్టీలకు చెందిన 58 మంది నాయకులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే రామమందిర విరాళాల చోరీ, నీట్ పేపర్ లీక్, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటి అంశాలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ, అదే విధంగా తిరుగుబాటు టిఎంసి ఎంపిలకు ఆహ్వానం పంపడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీలు వాకౌట్ చేశాయి. ఆ తరువాత న్యాయం జరగలేదని ఆరోపిస్తూ నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపిలు వెంటనే సమావేశానికి తిరిగి వచ్చారు. అయితే తాము ప్రతిపక్షం వాట వింటామని, తమ కూడా వినాలని ప్రభుత్వం తనవంతుగా పేర్కొంది. సమావేశం ప్రారంభం కాగానే, తిరుగుబాటు చేసిన టిఎంసి శాసనసభ్యులకు సభలో ప్రత్యేక సీట్లు కేటాయించడం, రెబల్ శివసేన (యుబిటి) ఎంపిలను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో విలీనం చేయడంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీసుకున్న నిర్ణయాలను ప్రతిపక్షాలు నిరసించాయి. టిఎంసి, శివసేన (యుబిటి)లకు చెందిన తిరుగుబాటు ఎంపిలపై స్పీకర్ తీసుకున్న నిర్ణయానికి నిరసనగా అఖిలపక్ష సమావేశం నుంచి వాకౌట్ చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించినట్లు సమావేశం జరుగుతున్న పార్లమెంట్ భవన సముదాయంలో కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ విలేకరులతో అన్నారు. అఖిలపక్ష సమావేశానికి తిరుగుబాటు టిఎంసి ఎంపిలను ఆహ్వానించడం 'న్యాయ వైఫల్యం' అని సిపిఐ(ఎం) నాయకుడు జాన్ బ్రిట్టాస్ అన్నారు. గుర్తింపు లేని పార్టీ అయిన 'ఎన్‌సిపిఐ' అని పిలవబడే దానిని ఆహ్వానించినందుకు నిరసనగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకె, జెఎంఎం, ఆమ్ ఆద్మీ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్, వామపక్ష పార్టీలు, శివసేన (యుబిటి)తో సహా ప్రతిపక్షమంతా సమావేశం నుండి వాకౌట్ చేసిందని టిఎంసి ఎంపి మహువా మోయిత్రా అన్నారు. టేబుల్ ఆఫీస్ అందించిన జాబితాలో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) బలం 28 మంది సభ్యులుగా చూపించారన్నారు. రాజ్యాంగంలోని 91వ సవరణ



తర్వాత ప్రత్యేక వర్గం (బ్లాక్) ఏర్పాటుకు అవకాశం లేదన్నారు. కాబట్టి, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఏ ప్రాతిపదికన ఈ 20 మంది రెబెల్ ఎంపిలను ఆహ్వానించారని, వారు ఈ సమావేశానికి ఎలా హాజరవుతున్నారని ప్రశ్నించారు. టిఎంసికి మద్దతు ఇచ్చిన ఇతర ప్రతిపక్ష పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. కాకోలి ఘోష్ దస్తీదార్‌తో కలిసి సమావేశానికి హాజరైన టిఎంసి రెబెల్ ఎంపి సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ తమకు ఆహ్వానం అందిందని, అందుకే 20 మంది ఎంపిలతో కూడిన కొత్త పార్టీ తరపున ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చామని చెప్పారు. దేశం, పశ్చిమ బెంగాల్ అభివృద్ధి కోసం పనిచేయాలని ఎన్‌సిపిఐ భావిస్తోందని ఘోష్ దస్తీదార్ పేర్కొన్నారు. సమావేశంలో లేవనెత్తిన అంశాల గురించి కాంగ్రెస్ నేత తివారీ విలేకరులతో మాట్లాడుతూ, రామమందిర విరాళాల చోరీ ఆరోపణలు, నీట్ పేపర్ లీక్, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటివి ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాలని తెలిపారు. 'ఈ అంశాలన్నింటిపైనా చర్చ జరగాలని తాము డిమాండ్ చేశామన్నారు. లోక్‌సభలోని ప్రస్తుత 543 మంది సభ్యుల సంఖ్యతోనే 2023లో ఆమోదించిన మహిళా కోటా బిల్లును ప్రభుత్వం అమలు చేయాలని డిఎంకె నేత టి.ఆర్. బాలు సమావేశంలో కోరారు. 'లోక్‌సభలోని ప్రస్తుత సభ్యుల సంఖ్య ఆధారంగా మహిళా రిజర్వేషన్ బిల్లుకు డిఎంకె అనుకూలంగా ఉంది, కానీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై మాకు మరింత స్పష్టత కావాలి,' అని డిఎంకె నేత తిరుచ్చి శివ సమావేశం తర్వాత విలేకరులతో అన్నారు.

పునర్విభజన ప్రక్రియ దక్షిణ రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం చూపకూడదని శివ అన్నారు. 'ఒకవేళ అది దక్షిణ రాష్ట్రాలపై ప్రభావం చూపితే, ఆ ప్రక్రియను 25 ఏళ్లపాటు నిలిపివేయాలి,' అని ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమై ఆగస్టు 13 వరకు కొనసాగుతాయి.

**టిఎంసి రెబల్ ఎంపిలను ఆహ్వానించడాన్ని సమర్థించుకున్న కేంద్రం**

అంతగా ప్రాచుర్యం లేని ఎన్‌సిపిఐలో చేరిన తిరుగుబాటు టిఎంసి ఎంపిలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించగా, ప్రభుత్వం ఆదివారం ఆ నిర్ణయాన్ని సమర్థించుకుంది. గుర్తింపు, ప్రత్యేక సీట్ల కోసం వారు లోక్‌సభ స్పీకర్‌కు విజ్ఞప్తి చేసినందున వారిని విస్మరించలేమని ప్రభుత్వం పేర్కొంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, దేశ ప్రజలు పార్లమెంటు సజావుగా సాగాలని కోరుకుంటున్నారని, సభలో ఎటువంటి గందరగోళం ఉండకూడదని అన్నారు. అలాగే, బిల్లులకు సానుకూల మద్దతు ఇవ్వాలని ఆయన అన్ని పార్టీలను కోరారు. వర్షాకాల సమావేశాలకు ముందు ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వర్షాకాల సమావేశాల కోసం ప్రభుత్వం ఎనిమిది బిల్లులను జాబితా చేసిందని, అదనపు అంశాలు ఏవైనా ఉంటే తగిన విధానాలను అనుసరిస్తామని రిజిజు తెలిపారు. గతంలో ప్రతిపక్షాల నిరసనల వల్ల సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగి, దేశం, ప్రజల ప్రయోజనాలకు హాని జరిగిందని ఆయన పేర్కొన్నారు. 'నిరసనలు తెలపడం వల్ల రాజకీయంగా ఎవరికీ ఎటువంటి ప్రయోజనం ఉండదు. అందుకే అన్ని రాజకీయ పార్టీల సభ్యులు పూర్తి మనసుతో సభ కార్యకలాపాల్లో పాల్గొనాలని కోరుతున్నాను' అని ఆయన అన్నారు. దేశం కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని, ప్రతిపక్షాల సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని మంత్రి చెప్పారు. 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కు అన్ని పార్టీలకు ఉంది; బిల్లులకు సానుకూల మద్దతు ఇవ్వాలని నేను వారిని కోరుతున్నాను' అని ఆయన అన్నారు.

## జోక్యం చేసుకోం

### వాంగ్‌చుక్‌కు అందుతున్న చికిత్సపై ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్‌కు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో అందుతున్న చికిత్స విషయంలో ప్రస్తుతం జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. నిరాహార దీక్షలో ఉన్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చికిత్స విషయంలో వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేందుకు అనుమతివ్వాలని ఆయన భార్య గీతాంజలి జే ఆంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ నిర్వహించిన జస్టిస్ మినీ పుష్కర్ణ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి నిరాకరించారు. కేసు తదుపరి విచారణను జూలై 24కు వాయిదా వేశారు. విచారణ సందర్భంగా సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్యులు వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆయన శారీరక స్వేచ్ఛకు విరుద్ధంగా బలవంతపు వైద్యం జరుగుతోందని చెప్పడానికి ప్రస్తుతం ఎలాంటి ఆధారాలు లేవని న్యాయస్థానం పేర్కొంది. జంతర్‌మంతర్ నుంచి వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించిన ప్రభుత్వ చర్యను కూడా ఏకపక్షంగా లేదా చట్టవిరుద్ధంగా చెప్పలేమని స్పష్టం చేసింది. వాంగ్‌చుక్ భార్య, సోదరుడు, బావకు ఆయనను 24 గంటలూ కలిసే అవకాశం కల్పించామని కూడా కోర్టు నమోదు చేసింది. ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ మాట్లాడుతూ, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదన్నారు. వాంగ్‌చుక్‌కు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో వైద్యులు అన్ని విధాలా చికిత్స అందిస్తున్నారని, అయితే ఆయన కూడా వైద్యులకు సహకరించాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, అవసరమైతే వైద్యులు సూచించే చికిత్సకు వాంగ్‌చుక్ తన ఇష్ట ప్రకారం సహకరిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొంది. పిటిషనర్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, వాంగ్‌చుక్‌ను మెదాంతా ఆస్పత్రికి తరలించాలని కోరారు. వాంగ్‌చుక్ ఎలాంటి నిర్బంధంలో లేరని పేర్కొంటూ, తనకు నచ్చిన ఆస్పత్రిలో చికిత్స పొందే హక్కును వ్యక్తికి నిరాకరించలేమని ఆయన వాదించారు.



**మాకు నచ్చిన ఆస్పత్రికి తరలించాలి'**

వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించిందనే ప్రభుత్వ వాదన పూర్తిగా తప్పని ఆమె అన్నారు. ఆస్పత్రికి తరలించే ముందు సాయంత్రం చేసిన వైద్య పరీక్షల్లో పొటాషియం స్థాయి 4.3గా ఉండగా, మిగతా అన్ని ఆరోగ్య సూచీలు కూడా సాధారణంగానే ఉన్నాయని తెలిపారు. నిజంగా ఆరోగ్యంపై ఆందోళన ఉంటే సాధారణ పద్ధతిలో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వైద్య పరీక్షలు నిర్వహించాల్సిందని అన్నారు. కానీ, సివిల్ డ్రెస్‌లో వచ్చిన పోలీసులు బలవంతంగా స్ట్రెచర్‌పై ఎక్కించి తీసుకెళ్లారని ఆమె ఆరోపించారు. వాంగ్‌చుక్ చేపట్టనున్న పాదయాత్రకు దేశవ్యాప్తంగా భారీ ప్రజా మద్దతు లభిస్తుందనే భయంతోనే ప్రభుత్వం ఈ చర్యలకు పాల్పడిందని ఆమె విమర్శించారు. తమకు నమ్మకమున్న వైద్యులు, ఆస్పత్రిలోనే చికిత్స చేయించాలని కోరుతున్నామని గీతాంజలి తెలిపారు. ప్రస్తుతం ఉన్న వాతావరణం వల్లే ఆయన రక్తపోటు పెరిగిందని పేర్కొన్నారు.

**హైకోర్టు తీర్పుపై అప్పీల్‌కు సిద్ధం**

వాంగ్‌చుక్ తరఫు న్యాయవాది వివేక్ మాట్లాడుతూ, వైద్య నివేదికలను ఆయన భార్యకు అందజేయాలని ఆదేశించిందన్నారు. అయితే ఆస్పత్రిలో వాంగ్‌చుక్ గది వెలుపల భారీగా పోలీసు బందోబస్తు ఉండటం రోగి మానసిక స్థితిపై ప్రతికూల ప్రభావం చూపుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ అంశంపై డివిజన్ బెంచ్‌లో లెటర్స్ పేటెంట్ అప్పీల్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన ఆస్పత్రి, వైద్యుడిని ఎంచుకునే హక్కు ఉందనే అంశాన్ని కోర్టు ముందుంచనున్నామని వెల్లడించారు.

### తిట్లు, బూతుల వాడకం
## అశ్లీలత కిందకు రావు
### సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** కేవలం తిట్లు, బూతులు, అసభ్యకరమైన దూషణలు ఎంత అభ్యంతరకరంగా లేదా అనాగరికంగా ఉన్నప్పటికీ వాటిని అశ్లీలత కింద పరిగణించరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత శిక్షా స్మృతి(ఐపిసి)లోని 294 కింద ట్రయల్ కోర్టు తనకు విధించిన శిక్షను ధృవీకరించిన హైకోర్ట్ ఉత్తర్వును సవాల్ చేస్తూ ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ జరుపుతున్న న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, విపుల్ ఎం.పాంచోలిలతో కూడిన ధర్మాసనం కేవలం దూషణ లేదా కేవలం దూషణ లేదా అసభ్యకరమైన భాషను ఉపయోగించడం మాత్రమే ఆ సెక్షన్ కింద అశ్లీలత నేరంగా పరిగణించబడదని వ్యాఖ్యానించింది. 'ఒక మాటను అశ్లీలమైనదిగా పరిగణించాలంటే, అది కామ ప్రేరకమైనదని, లైంగిక వాంఛలను రెచ్చగొట్టేదని, దానిని విన్నవారి మాటలను మనస్సులను పాడుచేసి భ్రష్టు పట్టించే స్వభావం కలిగి ఉందని నిరూపించబడాలి. ఫిర్యాదులో చేసిన ఆరోపణలు అన్నింటినీ యథాతథంగా స్వీకరించి, పూర్తిగా నిజమని అంగీకరించినప్పటికీ వాటిని అశ్లీలమైనవి' అని పరిగణించలేం అని శుక్రవారం వెలువరించిన తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది. అటువంటి పదాలు ఎంత దూషణాత్మకంగా, లేదా అప్రియంగా లేదా అనాగరికంగా ఉన్నప్పటికీ అవి ఐపిసిలోని సెక్షన్ 294 (బి) అవసరాన్ని తీర్చవని ధర్మాసనం పేర్కొంది. 'బహిరంగ ప్రదేశంలో అలాంటి పదాల వాడకం ఇతరులకు చికాకు కలిగించిందని ఫిర్యాదుదారునికి అసలే చికాకు కలిగించిందని ఎవరూ వాదించడం లేదు. ఇది సెక్షన్‌లోని తప్పనిసరి అంశం.అలా జరగని కారణంగా, ఐపిసిసెక్షన్ 294(బి)కింద నేరం రుజువుకాలేదని మేం భావిస్తున్నాం'అని ధర్మాసనం తెలిపింది.ఈ కేసు 2017 ఆగస్టులో తమిళనాడులో జరిగిన ఒక వ్యవసాయ భూమి వివాదానికి సంబంధించినది. ఇందులో పిటిషనర్, అతడి బావమరిది మధ్య వాగ్వాదం జరిగింది. రెండు రోజుల తర్వాత అదే విషయమై పిటిషనర్ ఫిర్యాది మేనల్లుడుతో మరోసారి ఘర్షణకు దిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాది జోక్యం చేసుకున్నప్పుడు పిటిషనర్ అతడిని అసభ్యకరమైన తిట్లతో, కులపరమైన దూషణలతో, మాటలతో దూషించాడని ప్రాసిక్యూషన్ వాదించింది. ట్రయల్ కోర్టు పిటిషనర్‌ను సెక్షన్ 294 (బి) కింద దోషిగా నిర్ధారించింది.

## జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కాంగ్రెస్ ధర్నా

**కాంగ్రెస్ ర్యాలీని పోలీసులు**
**భగ్నం-స్వల్ప ఘర్షణ**
**కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను**
**అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**జమ్మూ :** జమ్మూకశ్మీర్‌కు తక్షణమే పూర్తి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌కు మద్దతుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రం సమర్పించేందుకు జమ్మూలోని లోక్‌భవన్‌కు కవాతు చేస్తూ బయల్దేరిన డజన్లకొద్దీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల యాత్రను పోలీసులు అడ్డుకోవడంతో ఆదివారం వారిని అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలో రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ప్రతిపాదించిన ప్రదర్శనకు ఒకరోజు ముందు, తారిఖ్ హమీద్ కర్రా నాయకత్వంలో ఈ యాత్ర జరిగింది. ర్యాలీకి ముందు నగర నడిబొడ్డున ఉన్న మహారాజా హరిసింగ్ పార్క్‌లో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు శాంతియుతంగా ధర్నాచేసి, రాష్ట్ర ఏర్పాటు డిమాండ్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. తమ వినతిపత్రాన్ని సమర్పించేందుకు లోక్‌భవన్‌కు ఊరేగింపుగా వెళుతున్న కాంగ్రెస్ కార్యకర్తలను జువెల్ చౌక్ వద్ద రహదారిపై పోలీసులు బారికేడ్లను ఏర్పాటుచేసి అడ్డుకున్నారు. నిరసనకారులు బారికేడ్లను తోసుకుని ముందుకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు, నిరసనకారు



లకు మధ్య స్వల్పఘర్షణ చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. కర్రా, ఎఐసిసి ప్రధానకార్యదర్శి జి.ఎ.మీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ్ భల్లా , పలువురు మాజీ మంత్రులు, శాసనసభ్యులు సహా డజన్లకొద్దీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారని వారు తెలిపారు. అంతకుముందు, విలేకరులతో మాట్లాడుతూ దాదాపుగా రెండేళ్లుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పునరుద్ధరణ కోసం ప్రచారం చేస్తోందని, 'ఛలో శ్రీనగర్', 'ఛలో జమ్మూ', 'ఛలో ఢిల్లీ' నినాదాలతో జిల్లా స్థాయి కార్యక్రమాలు, నిరాహారదీక్షలు, ప్రచారాల ద్వారా జమ్మూకశ్మీర్‌లోని మొత్తం 20జిల్లాలన్నింటికీ ఈ సందేశాన్ని తీసుకెళ్లిందని కర్రా తెలిపారు. ఆ వినతిపత్రాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపడం కోసం లెఫ్టినెంట్ గవర్నర్ నివాసం లోక్‌భవన్‌లో సమర్పించాల్సి ఉందని పేర్కొన్నారు. రెండవ విడత జిల్లా స్థాయి కార్యక్రమాలతో పార్టీ తన ఆందోళనను మరింత ఉధృతం చేస్తుందని, కతువాలోని లఖన్‌పూర్ నుంచి ఉత్తర కశ్మీర్‌లోని లోలాబ్ వరకు సుదీర్ఘ పాదయాత్రను కూడా పరిశీలిస్తున్నట్లు కార్రా ప్రకటించారు. జంతర్‌మంతర్ వద్ద సోమవారం నేషనల్ కాన్ఫరెన్స్ నిరసనలో పాల్గొనడం గురించి అడగగా కర్రా మాట్లాడుతూ తాను, మీర్‌తో కలిసి న్యూఢిల్లీకి బయల్దేరుతున్నానని, అయితే ఇతర ఏ నాయకులు పాల్గొనాలనేది పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుందని చెప్పారు. పూంచ్, రాజోరీలలో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదల వల్ల భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, అందువల్ల ప్రభావిత ప్రజల కోసం సమగ్ర పునరావాస ప్యాకేజీని ప్రకటించాలని కాంగ్రెస్ నాయకుడు కర్రా ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గాల పునర్విభజన, ఎన్నికల తర్వాత రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీని నమ్మి జమ్ముకశ్మీర్ ప్రజలు అసెంబ్లీ ఎన్నికలలో భారీ సంఖ్యలో ఓట్లేశారని మీర్‌చెప్పారు. దాదాపు రెండేళ్లు గడిచినా ఆ హామీని నెరవేర్చే దిశగా కేంద్రం నుంచి ఎలాంటి సూచనలు లేవని ఆయన అన్నారు. రాష్ట్ర హోదాకు మద్దతుగా జరుగుతున్న ఢిల్లీ నిరసనను 'విధ్వంసం' చేసే ప్రయత్నంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ వద్ద నిరసనలు చేపట్టాలన్న బిజెపి నిర్ణయం కనిపిస్తోందని మీర్ ఆరోపించారు.

## డ్రోన్ సీజ్
## వారం రోజుల్లో
### రెండో డ్రోన్ స్వాధీనం

**జమ్మూ:** జమ్మూకశ్మీర్‌లోని సాంబా జిల్లాలో భారత సైన్యం మరో డ్రోన్‌ను స్వాధీనం చేసుకుంది. ఇదిగత వారం రోజుల్లో ఇదే జిల్లాలో లభించిన రెండో డ్రోన్.

అధికారుల వివరాల ప్రకారం.. సరిహద్దు మార్గాల ద్వారా జరుగుతున్న అక్రమ రవాణా, చొరబాటు ప్రయత్నాలను అడ్డుకునేందుకు భద్రతా బలగాలు ఇప్పటికే అప్రమత్తంగా ఉండగా, ఈ ఘటనతో నిఘా, దర్యాప్తును మరింత ముమ్మరం చేసారు.

శనివారం అర్ధరాత్రి సమయంలో పూర్మండల్ ప్రాంతంలోని సంగర్ పొలాల్లో ఈ అనుమానాస్పద పాకిస్థానీ డ్రోన్‌ను టెరిటోరియల్ ఆర్మీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

డ్రోన్ మూలం, సాంకేతిక లక్షణాలు, అలాగే దీనిని ఏవైనా సరిహద్దు దాటి జరిగే కార్యకలాపాలకు ఉపయోగించారా అనే విషయాలను తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. అంతకుముందు జూలై 14న దేవక్ గ్రామం సమీపంలోని ఓ ఖాళీ మైదానంలో కూడా మరో డ్రోన్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

### కెన్-బెట్వా లింక్,
### అభివృద్ధి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా...
## 17రోజులుగా జరుగుతున్న నిరసన భగ్నం

**అమిత్ భట్నాగర్‌ను ఆసుపత్రికి తరలించిన పోలీసులు**

**ఛతర్‌పూర్ :** మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలో కెన్–బెట్వాలింక్, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా 17రోజులుగా జరుగుతున్న నిరసనను ఆదివారం పోలీసులు భగ్నం చేశారు. వారు నిరసనకారులను చెదరగొట్టడంతో పాటు 11 రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న ఉద్యమ నాయకుడు అమిత్ భట్నాగర్‌ను ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ భట్నాగర్ తన నిరాహారదీక్షను విరమించలేదని చెప్పారు. 'నాప్రాణాలు పోయినా సరే నిరాహారదీక్షను విరమించబోనని' చెబుతూ తన వైఖరిని మార్చుకోలేదని స్పష్టం చేశారు. మీడియాకు పంపిన ఒక వీడియో సందేశంలో అమిత్ భట్నాగర్ మాట్లాడుతూ తాను సిరల ద్వారా ఇచ్చే ద్రవాలను స్వీకరించబోనని 'కేవలం నీళ్లు, నిమ్మరసం కలిపిన నీళ్లను మాత్రమే తీసుకుంటాను అని తెలియజేశారు. నిర్మాణంలో ఉన్న వంతెన కింద , పాక్షికంగా నదిలోనే నిరసన ప్రదర్శన జరుగుతున్నందున బరానా నదిలో పెరుగుతున్న నీటిమట్టం వల్ల తీవ్రమైన నీటి ముప్పు పొంచి ఉందని పేర్కొంటూ, తెల్లవారుజామున చేపట్టిన చర్యను పోలీసులు సమర్థించుకున్నారు. ప్రధానంగా గిరిజన మహిళలు చేపట్టిన ఈ నిరసన, జులై 3వ తేదీన కుపి గ్రామ సమీపంలోని బరానా నది వద్ద ఒడ్డున కొనసాగింది. నిరసనాకారులు 'జల్ సత్యాగ్రహ', 'చిత'(అంత్యక్రియల చితి)సత్యాగ్రహ', ప్రతీకాత్మక ఫాన్సీ(ఉరి) సత్యాగ్రహ'లను నిర్వహించారు. పోలీసుల చర్య సమయంలో భట్నాగర్, ఇతరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని నిరసనకారులు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను అధికార యంత్రాంగం కొట్టిపారేసింది. 'జాతీయ దృక్పథ ప్రణాళిక' కింద దేశంలోనే మొట్టమొదటి నదుల అనుసంధాన ప్రాజెక్ట్ అయిన కెన్–బెట్వా అనుసంధాన ప్రాజెక్ట్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లోని కరువు పీడిత బుందేల్ ఖండ్ ప్రాంతంలో సాగునీరు, తాగునీటిని అందించడానికి, కెన్ నది నుంచి బెట్వా నదికి అదనపు నీటిని తరలించడమే లక్ష్యంగా పెట్టుకుంది. స్థాన భ్రంశం, పునరావాసం, అలాగే పన్నా టైగర్ రిజర్వ్‌లోని కొన్ని ప్రాంతాలతో సహా అడవులు, వన్యప్రాణుల వడే ప్రభావం వంటి అంశాలపై ఈ ప్రాజెక్ట్ కొన్ని ప్రాజెక్ట్ బాధితుల కుటుంబాలు, పర్యావరణ సమూహాల నుంచి వ్యతిరేకత ఎదురైంది.నిరసనకారిణి దివ్య అహిర్వార్ వాదన ప్రకారం ఉదయం 5గంటల సమయంలో పోలీసులు పెద్దయెత్తున సంఘటనా స్థలికి చేరుకుని ఉద్యమ నాయకుడు అమిత్ భట్నాగర్, ఇతరులను అదుపులోకి తీసుకున్నారు.

## జమ్ముకశ్మీర్‌లో భారీ వర్షాలు, వరదలు

**పూంచ్, రాజౌరి సరిహద్దు జిల్లాల్లో విరిగిపడిన కొండచరియలు**
**వర్షం సంబంధిత ఘటనలతో 11 మంది మృత్యువాత, మరో ఏడుగురు గల్లంతు**



**జమ్ము :** భారీ వర్షాలు జమ్ముకశ్మీర్‌ను అతలాకుతలం చేశాయి. పూంచ్, రాజౌరి సరిహద్దు జిల్లాల్లో ఆదివారం కురిసిన భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఆకస్మిక వరదలు సంభవించడంతో 11 మంది మృత్యువాత పడ్డారు. మరో ఏడుగురు గల్లంతయ్యారు. దీంతో వివిధ ఏజెన్సీల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. పూంచ్ జిల్లాలోని సురాన్‌కోట్ తహసీల్‌లో అత్యధిక ప్రాణనష్టం సంభవించడంతో పాటు తీవ్ర విధ్వంసం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. వర్షం కొనసాగుతుండటం, రోడ్లు దెబ్బతినడం వంటి సవాళ్ల మధ్య గల్లంతైన వారి ఆచూకీ కోసం సహాయక బృందాలు వేగంగా చర్యలు చేపట్టాయి. రాష్ట్ర హోదా కోసం జరగాల్సిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, భారీ వర్షాల కారణంగా ఆ ప్రాంతంలో పరిస్థితులు విషమించడంతో తన పర్యటనను కుదించుకుని మధ్యాహ్నానికే జమ్ముకు తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వర్షం, వరదల బారిన పడిన జిల్లాల్లోని పరిస్థితులను సమీక్షించారు, అలాగే బాధితులైన కుటుంబాలకు తక్షణ సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఆదివారం తెల్లవారుజామున సురాన్‌కోట్‌లోని లోయర్ ముర్రా గ్రామంలో భారీ వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడి ఒక ఇంటిపై పడటంతో, ఆ ఇంట్లో ఉన్న ఎనిమిది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. శిథిలాల కింద నుంచి రెండేళ్ల బాలుడు సోఫియన్ యాసర్‌తో సహా ఐదుగురి మృతదేహాలను వెలికితీశామని, మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. సాంగ్లా గ్రామంలో ఆకస్మిక వరదల ధాటికి ఒక ఇల్లు కొట్టుకుపోవడంతో మరో కుటుంబానికి చెందిన నలుగురు గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. గల్లంతైన వారిలో అబ్దుల్ హమీద్, అతని భార్య షరీఫా బేగం, కుమార్తె అరీబా, సోదరి మనిరా బేగం ఉన్నారు. నూనాబండి గ్రామంలో ఇల్లు కూలిపోవడంతో 28 ఏళ్ల నజియా కౌసర్ అనే మహిళ మరణించింది. ఆమె భర్త మహ్మద్ హాఫీజ్, రెండు నుండి ఆరు సంవత్సరాల వయస్సు గల ముగ్గురు పిల్లలు గాయాలతో బయటపడగా, వారిని ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. పూంచ్ జిల్లాలోని హవేలీ తహసీల్‌లో దాదాపు అరడజను ఇళ్లు కూలిపోవడంతో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. రాత్రంతా కురిసిన ఎడతెరిపి లేని వర్షాల కారణంగా రాజౌరి పట్టణంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు వరద నీటితో నిండిపోయి, వందలాది మంది నివాసితులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఈ వరదల వల్ల నదిలో ఒక మహిళ మృతదేహాన్ని కూడా వెలికితీసినట్లు వారు తెలిపారు. పొంగిపొర్లుతున్న నదులు గట్లు తెగిపోవడంతో డజన్ల కొద్దీ వాహనాలు కొట్టుకుపోయాయని లేదా నీట మునిగాయని, దీంతో తీవ్ర అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. జూలై 23 వరకు జమ్ముకశ్మీర్ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరిక జారీ కాగా, సరిహద్దు జిల్లాలైన రాజౌరి, పూంచ్‌లలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో రాత్రంతా కురిసిన భారీ వర్షాల తర్వాత నదులు, వాగులు పొంగిపొర్లాయి.

## రామమందిరం విరాళాల చోరీపై ప్రజాగ్రహం

**యావత్ దేశాన్ని కుదిపేసింది: మాయావతి**




**లక్నో:** రామమందిరం విరాళాల దొంగతనం కేసు ఉత్తర్‌ప్రదేశ్‌తో పాటు యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. రాజకీయ వైషమ్యాలు పక్కనపెట్టి వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు దీనిపై చర్చించాలని ఆమె కోరారు. అయోధ్య రామమందిరంలో కానుకల దొంగతనం, వాటిని దుర్వినియోగం చేయడంపై ప్రజాగ్రహం ఉత్తర్ ప్రదేశ్‌తో పాటు యావత్ దేశాన్ని కుదిపేసిందని ఆమె అన్నారు. ఎన్నికల ప్రయోజనం కోసం మత రాజకీయాలు చేసేవారి వల్లే ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆమె అన్నారు. రామమందిరం విరాళాల అంశంపై పార్లమెంట్‌లో వాడీవేడి చర్చలు జరగనున్నందున ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పేపర్ లీకేజీలు, పేదరికం, నిరుద్యోగంపై పార్లమెంట్‌లో చర్చలు కొనసాగుతుయా? లేక వాయిదాలు పడతాయా? అనే ఆందోళనలో ప్రజలున్నారని ఆమె పేర్కొన్నారు. పశ్చిమాసియా ఘర్షణను ప్రస్తావిస్తూ, అమెరికా–ఇజ్రాయెల్ వివాదం వంటి జాతీయ ప్రజాప్రయోజనం ఉన్న అంశాలు చర్చనీయం అన్నారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ జాతీయ సమస్యల పట్ల సున్నితంగా వ్యవహరించాలని మాయావతి అభిప్రాయపడ్డారు.

## రాష్ట్రంలో భారీ స్థాయిలో నీటి సంరక్షణ పనులు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు వచ్చే మూడు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో నీటి సంరక్షణ పనులను చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఇందులో 9.60 లక్షల ఇంకుడు గుంతలు, 25 వేల పంట కుంటలు, 5 వేల ఊట కుంటలు, 5 వేల బోర్వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. వనమహోత్సవం, గ్రామ పంచాయతీ భవనాలు, వీఓ భవనాలు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయనున్నారు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, కరువు నివారణ చర్యలలో భాగంగా సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ కార్యక్రమాలకు సంబంధించి పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ వి.బి.జి. రామ్‌జీ ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి మొత్తం 12 కోట్ల పనిదినాలు కల్పించడాన్ని లక్ష్యంగా నిర్ణయించగా, జూలై నుంచి అక్టోబర్ వరకు తొలి దశలో 4.5 కోట్ల పనిదినాలు సృష్టించేందుకు ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం రోజుకు సుమారు 2.5 లక్షల మంది కూలీలకు ఉపాధి లభిస్తుండగా, మరో 2.5 లక్షల పనిదినాలను అదనంగా కల్పించి రోజుకు 5 లక్షల మందికి ఉపాధి అందించేందుకు జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద ప్రతి గ్రామంలో గృహాల వద్ద సోక్పిట్లు, రైతుల కోసం పంట కుంటలు, వర్షపు నీటిని నిల్వ చేసే పర్కొలేషన్ ట్యాంకులు, బోర్వెల్ రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ పంచాయతీ వరకు అధికారులకు, సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. అవసరమైతే మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రతి గ్రామంలో పనులు ప్రారంభమయ్యేలా జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి దనసరి అనసూయ సీతక్క ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

# బర్న్‌హామ్ వచ్చినా భారత్–బ్రిటన్ బంధం చెదరదు


## వ్యూహాత్మక నిపుణుల అంచనా



**లండన్:** బ్రిటన్ ప్రధానమంత్రిగా ఆండీ బర్న్‌హామ్ అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ ఆ దేశంతో భారత్ అనుబంధం, ద్వైపాక్షిక సంబంధాలు చెక్కుచెదరవని, ఎలాంటి మార్పులు ఉండబోవని వ్యూహాత్మక నిపుణులు అంచనావేస్తున్నారు. భారత్–బ్రిటన్ మధ్య సమగ్ర వాణిజ్య ఒప్పందం (సెటా) అమలులోకి వచ్చి వారం రోజులు కూడా గడవకముందే ఆండీబర్న్‌హామ్ బ్రిటన్ ప్రధానమంత్రిగా సోమవారం అధికార పగ్గాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ పూర్వరంగంలో ఈ అంచనాలు వెలువడ్డాయి. దేశంలో రాజకీయ పరివర్తన తీసుకురావడానికి, వ్యవస్థలో భారీ మార్పులు తీసుకురావడానికి ఆయన ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుని పదవీ బాధ్యతలు చేపడుతున్నారు. దేశాన్ని, లేబర్‌పార్టీని కొత్త పుంతలు తొక్కించాలన్న ఆయన ఉత్సుకత నేపథ్యంలో భారత్–బ్రిటన్ మధ్య బంధం గురించి విస్తారంగా అంచనాలు వెలువడుతున్నారు. బర్న్‌హామ్ బ్రిటన్ దిగువసభకు ఎన్నిక కాకముందు మొన్నమొన్నటివరకూ గ్రేటర్ మాంఛెస్టర్ మేయర్‌గా బాధ్యతలు నిర్వహించారు. "ఆయన దేశంలో ఎన్నో మార్పులు తీసుకువస్తామని అంటున్నారు, కానీ విదేశాంగ విధానంలో భారత్–బ్రిటన్ మధ్య మార్పు లేకుండా బలమైన మద్దతు ఆయన వైపు నుండి కొనసాగుతుందని భావిస్తున్నాం, గ్రేటర్ మాంఛెస్టర్‌లో గత ఏడాదికాలంగా బర్న్‌హామ్‌తో సన్నిహితంగా మెలగడం తమకెంతో విలువైనదిగా భావించాం, ఆయన చూపించిన ఉత్సాహం, భారత్‌తో బంధం భవిష్యత్తులో బలపడగానికి దోహదం చేస్తుంది'' అని మాంఛెస్టర్‌లోని భారత్ కాన్సులేట్ జనరల్ విశాఖ యదువంశీ పిటిఐ వార్తాసంస్థకు చెప్పారు. బ్రిటన్‌లో గత ఏడాది మార్చినెలలో భారతదేశం మాంఛెస్టర్‌లో కొత్త దౌత్యకార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ కార్యాలయానికి భారత విదేశీ సేవల విభాగం తరపున యదువంశీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కాన్సులేట్ కార్యాలయం ప్రారంభాన్ని ఆమె ఒక చారిత్రకఘట్టంగా అభివర్ణించారు. బర్న్‌హామ్ 2019లో భారత్‌లో పర్యటించారు. గ్రేటర్ మాంఛెస్టర్ అంతర్జాతీయాకరణ వ్యూహంలో భారత్ మార్కెట్ ఎంతో కీలకంగా నిలిచింది. ఆయన మేయర్‌గా ఉండగా మాంఛెస్టర్ రూపురేఖలు మార్చేశారు. మాంఛెస్టర్‌లో ఆయన పనితీరు గమనిస్తే భారత్‌తో సంబంధాల వృద్ధికి ఆయన కృషి చేశారని యదువంశీ చెప్పారు. బర్న్‌హామ్ లండన్ డిప్యూటీ మేయర్‌గా ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసిన భారతీయ వ్యాపారి అగర్వాల్ అభిప్రాయం ప్రకారం, బర్న్‌హామ్ అనుసరించబోయే వికేంద్రీకరణ విధానం భారత్ సమాఖ్యవ్యవస్థకు ఎంతో మేలు చేకూరుస్తుంది.

# హమాస్ ఉగ్రవాదులున్న జైలు చుట్టూ మొసళ్ళ కాపలా

## అమలులోకి వచ్చిన ఇజ్రాయెల్ చట్టం



**జెరూసలెం:** ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రవాదులున్న జైలును సంరక్షించడానికి మొసళ్ళను కాపలాగా ఉంచుతారు. దీనికి సంబంధించిన బిల్లుకు ఆ దేశ ఉన్నతచట్టసభ ఆమోదం తెలియజేసింది. గడచిన బుధవారం ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. మొసళ్ళను అడవిలోకి విడుదల చేయకుండా పార్కుల డైరెక్టర్ అథారిటీ విధించిన షరతులకు లోబడి వీటిని ఒక భద్రతా సంస్థ అధీనంలో ఉంచాలి. భద్రతాఅవసరాల నిమిత్తం వాటి అవసరం ఉందని పర్యావరణమంత్రిత్వశాఖ కూడా నిర్ధారించాలి. హమాస్ ఉగ్రవాదులున్న జైళ్ళచుట్టూ ముఖ్యంగా ఈ మొసళ్ళను కాపలాగా ఉంచుతారు. 2023 అక్టోబరు ఏడోతేదీన ఇజ్రాయెల్‌పై వందలమంది హమాస్ ఉగ్రవాదులు ఒక ముందస్తు పథకం ప్రకారం దాడిచేశారు. ఈ భారీ దాడిలో 1200 మందిని కాల్చి చంపారు. 200 మంది పైగా వివిధ దేశాలకు చెందిన ఇజ్రాయెలీ స్త్రీ పురుషులను బందీలుగా తీసుకుపోయారు. ఆ తర్వాత పాలస్తినా హమాస్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం మొదలైంది. పట్టుబడిన హమాస్ ఉగ్రవాదులను దక్షిణ ఇజ్రాయెల్‌లోని కెట్జియోట్ జైలులో బంధించి ఉంచారు. వారిని కాపలాకాయడం తమకు పెద్ద సవాలుగా మారిందని జైలు అధికారులు భయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుండి ఈ నిర్ణయం వెలువడింది. జైలుపై దాడి చేసినా, జైలు గోడలు బద్దలుకొట్టుకుని వెళ్ళే ప్రయత్నం చేసినా జైలు చుట్టూ ఉన్న మొసళ్ళకు వారు ఆహారంగా బలికావాల్సిందేనన్నది ఇజ్రాయెల్ ప్రభుత్వ వ్యూహంగా ఉంది. ఇజ్రాయెల్ పర్యావరణ మంత్రి ఇడిట్ సిల్మాన్ మొసళ్ళను అడవి జంతువుల నుండి విడదీసి బంధించి పెంచే వన్యప్రాణుల వర్గంగా మార్పుచేశారు. దీంతో జైళ్ళ నుండి ఖైదీలు పారిపోకుండా ఈ సరీసృపాలను ఉపయోగించడానికి వీలు కలిగింది. ఇరాన్ భద్రతామంత్రి బెన్‌గ్విర్ గత ఏడాదిలోనే ఈ ప్రతిపాదన ముందుకు తీసుకువచ్చారు. కాగా బెన్‌గ్విర్ ఆధ్వర్యంలో సాధారణ చిన్న చిన్న నేరాలు చేసిన అరబ్ ఖైదీలను కూడా ఉగ్రవాదులుగా మార్చడం వారితో సమానంగా వారికి కూడా శిక్షలు వేయడం ఇప్పుడు ఇజ్రాయెల్‌లో పరిపాటిగా మారుతోంది. హమాస్ ఉగ్రవాదులకు, చిన్న తప్పులతో జైలుకు వెళ్ళి అరబ్ నేరస్తులను ఒక చోట చేర్చి వారందరినీ ఉగ్రవాదుగా ముద్రవేయడం సాధారణంగా మారుతోంది.

# అమెరికాలో 20 రాష్ట్రాలకు కెనడా కార్చిచ్చు కాలుష్యం

## నష్టాన్ని టారిఫ్‌రూపంలో వసూలుచేస్తాం: ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్:** కెనడాలో చెలరేగిన కార్చిచ్చు కాలుష్యమేఘాలు అమెరికాలోని 20 రాష్ట్రాలకు వ్యాపించాయి. దీంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కెనడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వారి ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి అమెరికా రాష్ట్రాలు మూల్యం చెల్లించాల్సివస్తోందన్నారు. కెనడాలో కార్చిచ్చు కాలుష్య పొగలవల్ల కలగిన నష్టాన్ని కెనడా దేశం నుండి వచ్చే దిగుమతులపై సుంకాలు పెంచడం ద్వారా టారిఫ్‌ల రూపంలో వాటిని వసూలు చేస్తామన్నారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీకా ట్రంప్ ఫోన్‌చేసి తన నిరసన తెలియజేశారు. అమెరికాలోని పలు రాష్ట్రాలలో గాలి నాణ్యతా ప్రమాణాలు దిగజారిపోయాయి. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న న్యూజెర్సీలో జరగబోయే ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్స్ పోటీలకు కూడా ఈ కాలుష్య పొగలు తీవ్ర అంతరాయం కలిగిస్తాయన్న భయాలు నెలకున్నాయి. ఈ పరిస్థితులను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. న్యూజెర్సీలో ఫైనల్స్ చూసేందుకు 80,000 మంది అభిమానులు టిక్కెట్లు కొనుక్కున్నారు. ఇంకా లక్షలమంది అనేక ప్రాంతాలలో బహిరంగ స్క్రీన్‌లవద్ద గుమిగూడేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో కెనడా కార్చిచ్చు అమెరికాపై ప్రభావం చూపిస్తోంది. ఐతే పరిస్థితు లు చక్కబడతాయని కొలంబో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఒకరు అంచనా వేశారు. గాలి దశమార్చుకునే అవకాశం ఉందని, ఇతర ప్రాంతాల్లో వర్షం కురిసే పరిస్థితులున్నాయన్నారు. అమెరికా దక్షిణప్రాంత నగరాలు డెట్రాయిట్, చికాగోలలో గాలి నాణ్యతా ప్రమాణాలు గణనీయంగా క్షీణించాయి. గడచినవారంలో కెనడాలో ప్రారంభమైన దావానలం ఆ దేశంలో వేలాది హెక్టార్లలో ఉన్న అటవీప్రాంతాన్ని దహించేస్తోంది. కెనడాలో దాదాపు 937 ప్రాంతాలలో దావానలాలు క్రియాశీలంగా మండుతున్నాయి. ఒక్క ఆంటారియాలోనే 190 కార్చిచ్చులు మండుతున్నాయి. వాటిని ఎవ్వరూ అదుపుచేయలేక పోతున్నారు. వీటిని అదుపు చేసేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇదిలా ఉండగా కెనడాలో గురువారంనాటికి 835 కార్చిచ్చులు క్రియాశీలంగా మండుతున్నాయి.

# 700 మంది రాజకీయ ఖైదీలను విడుదల చేయండి

## క్యూబాకు మార్కో రుబియో విజ్ఞప్తి



**వాషింగ్టన్:** క్యూబాలో ఉన్న 700 మంది రాజకీయ ఖైదీలను తక్షణం విడుదల చేయాలని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో కోరారు. ప్రముఖ కళాకారుడు ఒకరు ఐదేళ్ళ జైలు జీవితం తర్వాత విడుదలై మియామీకి చేరుకున్న తర్వాత రుబియో క్యూబా ప్రభుత్వానికి పైవిధంగా విజ్ఞప్తి చేశారు. కళాకారుడు లూయిస్ మాన్యుయెల్ ఒటెరో అల్కాంటారా క్యూబా నుండి మియామీకి చేరుకున్న విషయాన్ని రుబియో ఆదివారం ధృవీకరించారు. క్యూబా ప్రభుత్వం చాలా అన్యాయంగా 700 మందిని రాజకీయ ఖైదీలుగా మార్చిందని, వారిని తక్షణం విడుదల చేయాలని కోరారు. క్యూబా ప్రభుత్వం మానవ హక్కులను, అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘిస్తూ గుడ్డితనంతో వ్యవహరిస్తోందని, చూసీచూడనట్టు పట్టించుకోకుండా ప్రవర్తిస్తోందని, అందువల్ల అంతర్జాతీయ సమాజం క్యూబా విషయంలో తమతో చేతులు కలపాలని రుబియో కోరడం హాస్యాస్పదంగా మారింది. అనేక దశాబ్దాలుగా క్యూబాను అభివృద్ధి చెందనివ్వకుండా ఆ దేశంపై ఆంక్షలు విధిస్తూ, ఆ దేశ నాయకులను హత్యలు చేసేందుకు వరుస కుట్రలు చేస్తున్న అమెరికా గడచిన మూడు నెలలుగా పూర్తిస్థాయిలో క్యూబాపై చమురు ఆంక్షలు, సరుకు రవాణా ఆంక్షలు విధించడంతో ప్రపంచ వ్యాప్తంగా అనేకదేశాలు అమెరికాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్యూబాకు తమ సంఘీభావం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల చైనా కూడా నోరుతెరచి క్యూబాకు బాహాటంగా తమ సంఘీభావం ప్రకటించింది. అంతర్జాతీయ నిబంధనలను, మానవ హక్కులను అమెరికా విస్మరించి ఉల్లంఘించడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది.

**క్యూబాలో పునర్వినియోగ**

ఇంధన వనరుల అభివృద్ధికి రష్యా మద్దతు క్యూబాలో పునర్వినియోగ ఇంధన వనరుల అభివృద్ధికి రష్యా మద్దతు ఇస్తోంది. క్యూబాపై అమెరికా ఆంక్షల కారణంగా ఆ దేశంలో విద్యుత్ కొరత, ఇంధన కొరత ఏర్పడింది. ఇటీవల కొంత ఈ పరిస్థితి మెరుగుపడింది. సంప్రదాయేతర ఇంధన వలరుల అభివృద్ధిపై క్యూబా ప్రజలు విస్తారంగా దృష్టి పెట్టారు. వనరుల అభివృద్ధికి, కొరత నివారణకు రష్యన్ కంపెనీలు చాలా చు రుగ్గా పనిచేస్తున్నాయని ఇటీవల ఆ దేశ సంబంధిత శాఖామంత్రి చెప్పారు.

# వరల్డ్ కప్‌లో అర్జెంటీనా గెలవాలి: నెతన్యాహూ



**జెరూసలెం:** న్యూజెర్సీలో వరల్డ్ కప్ ఫుట్‌బాల్ తుదిపోరులో అర్జెంటీనా విజయం సాధించాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఆకాంక్షించారు. అర్జెంటీనా అధ్యక్షుడు జెవియర్ మిలే ఇజ్రాయెల్‌కు ఎంతో అనుకూలంగా ఉండటంతో నెతన్యాహూ పైవిధంగా ఆకాంక్షించారు. ఈ మేరకు ఒక సందేశం కూడా పంపారు. ''జేవియర్ నువ్వు మాకు స్నేహితుడివి, గొప్ప స్నేహితుడివి, ఈ ఒక్క మ్యాచ్‌లోనే కాదు, అన్నివిధాలుగా నీకు మేం మద్దతు ఇస్తాం, మీ దేశం విజయం సాధించాలి, ఆల్ ద బెస్ట్ '' అని సందేఃశంలో పేర్కొన్నారు.

# వారం రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కోమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు.

# రద్దీకి తగిన బస్సులేవీ?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. ఇంకా 3 వేల బస్సులు రోడ్డెక్కితే ప్రయాణికులకు ప్రయాణ అవస్థలు తీరుతాయని పలువురు రవాణా రంగ నిపుణులు సూచిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రస్తుతం టిజిఎస్ ఆర్‌టిసిలో 39,300 మంది ఉద్యోగులు ఉండగా అందులో 15 వేల మంది డ్రైవర్లు, 14 వేల మంది కండక్టర్లు, ఒక వెయ్యి సూపర్‌వైజర్స్, 220 మంది అధికారులు ఉన్నారు. ఇంకా సుమారు 6 నుంచి 7 వేల మంది సిబ్బంది అవసరం ఉందని యూనియన్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

**రాష్ట్రం ఏర్పడిన సమయంలో...**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో టిజిఎస్ ఆర్‌టిసికి మొత్తం 10,150 బస్సులు ఉండగా అందులో 2 వేల బస్సులు ప్రైవేట్ బస్సులు కాగా, 8 వేల పైచిలుకు సంస్థకు చెందిన బస్సులు ఉండేవి. అలాగే ఆ సమయంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 56 వేలకు పైగా ఉంటే, ప్రస్తుతం 39,300 ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. రాబోయే రెండేళ్లలో వేల సంఖ్యలో కొత్త బస్సులను కొనుగోలు చేయడంతో పాటు పాతబస్సులను దశలవారీగా తొలగిస్తేనే ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడే అవకాశం ఉందని, లేకపోతే ప్రయాణికుల రద్దీ, ఆలస్యాలు, నిర్వహణ సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మహానగరంలో మహా ఇబ్బందులు**

ముఖ్యంగా నిత్యం విస్తరిస్తున్న మహానగరానికి అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధి పర్చడం లేదనే విమర్శలు వెల్లుత్తుతున్నాయి. విశ్వనగరంగా చెప్పుకునే హైదరాబాద్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు బస్సుల కోసం వేచి ఉండడం, ఉన్న అరకొర బస్సులలో ప్రయాణ అవస్థలు ఆర్‌టిసి వైఫల్యాన్ని కళ్లకు కట్టినట్లుగా చూపిస్తున్నాయి. ఎంఎంటిఎస్ రైళ్లను కుదించడం, మెట్రోతో పాటు ప్రైవేట్ రవాణా రంగ వాహనాలు అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేయడం చిన్న, మధ్యతరగతి కుటుంబాలకు పెనుభారంగా మారింది.

**'మహాలక్ష్మి' పథకంతో పెరిగిన ప్రయాణికుల రద్దీ**

'మహాలక్ష్మి' పథకం అమలుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రావడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే, అదే స్థాయిలో కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురాక పోవడంతో ఇప్పటికే ఉన్న సర్వీసులపై ఒత్తిడి పెరిగిందని ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెడుతున్నా, జిల్లా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం కొత్త బస్సుల అవసరం తీవ్రంగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు.

**నూతన బస్సుల కొనుగోలులో ప్రభుత్వ జాప్యం**

ప్రస్తుతం టిజిఎస్ ఆర్‌టిసిలో నూతన బస్సుల కొనుగోలులో సంస్థ, ప్రభుత్వ జాప్యం కనిపిస్తోంది. ఇటీవల మహిళా సమాఖ్య సంఘాలు కొనుగోలు చేసిన 150 బస్సులు మినహా, మిగతా బస్సులు అన్ని ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులు కావడం గమనార్హం. నూతన బస్సుల కొనుగోలులో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించి, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడితే వచ్చే 6 ఏళ్లలో ఆర్‌టిసి కనుమరుగయ్యే పరిస్థితి ఉందని, ఒకవేళ ఆర్‌టిసి ప్రైవేట్ పరం అయితే అధిక చార్జీలతో ప్రయాణీకుల నడ్డీ విరగడం ఖాయమని రవాణా రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్‌టిసి సంస్థను ప్రభుత్వం లాభాపేక్ష లేకుండా ప్రజా రవాణా కోసం సద్వినియోగం చేసి, ప్రైవేట్ బస్సులను హైర్ చేసుకోవడం మానేసి, ప్రభుత్వమే నూతన బస్సులను కొనుగోలు చేసినప్పుడే ప్రయాణీకులు తక్కువ చార్జీలతో తమ గమ్యస్థానాలకు ఆనందంగా చేరుకుంటారని రవాణా రంగ నిపుణులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# విజేతగా పివి సింధు

(మొదటి పేజీ తరువాయి)

కీలక సమయాల్లో వరుస పాయింట్లు సాధించిన సింధు 21–17తో గేమ్‌ను తన ఖాతాలో వేసింది. మొదటి గేమ్‌ను గెలిచిన ఊపుతో రెండో గేమ్‌లోనూ సింధు మరింత దూకుడు పెంచింది. యమగుచి నెట్ గేమ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ.. 21–17తో రెండో గేమ్‌ను ముగించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. కాగా, 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ గెలిచిన తర్వాత సింధుకు ఇదే తొలి అంతర్జాతీయ టైటిల్ కావడం గమనార్హం.

**సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు**

జపాన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'జపాన్ ఓపెన్ సూపర్750' బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచిన భారత స్టార్ షట్లర్ పి.వి.సింధుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆమె కెరీర్‌లో తొలిసారిగా 'సూపర్750' టైటిల్‌ను సాధించడం భారత క్రీడారంగానికి గర్వకారణమని సిఎం పేర్కొన్నారు. తన ప్రతిభ, కృషి, పట్టుదలతో దేశ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న సింధు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా సిఎం ఒక ట్విట్ చేశారు. అలాగే సి.వి. సింధును క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి కూడా అభినందించారు.

# గుణపాఠం నేర్పుతాం

(మొదటి పేజీ తరువాయి)

అధిపత్యంపై పోరాటం, కొత్త జలమార్గాల వివాదం వంటివన్నీ తెరమీదకు ప్రముఖంగా రావడంతో గడచిన వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా అమెరికా–ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతూ పరిస్థితి చేయిదాటిపోయింది. ఈ పూర్వరంగంలో పూర్తిస్థాయి యుద్ధానికి ఇరాన్ సన్నద్ధమవుతూ ఉండటమే కాకుండా తమకు మద్దతుగా ఉంటే, హౌతీలు, హెజ్బొల్లాలు, హమాస్ సైన్యాలను కూడా యుద్ధ దాడులకు సిద్ధంగా ఉండాలని పిలుపు ఇచ్చిన తరుణంలో మొజ్తాబా ఖమేనీ ప్రకటన చేస్తూ, ఇరాన్ ఎంత సహనం పాటించినప్పటికీ, పదే పదే అమెరికా ''ఇస్లామాబాద్ ఒప్పందాన్ని'' ఉల్లంఘించిందని విమర్శించారు. ''ఇస్లామాబాద్ ఒప్పందం''పై డోనాల్డ్ ట్రంప్ చేసిన సంతకానికి ఎలాంటి విలువ, విశ్వసనీయతా లేదని వారి ప్రవర్తనే తేల్చి చెప్పిందని విమర్శించారు. ''శత్రువు అమెరికా యుద్ధాన్ని ప్రేరేపించింది, ఇప్పుడు దాని పర్యవసానాలను చవిచూడాలని ఎంతో ఉత్సాహపడుతోంది, వాటికోసం ఎదురుచూస్తోంది, పియమమైన ఇరాన్ ప్రజలు, పశ్చిమాసియా ప్రాంతంలోని ఇరాన్‌కు ఉన్న మిత్ర కూటమి దేశాలు అమెరికాకు మరపురాని, ఎన్నటికీ మరచిపోలేని గొప్ప గుణపాఠాలు నేర్పేందుకు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశాయని తెలుసుకోవాలి'' అని మొజ్తాబా ఖమేనీ తన ప్రకటనలో హెచ్చరించారు.

# స్వతంత్ర విచారణ

(మొదటి పేజీ తరువాయి)

'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రధానమంత్రికి రాసిన ఆ లేఖను రాహుల్‌గాంధీ కూడా 'ఎక్స్'లో పంచుకుంటూ, 'ప్రధానమంత్రి గారు, కోట్లాది మంది భక్తులు శ్రీరామ మందిరంలో తమ కష్టార్జితాన్ని విశ్వాసంతో సమర్పించారు అక్కడ విరాళాల దొంగతనం ఇప్పుడు ఎవరికీ తెలియని విషయం కాదు. ట్రస్ట్‌లోని ప్రతి సభ్యుడిని మీ ప్రభుత్వమే ఎంపిక చేసింది. ఈ విరాళాల దొంగతనంపై మీ మౌనం ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు. వెంటనే స్వతంత్ర విచారణ జరపాలన్నారు. పూర్తి లెక్కలను బహిరంగ పరచాలని, దోషులను న్యాయస్థానం ముందు నిలబెట్టడాలని డిమాండ్ చేశారు. రామ మందిరానికి సమర్పించిన విరాళాల అక్రమ వినియోగంపై ఆరోపణలు జూన్ మొదటి వారంలో వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేయగా, రామ మందిర ట్రస్ట్‌కు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు రాజీనామా చేశారు. జూన్ 25న, ట్రస్ట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసులో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. తమ లేఖలో రాహుల్‌గాంధీ, ఖర్గే ఇద్దరూ ప్రధానమంత్రితో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన పార్లమెంటులో ట్రస్ట్ ఏర్పాటును ప్రకటించినప్పటికీ, దాని సభ్యులను మాత్రం పూర్తిగా ఆయన ప్రభుత్వమే నియమించిందని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, దాని అనుబంధ సంస్థలతో సంబంధం కలిగి ఉన్నారనేది బహిరంగ విషయమేనని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అంతేకాకుండా, ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి కూడా ఆయనకు సన్నిహితుడేనని వారు తెలిపారు. 'ఇంతటి నేరం జరుగుతున్నప్పుడు మీరు ఇప్పుడు మౌనం వహించడం ఆమోదయోగ్యం కాదు. జవాబుదారీతనం, నష్టపరిహారం అందేలా చూడటం మీ విధి. నగదు, బంగారం, వెండితో సహా అన్ని కానుకల నిర్వహణతో పాటు, ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై తక్షణమే స్వతంత్ర, సమగ్ర విచారణకు ఆదేశించాలని మేము మిమ్మల్ని కోరుతున్నాము' అని వారు అన్నారు.

# యుఎస్ సైనికులు హతం

(మొదటి పేజీ తరువాయి)

ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఇరాన్‌పై యుద్ధ ఇప్పటికీ ఎంతో కీలకమైనదని ఆయన అన్నారు. ఇన్నాళ్ళుగా జరుగుతున్న యుద్ధంలో మొట్టమొదటిసారి ఇరాన్ ప్రత్యక్షంగా చేసిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరో అమెరికా సైనికులు జాడ తెలియకుండాపోయాడు. మరో నలగురు సైనికులు గాయపడ్డారు. జోర్డాన్‌లో ఉన్న అమెరికా వైమానికస్థావరంపై ఐఆర్‌జిసి శనివారం రాత్రి చేసిన దాడిలో ఈ ముగ్గురు సైనికులు మరణించారని సెంట్‌కామ్ ఉన్నతాధికారులు ఒక ప్రకటన చేశారు. ఈ మొత్తం యుద్ధంలో దీంతో ఇప్పటివరకూ 16 మంది అమెరికా సైనికులు మరణించారు. 450 మంది గాయపడ్డారు. జాడతెలియకుండాపోయిన అమెరికా సైనికుడి మృతదేహం లభించకపోవడంవల్ల మరణించివారి సంఖ్యలో అతడిని ఇంకా చేర్చలేదు. గాయపడిన నలుగురు సైనికులను జోర్డాన్ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం వరుసగా ఎనిమిదోరోజు ఆదివారం కూడా కొనసాగింది. ఇద్దరు అమెరికన్ సైనికులను హతమార్చిన ఇరాన్‌పై మహోగ్రస్థాయిలో సెంట్‌కామ్ సైన్యాలు ప్రతీకార దాడులు చేశాయి. ఐఆర్‌జిసి సైన్యాలను అంతం చేయడమే లక్ష్యంగా దాడులు చేసినట్లు పేర్కొంది. కాగా అమెరికా ప్రతీకారదాడులు తిప్పికొట్టామని, కువైట్‌లో ఉన్న రెండు అమెరికా స్థావరాలపై ఎదురుదాడులు చేశామని ఐఆర్‌జిసి మరో ప్రకటన చేసింది. అదేవిధంగా హోర్ముజ్ జలసంధిలో అక్రమ మార్గంలో ప్రయాణిస్తున్న రెండు నౌకలు ప్రమాదానికి గురయ్యాయని, మరో రెండు నౌకలను తాము నిలిపివేశామని పేర్కొంది. కువైట్‌లోని మరో విద్యుత్ నీటిశుద్ధి కేంద్రంపై కూడా వరుసగా రెండోరోజు ఇరాన్ దాడి చేసింది. ఈ నాలుగు నౌకలు తమ హెచ్చరికలను విస్మరించి అమెరికాకు తొత్తులుగా వ్యవహరించి సమస్యలు కొనితెచ్చుకున్నాయని విమర్శించింది. అదేవిధంగా ఇరాన్ నైరుతీ నగరమైన డార్ఖోవిన్‌లో నిర్మాణంలో ఉన్న అణువిద్యుత్ కేంద్రంపైన, ఖేష్మ్‌ద్వీపంపైన అమెరికా సైన్యాలు ఆదివారం తెల్లవారకముందే దాడులు చేశాయని ఐఆర్‌జిసి ప్రకటించింది. అదేవిధంగా ఇరాన్ ప్రయోగించిన మరో మూడు క్షిపణులను జోర్డాన్ సైన్యాలు కూల్చివేశాయి.

# స్వాతంత్ర్య ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

ఓ పోస్టు పెట్టారు. జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తనను బలవంతంగా తరలించారని, తన ఇష్టానికి విరుద్ధంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉంచారని వాంగ్‌చుక్ ఆరోపించారు. దీనిని 'అక్రమ నిర్బంధం'గా అభివర్ణించారు.

**ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ప్రతిపాదించిన 'చలో సంసద్' యాత్ర నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఢిల్లీ పోలీసులు అదనపు సిబ్బందిని మోహరించారని, బారికేడ్లను పటిష్టం చేశారని, కీలక ప్రవేశ మార్గాల వద్ద వాహనాలను తీవ్రంగా తనిఖీ చేస్తున్నారని ఆదివారం వర్గాలు తెలిపాయి. ప్రతిపాదిత యాత్రకు సిజెపి అనుమతి తీసుకోలేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. అధిక భద్రతా ప్రాంతం వైపు ఎలాంటి అనధికారిక యాత్రను అనుమతించకూడదని తాము నిశ్చయించుకున్నామని వారు తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసేంత వరకు నివారణా ఏర్పాట్లు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. న్యూఢిల్లీ, సెంట్రల్ ఢిల్లీ, ఉత్తర ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలలో బహుళ అంచెల బారికేడ్లు, పెరిగిన నిఘా, విధ్వంస నిరోధక తనిఖీలు, నిరంతర గస్తీతో అనేక ప్రవేశ మార్గాలను అధిక భద్రతా ప్రాంతాలుగా మార్చామని వారు చెప్పారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో శాంతిభద్రతలను నిర్ధారించడానికి విస్తృతమైన నివారణా ఏర్పాట్లు చేశామని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 'న్యూ ఢిల్లీ జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కీలక ప్రదేశాలలో అదనపు పికెట్లను ఏర్పాటు చేశారు, రిజర్వ్ బలగాలను సిద్ధంగా ఉంచారు. సున్నితమైన ప్రాంతాల్లో సిసిటివి నిఘాను కూడా ముమ్మరం చేశారు' అని ఆ వర్గాలు తెలిపాయి. జంతర్ మంతర్, పార్లమెంట్ స్ట్రీట్, సెంట్రల్ విస్టా, కన్నాట్ ప్లేస్, శంకర్ చౌక్, ఇతర కీలక ప్రదేశాల చుట్టూ భద్రతను పటిష్టం చేశారు. అదే సమయంలో, ఎలాంటి ఆకస్మిక పరిస్థితికైనా స్పందించేందుకు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను మోహరించారు.

# ప్రత్యేక అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

కో చైర్మన్లుగా పాల్గొననున్నారు. అలాగే జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిస్థితులపై పత్ర్యేక అధికారులు సమగ్రంగా చర్చించనున్నారు. ఉమ్మడి జిల్లాల స్థాయి సమీక్షలు ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రత్యేక అధికారులతో కలిసి రాష్ట్ర స్థాయి ఉన్నత సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు.

**సమీక్షించే ఏజెండా ఖరారు..**

రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా జరిగే సమావేశంలో చర్చించే అంశాల ఏజండాను ప్రభుత్వం ఖ రారు చేసింది. జిల్లాల్లో వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించి, తాగునీటి లభ్యత, వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి, విద్యుత్ సరఫరాను వారు నిరంతరం సమీక్షించాలి. వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి, ప్రతికూల పరిస్థితుల తీవ్రతను తగ్గించేందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సమస్యల పరిష్కారంలో జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర స్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. ముఖ్యంగా వాతావరణం, వర్షపాతం, రాబోయే కాలంలో వర్షాల అంచనా, వ్యవసాయం, పంటల ప్రణాళిక, పంటల సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ స్వల్ప కాలిక పంటల ప్రణాళిక, విత్తనాల లభ్యత, మైక్రో ఇరిగేషన్, జలాశయాల్లో ఇన్‌ఫ్లోలు, ఆయకట్టు రక్షణ, భూగర్భ జలాలు, విద్యుత్, విద్యుత్ డిమాండ్ తదితర అంశాలపైన సమీక్షించనున్నారు. ఈ సమావేశాల అనంతరం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయి కార్యాచరణకు తుది గడువులను విధిస్తూ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులు.: హైదరాబాద్‌జయేష్ రంజన్, (పత్యేక ప్రధాన కార్యదర్శి, ఎం ఎ.యుడి). రంగారెడ్డి: వికాస్ రాజ్, (ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, టిఆర్ ,బి). కరీంనగర్: బెన్హర్ మహేష్ దత్ ఎక్కా(ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జి ఎ డి). మెదక్: ఎ.వాణి ప్రసాద్, (ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వైఎటి,సి ). నిజామాబాద్: డాక్టర్ యోగితా రాణా, (కార్యదర్శి, విద్యా శాఖ). నల్లగొండ: హరిచందన దాసరి, (కార్యదర్శి, ఎల్ఇటి, ఎఫ్). ఆదిలాబాద్: ఇలంబర్తి కె.(కమిషనర్ ,రవాణ శాఖ). వరంగల్: ఎ. శ్రీదేవసేన, (కమిషనర్, కళాశాల, సాంకేతిక విద్యా శాఖ). మహబూబ్‌నగర్: వి.పి.గౌతమ్, (ప్రత్యేక కార్యదర్శి, గృహ నిర్మాణ శాఖ). ఖమ్మం: అనుదీప్ దురిశెట్టి, (జాయింట్ సెక్రెటరీ, ఐటిఇ,సి ).

# క్షేత్రస్థాయిలోనే ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో దానిని అవకాశంగా తీసుకుని ప్రతి అర్హత కలిగిన ఓటరును జాబితాలో చేర్చేలా కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 489 సమావేశాలు నిర్వహించామని, వెనుకబడిన నియోజకవర్గాలు వెంటనే చైతన్యవంతం కావాలని అన్నారు. ఈ నెల 30న మరోసారి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం నుంచి ఇన్చార్జ్ మంత్రులు అన్ని జిల్లాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని, పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపిలు కూడా తమ నియోజకవర్గాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేయాలని సూచించారు. ఇన్‌చార్జ్‌లుగా ఉన్న చోట ఎంపిలు సరిగా పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు, కార్పొరేషన్ చైర్మన్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బిఎల్ఓల నివేదికలతో పాటు పార్టీ నియమించిన బిఎల్ఏల నివేదికలను తప్పనిసరిగా పరిశీలించాలని, కేవలం బిఎల్ఓ నివేదికలపై మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు తప్పవని సిఎం స్పష్టం చేశారు. పార్టీ తరపున పనిచేస్తున్న బిఎల్ఏలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, గాంధీభవన్ బృందం ఎప్పటికప్పుడు బిఎల్ఓ, బిఎల్ఏ నివేదికలను పరిశీలించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులదేనని పేర్కొన్నారు. సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత కీలకమైందని, చిన్నపాటి నిర్లక్ష్యాన్ని కూడా సహించబోమని స్పష్టం చేశారు. ఆగస్టు 3 వరకు ప్రతి నాయకుడు ఎస్ఐఆర్ పనులపైనే దృష్టి కేంద్రీకరించాలని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు బిఎల్ఏలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎస్ఐఆర్ వల్ల జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో ఎంత శ్రమిస్తామో అదే స్థాయిలో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎస్ఐఆర్ పనులు పూర్తయ్యే వరకు నియోజకవర్గాల్లోనే ఉండాలని మహేష్ కుమార్ గౌడ్ పార్టీ నాయకులకు సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా ప్రతి నాయకుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని క్షేత్రస్థాయిలో విస్తృతంగా అమలు చేయాలని నాయకత్వం పునరుద్ఘాటించింది. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కలిసి ఇన్చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్చార్జుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు టిపిసిసి తెలియజేసింది.

### జంటగా నాలుగొందలు

# చరిత్ర సృష్టించిన కోహ్లీ, రోహిత్

అంతర్జాతీయ క్రికెట్లో భారత మాజీ కెప్టెన్లు విరాట్‌కోహ్లీ, రోహిత్‌శర్మలు చరిత్ర సృష్టించారు. వచ్చే వన్డే ప్రపంచకప్ 2027లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న రోకో జంటగా నాలుగొందల మ్యాచ్ ఆడేశారు. ప్రస్తుతానికి 50 ఓవర్ల ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న వీరు లార్డ్స్‌లో భారత్, ఇంగ్లండ్ మధ్య మూడోవన్డేలో ఆడడం ద్వారా ఈ ఫీట్ సాధించారు. తద్వారా.. ఈ మైలురాయిని అధిగమించిన మొట్టమొదటి భారత జోడీగా కోహ్లీ, రోహిత్ రికార్డు నెలకొల్పారు. భారత పురుషుల క్రికెట్‌కు విశేష సేవలందిస్తున్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కెరీర్ చరమాంకంలో మరో ఘనత సాధించారు. క్రీజునంటుకొని ఎన్నో మ్యాచ్‌లు గెలిపించిన వీరిద్దరు జంటగా నాలుగొందల మ్యాచ్ ఆడారు. అంతర్జాతీయ క్రికెట్లో మరే భారత ఆటగాళ్లకు సాధ్యమవ్వని రికార్డును సొంతం చేసుకుందీ ద్వయం. ఇప్పటికే టి20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన రోకో.. లార్డ్స్ వన్డేలో ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. ఇప్పటివరకూ



అంతర్జాతీయంగా 562 మ్యాచ్‌లు ఆడిన విరాట్ 28,285 రన్స్ కొట్టాడు. 85 శతకాలు బాదిన రన్ మెషీన్.. అత్యధిక వ్యక్తిగత స్కోర్.. 254 నాటౌట్. రోహిత్ విషయానికొస్తే.. వన్డేలు, టీ20లు, టెస్టులు కలిపి 514 మ్యాచ్లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో 50 శతకాలు, 112 హాఫ్ సెంచరీలతో.. 20,289 పరుగులు సాధించాడు. అత్యధిక వ్యక్తిగత స్కోర్.. 264.

# ఫిఫా వరల్డ్ కప్.. మూడోస్థానంలో ఇంగ్లండ్

ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా కిలియన్ ఎంబాపే రికార్డు సృష్టించినప్పటికీ.. ఫ్రాన్స్‌కు ఓటమి తప్పలేదు. ఫిఫా వరల్డ్ కప్ 2026లో భాగంగా మూడో స్థానం కోసం జరిగిన పోరులో 6–4తో ఫ్రాన్స్‌ను మట్టికరిపించిన ఇంగ్లండ్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. బుకాయో సాకా హ్యాట్రిక్‌తో చెలరేగగా.. డెక్లాన్ రైస్, ఎజ్రీ కాన్సా, జూడ్ బెల్లింగ్హామ్ చెరో గోల్తో చెలరేగి ఇంగ్లండ్‌కు విజయాన్ని అందించారు. అయితే ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో ఇంగ్లండ్ కాంస్య పతకం గెలవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 1966లో విజేతగా నిలిచిన ఆ జట్టుకు ఇప్పుడు మళ్లీ ప్రపంచ కప్ పతకం దక్కింది. ఆట మొదలైన మూడో నిమిషంలోనే డెక్లాన్ రైస్ గోల్ చేసి ఇంగ్లండ్‌కు ఆధిక్యం అందించాడు. 18వ నిమిషంలో ఎజ్రీ కాన్సా హెడ్డర్తో స్కోర్‌ను 2–0కు పెంచాడు. ఫ్రాన్స్ తేరుకునేలోపే బుకాయో సాకా 37వ నిమిషంలో గోల్ నమోదు చేశాడు. తొలి అర్ధభాగంలోని బోనస్ టైమ్లో మళ్లీ సాకా బంతిని గోల్ పోస్టుకి పంపించడంతో విరామ సమయానికి ఇంగ్లండ్ 4–0 తేడాతో పటిష్ట ఆధిక్యంలో నిలిచింది.

**సెకండ్ ఆఫ్‌లో చెలరేగిన ఎంబాపే...**

రెండో అర్ధభాగంలో ఫ్రాన్స్ పుంజుకుంది. 48వ





నిమిషంలో కిలియన్ ఎంబాపే గోల్ చేసి ఖాతా తెరిచాడు. 54వ నిమిషంలో బ్రాడ్లీ బార్కోలా మరో గోల్ చేయడంతో విజయంపై ఫ్రాన్స్ ఆశలు చిగురించాయి. 67వ నిమిషంలో ఎంబాపే మరోసారి గోల్ చేసి స్కోర్ను 4–3కు చేర్చాడు. ఈ గోల్‌తో ప్రపంచ కప్లో మొత్తం 22 గోల్స్ పూర్తి చేసిన ఎంబాపే.. వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా ఈ టోర్నీలో తన గోల్స్ సంఖ్యను 10కి చేర్చి గోల్డెన్ బూట్ రేసులోనూ అగ్రస్థానంలో నిలిచాడు. స్కోర్ను సమం చేసేందుకు ఫ్రాన్స్ ప్రయత్నిస్తున్న సమయంలో ఇంగ్లండ్‌కు పెనాల్టీ లభించింది. ఆ అవకాశాన్ని సాకా సద్వినియోగం చేసుకుని హ్యాట్రిక్ పూర్తి చేశాడు. అదనపు సమయంలో ఫ్రాన్స్ తరఫున ఔస్మాన్ డెంబెలే గోల్ చేసినా.. మ్యాచ్ ముగిసే ముందు జూడ్ బెల్లింగ్హామ్ మరో గోల్‌తో ఇంగ్లండ్‌కు విజయాన్ని అందించాడు. అలా చివరకు 6–4తో విజయం సాధించిన ఇంగ్లండ్ ప్రపంచకప్‌ను మూడో స్థానంతో ముగించింది.


## ఆరోగ్యం

### క్రమబద్ధమైన జీవన శైలితో ఆరోగ్యం

ఫిట్‌నెస్, పోషకాహారానికి సంబంధించిన తాజా పరిశోధనలు ఆసక్తికరమైన సమాచారాన్ని అందించాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గం కఠినమైన వ్యాయామాలు కాదని, క్రమబద్ధమైన జీవనశైలేనని స్పష్టంచేశాయి. ఈ పరిశోధనలను అనుసరించి, అప్పుడప్పుడు అధిక తీవ్రతతో వ్యాయామం చేయడం కంటే ప్రతిరోజూ మోస్తరు స్థాయిలో వ్యాయామం చేయడం శరీరానికి ఎక్కువ ప్రయోజనం కలిగిస్తుంది. ఇది శక్తి, స్థైర్యాన్ని క్రమంగా పెంచడమే కాకుండా గాయాల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. అదేసమయంలో పేగుల ఆరోగ్యం కూడా ఫిట్‌నెస్‌లో కీలకపాత్ర పోషిస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. పేగుల్లోని సూక్ష్మ జీవుల సమతుల్యత శరీరంలోని వాపును తగ్గించడం, శక్తిని సమర్థంగా వినియోగించడం, వ్యాయామం అనంతరం త్వరగా కోలుకునేలా చేయడంలో సహాయపడుతుంది. రోజుకు గంటసేపు వ్యాయామం చేసినా, మిగిలిన సమయం మొత్తం కూర్చోవడం ఆరోగ్యానికి అనుకూలం కాదని పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రతి గంటకు కొద్దిసేపు నడవడం లేదా శరీరాన్ని కదిలించడం రక్త ప్రసరణ, జీవక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణకు మేలు చేస్తుంది. అలాగే ప్రోటీన్‌ను ఒకేసారి ఎక్కువగా తీసుకోవడం కంటే రోజంతా సమానంగా పంచుకొని తీసుకోవడం కండరాల పునరుద్ధరణ, పెరుగుదలకు అనుకూలంగా ఉంటుందని అధ్యయనాలు వెల్లడించాయి. నాణ్యమైన, తగినంత నిద్ర కూడా వ్యాయామంతో సమానమైన ప్రాధాన్యం కలిగి ఉంది. మంచి నిద్ర కొవ్వు జీవక్రియను మెరుగుపరచడంతో పాటు కండరాల పునరుద్ధరణకు, మెదడు పనితీరుకు తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే, ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామం, సమతుల ఆహారం, రోజంతా చురుకైన కదలికలు, తగినంత నిద్ర వంటి చిన్న కానీ నిరంతర అలవాట్లే దీర్ఘకాలిక ఆరోగ్యానికి నిజమైన పునాది అని తాజా పరిశోధనలు మరోసారి నిర్ధారిస్తున్నాయి.



### గాయాల సత్వర నివారణకు 'కాలజెన్'!



ఒకే ఒక్క మాయ మాత్రతో శరీరం పూర్తిగా నయం అవుతుంది అనుకోవడం మనకు ఎంతో బాగుంటుంది. కానీ శరీరం ఆ విధంగా పని చేయదు. అది కొంచెం ఎక్కువ తెలివిగా, కొంచెం ఎక్కువ క్లిష్టంగా ఉంటుంది. ఈ క్రమంలోనే కాలజెన్ గురించి పరిశోధనలు ఆసక్తి రేపుతున్నాయి. కాలజెన్ అనేది మన శరీరంలో ఉన్న ఒక ముఖ్యమైన నిర్మాణ ప్రోటీన్. ఇది చర్మం, టెండన్లు, లిగమెంట్లు, కార్టిలేజ్ లాంటి భాగాలలో ఉంటుంది. కాబట్టి చాలా మంది ఈ కాలజెన్‌ను మాత్రల రూపంలో తీసుకుంటే, గాయాలు నేరుగా బాగుపడతాయని అనుకుంటారు. కానీ నిజంగా ఏమవుతుందంటే, మీరు కాలజెన్ తీసుకున్నప్పుడు అది నేరుగా గాయమైన చోటికి వెళ్లదు. మీ జీర్ణవ్యవస్థ దాన్ని చిన్నచిన్న అమినో ఆమ్లాలు, పెప్టైడ్లుగా విడగొడుతుంది. ఆ తరువాత శరీరం వాటిని ఎక్కడ అవసరం ఉంటే అక్కడ ఉపయోగిస్తుంది. అంటే, ఇక్కడ గాయం ఉంది కాబట్టి అన్నీ ఇక్కడికి పంపండి అని శరీరం ఆదేశాలు ఇవ్వదు. అది ఒక పెద్ద వ్యవస్థలా పనిచేస్తుంది, ఒకే చోట కాదు. అయితే, కాలజెన్ వల్ల ఉపయోగమేలేదని అనుకోవడం పొరపాటే. కాలజెన్ సప్లిమెంట్లు జాయింట్ల సౌకర్యాన్ని మెరుగుపరచవచ్చని, కనెక్టివ్ టిష్యూ ఆరోగ్యానికి సహాయం చేయవచ్చని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. ముఖ్యంగా మీరు విటమిన్ 'సి'తో కలిపి తీసుకుంటే, సరైన వ్యాయామం లేదా రిహాబిలిటేషన్‌తో పాటుగా చేస్తే కొంత ఉపయోగం ఉంటుంది. కానీ, ఇక్కడ ఒక విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. కాలజెన్ సప్లిమెంట్ అనేది ఇది రిపేర్ టూల్ కాదు. ఇది కేవలం శరీరానికి అవసరమైన ముడి పదార్థం మాత్రమే.

**నిజమైన రికవరీ అంటే..**

* మీరు ఎలా వ్యాయామం చేస్తున్నారు? * మీరు ఎంత విశ్రాంతి తీసుకుంటున్నారు? * మీరు ఎలా ఆహారం తీసుకుంటున్నారు? ఇలాంటి అంశాలన్నీ కలిసి పని చేస్తాయి. కాబట్టి శరీరం నయం కావడం ఒక ప్రొడక్ట్‌కు అప్పగించలేం. అది మీరు ప్రతిరోజూ తీసుకునే నిర్ణయాల ఫలితం. ఒక్క క్యాప్సూల్ కాదు. సరైన జీవన విధానం. అదే నిజమైన చికిత్స.

### గాయం ఎలా నయమవుతుంది?


ఇది చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఇందులో చాలా అంశాలు కలిసి పనిచేస్తాయి:

* ఇన్‌ఫ్లమేషన్ (inflammation) నియంత్రణ
* కొత్త కణాల నిర్మాణం
* రక్త ప్రసరణ (blood flow)
* క్రమంగా కదలికలు (movement, mechanical loading)
* సరిపడ నిద్ర
* సమతుల్య ఆహారం

ఇవి అన్నీ కలిసే గాయం నయం అవుతుంది. ఒక్క కాలజెన్ మాత్రతో కాదు.

**ప్రోటీన్ ముఖ్యమా?**

అవును. కానీ కాలజెన్ మాత్రమే కాదు, మొత్తం ప్రోటీన్ తీసుకోవడం ముఖ్యం. ఎందుకంటే శరీరం ఒకే గాయాన్ని చూసి పని చేయదు. అది మొత్తం శరీర అవసరాలను పరిగణలోకి తీసుకుంటుంది. అందుకే మీరు తీసుకునే పోషకాలు శరీరంలో విభిన్న అవసరాలకు పంపడం జరుగుతుంది. మనకు త్వరగా ఫలితాలు కావాలనే ఒక



అభిప్రాయం బలంగా ఉంటుంది. ఒక మాత్ర తీసుకుంటే సమస్య సరిదిద్దుకుందాం అనిపిస్తుంది. కానీ శరీరం అలా పని చేయదు. అది సమయం, స్థిరత్వం, సరైన పరిస్థితులు కోరుతుంది.

### కార్మికుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు

# ఎఐటియుసి సమరశీల పోరాటాలు

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

**ప్రజాపక్షం/గుర్రంపోడు:** కార్మికుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు ఎఐటియుసి నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా గుర్రంపోడులో జరిగిన ఎఐటియుసి నల్లగొండ జిల్లా 11వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పడిన మొట్టమొదటి సంఘం ఎఐటియుసి అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మిక లోకం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పెట్రోల్, వంట గ్యాస్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారం వేశారని విమర్శించారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలతో ధనవంతులు మరింత ధనవంతులుగా, పేదవారు మరింత పేదవారుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ దేశంలో 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే కార్మిక




చట్టం, ఫ్యాక్టరీల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతన చట్టం సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిగంటలు పెంచి కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతూ, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు మారుస్తుందని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అవుతున్నా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు మారలేదన్నారు. కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ అమలు కాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాలని యూసుఫ్ కోరారు. మహాసభకు ముందు పట్టణంలో కార్మిక ప్రదర్శన నిర్వహించారు. మహాసభలో ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధానకార్యదర్శి ఎం.నరసింహ, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, రాష్ట్రకార్యదర్శి ఎండి.ఇమ్రాన్, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎన్.రామస్వామి, పల్లా దేవేందర్‌రెడ్డి, కెఎస్.రెడ్డి, నూనె వెంకటేశ్వర్లు, పి.వెంకట్రావు, డి.వెంకన్న, దొంటి వెంకన్న, బి.వెంకటేష్, రేపాక లక్ష్మీపతి, జాల పెద్ద నరసింహ, ఎస్‌కె.అమీర్, జాల చిన్న నరసింహ, లింగయ్య, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధానకార్యదర్శి చలం పాండురంగారావు, బంటు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంత్‌రావు**

**ముగిసిన రాజకీయ శిక్షణ తరగతులు**

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నిచ్చెనమెట్ల వ్యవస్థను అంతం చేసి అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యమని, అందుకు కమ్యూనిస్టులు నిరంతరం పోరాడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంత్‌రావు, సిపిఐ మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో రెండు రోజులపాటు జరిగిన రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. శిక్షణలో మొదటిరోజు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మన కర్తవ్యం అనే అంశంపై సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, మార్క్సిజం సమకాలిన సమాజంలో దాని ప్రాధాన్యతపై మధుకర్, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో భారతదేశం పర్యవసనాలు అంశంపై యూసుఫ్, రెండవ రోజు పార్టీ కార్యక్రమాలపై సిహెచ్.రాజారెడ్డి, మతం మతోన్మాదం లౌకికవాదం, కేంద్రంలో అమలవుతున్న హిందుత్వ జెండా అంశంపై ప్రొఫెసర్ శంకర్ నా రాయణ, పార్టీ ఆవశ్యకత, పార్టీ ప్రజాసంఘాల నిర్మాణంపై భాగం హేమంతరావు రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల్లో బోధించారు. రెండో రోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాగం






హేమంత రావు హాజరై మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రశ్నించేది, ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతు కమ్యూనిస్టులదేనని అన్నారు. కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం వీధుల్లో నిలిచి పోరాడుతున్నది కమ్యూనిస్టుల ఉద్యమేనని గుర్తుచేశారు. ప్రతి కార్యకర్త రాజకీయ దృక్పథంతో పనిచేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితులు అవరోధాలను అధిగమించి పార్టీ నిర్మాణం చేపట్టాలని పార్టీ శ్రేణుల కు సూచించారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి ప్రభుత్వరంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. ప్రస్తుత రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై శిక్షణ తరగతుల ద్వారా క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నింపామని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. పోరాటాల ద్వారా దేశంలో ప్రత్యామ్నాయ పార్టీగా కమ్యూనిస్టులు ఎదగాలని బాగం ఆకాంక్షించారు. ముగింపు రోజు శిక్షణ తరగతులలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పైండ్ల శాంతి కుమార్, సుధాకర్ రెడ్డి, పరమాండ్ల రాజయ్య, అన్నారపు రాజేందర్, సొతుకు ప్రవీణ్ కుమార్, కొరిమి సుగుణ, క్యాతరాజ్ సతీష్, కుడుదుల వెంకటేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మామిడాల సమ్మిరెడ్డి, పెంట రవి, రేగొండ రాజయ్య, కుమారస్వామి, నబీ, గుంటీ చంద్రమౌళి, మాతంగి రామచందర్, జి.శ్రీనివాస్, నూకల చంద్రమౌళి, ఆసిఫ్ పాషా, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, గోలి లావణ్య, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వాంగ్‌చుక్‌కు పౌరసమాజం సంఘీభావం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** దేశ వ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షల పేపర్ లీకేజీలతో పాటు నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన పర్యావరణ వేత్త, సామిజిక కార్యకర్త వాంగ్‌చుక్‌కు మద్దతుగా ఏదులాపురం మున్సిపాలిటీలో ప్రత్యామ్నాయ పౌర సమాజం (సిసిఎ) ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపై మాట్లాడారు. వరుస పేపర్ లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలపై పోరాడుతూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్ చుక్‌ను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పేపర్ లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యశాఖ మంత్రి ధర్మేంద ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకు రావాలని, విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్రప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభమైన ఈ నిరసన స్ఫూర్తిగా రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం పెద్దతండా మీదుగా నాయుడుపేట తీగల వంతెన వరకు సాగిన ర్యాలీలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఐఎఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, 28, 30 వార్డుల సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్, బిఆర్‌ఎస్ నాయకులు మైబల్ సాబ్, మున్సిపాలిటీ సిపిఎం అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు విజయ్, రమణారావు, భాస్కర్, డివైఎఫ్ఐ నాయకులు బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనం

**ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ డిమాండ్**

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** శ్రమ దోపిడీకి గురవుతున్న సంఘటిత, అసంఘటిత కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆదిలాబాద్ జిల్లా 4వ మహాసభలు జిల్లా కేంద్రంలోని బజరంగ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బావురత్ల గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అధ్యక్షతన జరిగిన మహాసభల సందర్భంగా పట్టణంలో భారీ కార్మిక ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. మహాసభకు ఎస్.బాలరాజ్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయని, పేద కార్మికుల కోసం పరిపాలన కొనసాగించాల్సింది పోయి.. కార్పొరేట్ల ఆస్తులు పెంచడం కోసమే పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో కరీంనగర్ కేంద్రంగా జరిగే ఎఐటియుసి రాష్ట్ర మహాసభల్లో పోరాట కార్యాచరణ రూపొందించి కార్మిక హక్కుల రక్షణకు ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. మహాసభలో ఎఐటియుసి అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు




**ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర**

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని, యువతను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభమైందని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పేర్కొన్నారు. ఎఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా 3వ మహాసభలు చిలుకూరులోని కస్తూరి అప్పారావు హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఎఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు మేకల శ్రీనివాసరావు జెండా ఎగురవేసి మహాసభ ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ సెప్టెంబర్ 8,9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా యువజన ఉద్యమాలకు కొత్త దిశను నిర్దేశిస్తామని ఎఐవైఎఫ్ ప్రకటిస్తుందన్నారు. సూర్యాపేట జిల్లా మహాసభల సందేశమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యలపై చైతన్యం పెంపొందిస్తూ ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. మహాసభలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చేపూరి కొండలు, జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ ఏడెల్లి శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగరాజు, సైదులు, వీరన్న, శ్రీను, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఐవైఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు బద్దం కృష్ణారెడ్డి, షేక్ సాహెబ్‌అలీ, మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, గుండు వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, పిల్లుట్ల కనకయ్య, రెమిడాల రాజు, చిలువేరు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు

### మేయర్ బుర్రి చైతన్య రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వినియోగదారులకు నాణ్యమైన సానిటరీ వస్తువులు,ఎలక్ట్రికల్ సామగ్రి,పెయింట్స్ ఉత్పత్తులను అందిస్తూ మంచి గుర్తింపు పొందాలని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని డివికే రోడ్డులో నూతనంగా ఆధునిక స్పేర్ పార్ట్స్ తో ఏర్పాటు చేసిన బజరంగ్ సానిటరీ అండ్ ఎలక్ట్రికల్స్ షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి, అనంతరం రిబ్బన్ కట్ చేసి చేసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన సానిటరీ వస్తువులు, ఎలక్ట్రికల్ సామగ్రి, పెయింట్స్ ఉత్పత్తులను అందిస్తూ విశ్వసనీయమైన సేవలతో వ్యాపార రంగంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. నూతనంగా ప్రారంభించిన సంస్థ ప్రజల ఆదరణ పొందుతూ మరింత అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బెల్లి దానయ్య,బదం సింగ్, జగదీష్ సింగ్,వేరో సింగ్, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ అమీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటిసి గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్,కార్పొరేటర్స్ పిల్లి కృష్ణమరాజు,రమ్యశ్రీ పాల్గొన్నారు.

## బిఎన్ఎస్ సెక్షన్ 163,సెక్షన్ 144 అమలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నకిరేకల్ మండలం మూసీ గ్రామానికి చెందిన మత్స్య శాఖ సహకార సంఘం లిమిటెడ్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎన్నికలు నల్లగొండ పట్టణంలోని మహిళా సమాఖ్య భవన్, మిర్యాలగూడ రోడ్ డీటీసీ సమీపంలో నిర్వహించనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈనెల 20, 21 తేదీల్లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 163, 144 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు, వారి ప్రతినిధులు, సభ్యులు, మద్దతుదారులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. ఎన్నికల ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కోరారు.

## 'నేటి' నుంచి శ్రీశైలం ఉదయం బస్సు ప్రారంభం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట నుండి శ్రీశైలం నూతన డీలక్స్ బస్సును నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ వి. సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట నుండి ప్రతిరోజు ఉదయం 6.50 నిమిషాలకు బయలుదేరి, మధ్యాహ్నం 2 గంటలకి శ్రీశైలం చేరుతుందన్నారు. ఈ బస్సు నల్లగొండ, దేవరకొండ, అచ్చంపేట మీదుగా శ్రీశైలం చేరుకుంటుందని వివరించారు. శ్రీశైలం నుండి తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు సూర్యాపేటకు చేరుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం నడుస్తున్న సెమీ డీలక్స్ బస్సు సూర్యాపేటలో ఉదయం 9.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు శ్రీశైలం చేరుతుందని, మరుసటి రోజు తెల్లవారు జామున 4 గంటలకు శ్రీశైలం నుండి బయలు దేరి మధ్యాహ్నం 12 గంటలకు సూర్యాపేటకు చేరుతుందని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇతర వివరాలకు 7382943819ను సంప్రదించాలని కోరారు.


## ప్రజలకు మెరుగైన సేవలందించాలి

### పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పి




**ప్రజాపక్షం/చివ్వెంల :** ఎస్పి కె. నరసింహ ఆదివారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని సిబ్బంది పనితీరు, విధుల పట్ల వారి అంకిత భావాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల రికార్డులు, కేసుల నమోదు ప్రక్రియ, కేసుల దర్యాప్తు పురోగతి, ఫిర్యాదుల నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు మర్యాదగా నడుచుకోవాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలను అందించాలని ఆదేశించారు. అసాంఘిక చర్యలపై కఠినంగా వ్యవహరించాలని, మహిళ, బాలల భద్రతలో ప్రాధాన్యతతో పనిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళికతో కృషి చేయాలని కోరారు. పాత నేరస్తులను చట్టప్రకారం బైండోవర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్న కుమార్, రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ వి. మహేశ్వర్ పాల్గొన్నారు.

## రక్తదానం చేసి... ప్రాణదాతలు కండి



**ప్రజాపక్షం/హాలియా:** యువకులు రక్తదానం చేసి పలువురికి ప్రాణ దానం చేయడం అభినందనీయమని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. ఆదివారం హాలియాలోని టైం స్కూల్ ప్రాంగణంలో చంద్రశేఖర్ ఆజాద్ జయంతి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువకులు సామాజిక స్పృహ కలిగి ఉన్నప్పుడే సామూహిక సామాజిక సేవ కార్యక్రమాలు చేయగలుగుతారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువకులు ఈ రక్తదానం శిబిరంలో పాల్గొని రక్తం అందించారు. రక్తదాన శిబిరాన్ని గుర్తించి కొన్నాయిగూడెం గ్రామానికి చెందిన గోగుల శివ నాగరాజు శిబిరం వద్దకు వచ్చి తలసేమియా వ్యాధికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి అతనికి పది రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఆ యువకుని కుటుంబానికి అన్ని వేళల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధనకు ఐక్య ఉద్యమం

### ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరుట్ల జానకిరెడ్డి

### 20న బుల్లెట్ ట్రైన్ సాధనకు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ముందు అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల మహాధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధనకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఉస్మానియా యూనివర్సిటి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట వంటి ప్రధాన వాణిజ్య, విద్య, పారిశ్రామిక కేంద్రానికి బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ నుంచి తొలగించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు దశాబ్దాలుగా సూర్యాపేటకు రైల్వే సౌకర్యం వస్తుందని చెబుతున్నప్పటికి ఇప్పటికి ఆ కల నెరవేరలేదన్నారు. తాజాగా ప్రతిపాదిత మూడో అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను పక్కన పెట్టడం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛను దెబ్బతీసిందని అన్నారు. సూర్యాపేట పట్టణానికి ఉన్న వాణిజ్య ప్రాధాన్యం, జనాభా, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థలు, రైస్ మిల్లులు, జాతీయ రహదారి 65పై ఉన్న వ్యూహాత్మక స్థానాన్ని దృష్టిలో ఉంచుకొని బుల్లెట్ ట్రైన్ మార్గంలో సూర్యాపేటను తప్పనిసరిగా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకువచ్చి సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధిస్తామన్నారు. అవసరమైతే ప్రజాభిప్రాయ సేకరణ, ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 20న బుల్లెట్ ట్రైన్ సాధనకై సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ముందు అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాకు ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

**బుల్లెట్ ట్రైన్ సాధ సమితి కన్వీనర్‌గా ఆరుట్ల జానకిరెడ్డి**

బుల్లెట్ ట్రైన్ సాధనకై నూతన కమిటిని ఈ రౌండ్ టేబ్ సమావేశంలో ఎన్నుకున్నారు. బుల్లట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్‌గా ఉస్మానియా యూనివర్సిటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు గౌరవ సలహాదారులుగా పెద్దిరెడ్డి గణేష్, చెన్నోజు రమణాచారితో పాటు అన్ని పార్టీలు, ప్రజాసంఘాల నుండి కో కన్వీనర్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, పెద్దిరెడ్డి రాజా, మల్లు నాగార్జున్ రెడ్డి, మండారి డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్, బూర వెంకటేశ్వర్లు, వరికుప్పల వెంకన్న, గట్ల రమాశంకర్, ఇస్మాయిల్, మీలా మహదేవ్, కొల్లి మధుసూదన్ రావు, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, నూకల సుదర్శన్ రెడ్డి, అనుములపురి రవిబాబు, పెద్దిరెడ్డి గణేష్, తల్లమల్ల హుసేన్, చిన్నోజు రమణాచారి, మట్టిపెల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## 'నేడు' ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక పై సోమవారం ఉదయాదిత్య భవన్‌లో నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి,రాష్ట్ర ఎస్‌సి అభివృద్ధి, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధుల బృందం సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంత్రులు ,శాసనమండలి చైర్మన్‌తో పాటు, ఉమ్మడి జిల్లా పార్లమెంట్ సభ్యులు ,శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి జిల్లా అధికారులు హాజరవుతున్న ఈ సమావేశానికి అవసరమైన ఏర్పాట్ల విషయమై ఆదివారం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయాదిత్యభవన్ లో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షా బావ పరిస్థితులు,భూగర్భ జలాలు,తాగునీటి నిర్వహణ వ్యవసాయం, ఉద్యాన , పశుసంవర్ధక, ఇరిగేషన్, విద్యుత్తు, వైద్య ఆరోగ్య తదితర అంశాలపై ప్రస్తుత పరిస్థితులతో పాటు, భవిష్యత్తు కార్యాచరణ పై సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యదావిధిగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని, జిల్లా రెవెన్యూ అధికారి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, తదితరులు మాట్లాడారు.

## పట్టపగలు రూ.9 లక్షల చోరీ

### టిఫిన్ చేస్తుండగా బ్యాగు ఎత్తుకెళ్లిన దొంగల ముఠా



**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి :** జాతీయ రహదారిపై ప్రయాణికుల భద్రతకు పెద్ద ప్రశ్నార్థకం. నార్కెట్‌పల్లి మండలం పూజిత హోటల్ వద్ద ఆదివారం ఓ ప్రయాణికుడి వద్ద నుంచి రూ.9 లక్షలు అపహరణకు గురయ్యాయి.ఖమ్మం జిల్లా నాయుడుపేటకు చెందిన ఆరె రవీందర్ రెడ్డి(47) మోటార్ మెకానిక్. వ్యాపార నిమిత్తం రూ.9 లక్షల నగదును టూర్ బ్యాగులో పెట్టుకుని,బామ్మర్ది సంతోష్ రెడ్డితో కలిసి ఆర్‌టిపి బస్సు టిఎస్ 09 జడ్ 8002 లో హైదరాబాద్‌కు బయలుదేరాడు.ఉదయం 8 గంటలకు బస్సు నార్కెట్‌పల్లి పూజిత హోటల్ వద్ద ఆగింది. రవీందర్ రెడ్డి బ్యాగు పక్కన పెట్టి టిఫిన్ చేస్తుండగా,అప్పటికే అక్కడ కాపు కాసిన గుర్తుతెలియని వ్యక్తి ఒక్కసారిగా బ్యాగు లాక్కొని పరుగెత్తాడు.బయట సిద్ధంగా ఉన్న కారులో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ఉన్నారు.నిందితులు వెంటనే కారులో హైదరాబాద్ వైపు పరారయ్యారు. ఘటన ఉదయం 8.20 గంటలకు జరిగింది.సమాచారం అందుకున్న సిఐ సిరికొండ సురేష్ ,ఎస్ఐ పి.విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. హోటల్, రోడ్డు పై ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



## మేరు సంఘ అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మేరు కులస్తుల అభివృద్ధి, సంక్షేమానికి సంఘ పటిష్టతకు కృషి చేస్తామని నూతన జిల్లా అధ్యక్షులు బోనగిరి సురేందర్ మేరు, ప్రధాన కార్యదర్శిగా గుంటి రామకృ ష్ణజిల్లా మేరు అన్నారు.జిల్లా మేరు సంఘానికి ఆదివారం పట్టణంలోని ఎస్‌బిఐ గార్డెన్లో జరిగిన ఎన్నికలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బోనగిరి సురేందర్ మేరు, ప్రధాన కార్యదర్శిగా గుంటి రామకృష్ణ మేరు,నల్లగొండ పట్టణ అధ్యక్షుడిగా నామ రాంప్రసాద్ మేరు ప్రధాన కార్యదర్శిగా రాపర్తి వెంకటేశ్వర్లు మేరు లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ మేరు కులస్తుల అభివృద్ధికి సంక్షేమానికి సంఘ పటిష్టతకు కృషి చేస్తామన్నారు.మేరు కులస్తులను బిసిడి నుండి బీసీ ఏలోకి మార్చాలని, 50 సంవత్సరాలు దాటిన కులవృత్తి చేస్తున్న మేరు కులస్తులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య భీమా హెల్త్ కార్డులు అందించాలని, డిమాండ్ చేశారు.వీటిని అమలు అయ్యేంతవరకు పోరాడుతామన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మేరు కులస్తులకు అందడానికి కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీని మేరు కులస్తులు నాయకులు ఘనంగా సాల్వాలతో సన్మానించి అభినందించారు.



## మహిళలకు ఇందిరా శక్తి చీరలు

### ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పట్టణంలోని పలు వార్డులకు చెందిన మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరలను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల సంక్షేమం, సాధికారతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వం..ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నకిరేకల్ పట్టణాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు.అలాగే నకిరేకల్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరవడం ఆనందదాయకమని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,నాయకులు పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న,గంగాధర పద్మ,గాజుల సుకన్య,పద్మ మురారి శెట్టి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుండాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుండాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌లో హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట ఆర్యవైశ్య సంఘం పట్టణ కమిటి ప్రమాణ స్వీకారానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదితో కలిసి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఆర్యవైశ్యులు ఇప్పటికే బడిలోను, గుడిలోను జరిగే సేవా కార్యక్రమాల్లో ముందుంటారని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు ఐకమత్యంతో కలిసిమెలిసి పనిచేయాలన్నారు. అనంతరం సూర్యాపేట పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు చేత జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి పుప్పల శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, యువజన సంఘం, మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, మీడియా, విద్యారంగం, అడ్వకేట్స్ కమిటి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సోమనర్సయ్య, కోశాధికారి చల్లా లక్ష్మి కాంత్, క్రమశిక్షణ సంఘం చైర్మన్ బండారు రాజు, ప్రముక పారిశ్రామిక వేత్త మీలా మహదేవ్, ఉప్పల ఆనంద్, బొమ్మిడి లక్ష్మి నారాయణ, కక్కిరేణి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణలో యువత భాగస్వామ్యం అవసరం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యువత వాటికి బానిస కాకుండా కాపాడేందుకు పోలీసులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటి సభ్యులు, మాజీ రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసుల పాత్ర ఎంత ముఖ్యమో, అదే స్థాయిలో యువత, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత తెలంగాణ డిజిపి, అప్పటి హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్ నాయకత్వంలో మాదక ద్రవ్యాల నియంత్రణలో హైదరాబాద్ పోలీసులు దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా కార్యదర్శి దండా వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షులు గుంటకండ్ల ముకుంద రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రావుల రాంబాబు, నియోజక వర్గ అధ్యక్షులు బంగారు శ్రీధర్, పట్టణ అధ్యక్షులు పిడమర్తి ఉపేందర్ పాల్గొన్నారు.

# మామూళ్లకే ప్రాధాన్యం?.. విద్యుత్ కనెక్షన్లలో అక్రమాలు

### ప్రభుత్వ ఖజానాకు గండి...మునుగోడు విద్యుత్ శాఖలో ఏఇ ఇష్టారాజ్యం!

### ప్రజాప్రతినిధుల ఒత్తిడితో డిడిలు లేకుండానే విద్యుత్ పనులు

### రైతులకు అన్యాయం జరిగిందని ఆరోపణలు

**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన విద్యుత్ శాఖలోనే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారనే ఆరోపణలు మునుగోడు మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.మండల విద్యుత్ శాఖ ఏఈ ఏకపక్ష నిర్ణయాలతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోతుండగా, విద్యుత్ వినియోగదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు.ఆరోపణల ప్రకారం, రైతులకు సంబంధించిన విద్యుత్ నియంత్రిక (కంట్రోలర్/ట్రాన్స్‌ఫార్మర్) మార్పిడికి తప్పనిసరిగా షిఫ్టింగ్ డీడీ చెల్లించాల్సి ఉన్నప్పటికీ, పలుకుబడి ఉన్న వ్యక్తుల కోసం ఎలాంటి డీడీ లేకుండానే మార్పులు చేసినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా సంబంధిత ఏడీఈ, డీఈ, ఎస్ఈ అనుమతులు లేకుండానే లక్షల రూపాయల విలువైన విద్యుత్ సామగ్రిని వినియోగించి ఒక రైతు భూమి నుంచి ప్రజాప్రతినిధికి చెందిన భూమి వద్దకు నియంత్రికను మార్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అసలు రైతుకు ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.మరో ఘటనలో, మండల కేంద్రానికి చెందిన ఓ వినియోగదారుడు కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ కోసం రూ.29 వేల డీడీ చెల్లించినప్పటికీ మూడు నెలల పాటు కనెక్షన్ ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం మరో లక్ష రూపాయలు ఖర్చవుతాయని చెప్పడంతో, ఉన్నతాధికారులను ఆశ్రయించగా కేవలం రూ.20 వేల వ్యయంతోనే కనెక్షన్ మంజూరైనట్లు బాధితురాలు తెలిపారు.అలాగే, మరో రైతు వ్యవసాయ బోరుకు సుమారు పది విద్యుత్ స్తంభాలు, వైర్లు ఎలాంటి డీడీ లేకుండానే ఏర్పాటు చేసినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పక్కనపెట్టి కొందరికి ప్రత్యేక ప్రయోజనం కల్పించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ వినియోగదారులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**బాధిత రైతు దోటి నాగేష్**



తన బోరు వద్ద ఉన్న విద్యుత్ నియంత్రికను తీసి, పలుకుబడి ఉన్న నాయకుడి భూమి వద్ద ఎలాంటి షిఫ్టింగ్ డీడీ లేకుండానే ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నాకు మోటార్ కనెక్షన్ ఇవ్వకుండా ఏఈ ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని బాధిత రైతు దోటి నాగేష్ చప్పుకోచారు.



**ఒట్టికోటి మంగమ్మ (మునుగోడు)**



మూడు ఫేసుల విద్యుత్ కనెక్షన్ కోసం రూ.29 వేల డీడీ చెల్లించినా కనెక్షన్ ఇవ్వలేదు.మరో లక్ష రూపాయలు ఖర్చవుతుందని చెప్పడంతో ఉన్నతాధికారులను సంప్రదించాను. వారి జోక్యంతో కేవలం రూ.20 వేల వ్యయంతోనే మూడు ఫేసుల కనెక్షన్ పొందాను అని ఒట్టికోటి మంగమ్మ అన్నారు.

## విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

### విద్యార్థులను పరామర్శించిన ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ కళాశాల హాస్టల్‌లో ఫుడ్‌పాయిజనింగ్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థినీలను ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని చికిత్సలు అందించి వారి ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు, వైద్యులకు సూచించారు. విద్యార్థినులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



## లేబర్ కోడ్లను రద్దు చేయాలి

బోగే ఉపేందర్ డిమాండ్



ప్రజాపక్షం/కౌటాల : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి, పాత 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం కౌటాల మండల కేంద్రంలోని ఉద్యానవనంలో నిర్వహించిన సమావేశంలో 26న ఆసిఫాబాద్ లో జరిగే సంఘం జిల్లా నాలుగో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించి, ప్రతి నెల ఒకటో తేదీన అందేలా చూడాలన్నారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని, మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు, పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం/సిర్పూర్ టీ : సిర్పూర్ టీ రైల్వే స్టేషన్, వెంకట్రావు పేట చౌరస్తా వద్ద ఆదివారం జరిపిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడిఎస్) బియ్యాన్ని ఎన్ఫోర్స్‌మెంట్ డెప్యూటీ తాసిల్దార్ రాజ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా కాళిదాసు అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనంతో పాటు సుమారు 4.12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎఫ్‌పిఎస్ నంబర్ 2410004 దుకాణంలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం లేదా దుర్వినియోగం చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్ఫోర్స్‌మెంట్ సి బ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం/మెదక్ : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 20వ తేదీన జరిగే ప్రజావాణి కార్యక్రమం హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తుల స్వీకరిస్తున్నాట్లు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉమ్మడి జిల్లా మంత్రి సమావేశం సంగారెడ్డి లో ఉన్నందున జిల్లా కలెక్టర్, తో పాటు వివిధ శాఖల అధికారులందరూ సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశానికి హాజరు కావాల్సి ఉన్నందున అధికారులు అందుబాటులో ఉండరు. ఆరోజున జరగవలిసిన గ్రీవెన్స్ దరఖాస్తులని హెల్ప్ డెస్క్ ద్వారా స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయం గమనించగలరని పేర్కొన్నారు.

## ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడిగా గోవర్ధన్



ప్రజాపక్షం/బోథ్ : ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎఐటియుసి (ఎఐటియుసి) 4వ జిల్లా మహాసభల్లో గోవర్ధన్ 5వసారి ఎఐటియుసి జిల్లా అ ధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలువురు కార్మిక సం ఘాల నాయకులు బి. గోవర్ధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, సామాజిక భద్రత,కార్మికవ్యతిరేక విధానాలకువ్యతిరేకంగాఎన్నోసంవత్సరాలుగా పోరాటాలను చేస్తున్న అని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతినిధులకు బి.గోవర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పట్టుదలతో పనిచేస్తానని,జిల్లాలోని అన్ని రంగాల కార్మికులను సంఘటితం చేసి ఉద్యమాలను బలోపేతం చేస్తానని తెలిపారు.

## ఆలయ రహదారి నిర్మాణానికి రూ.65 లక్షల నిధుల మంజూరు



ప్రజాపక్షం/బైంసా : భైంసా పట్టణంలో బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.ఆదివారం ఉదయం వేళ నుండి గట్టు మైసమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి అగుపడింది. గణేష్ నగర్,కిసాన్ గల్లీ, కోర్వగల్లీ, పలు కాలనీల నుండి ప్రజలు డప్పులతో, బోనం కుండలతో అమ్మవారి చెంతకు చేరుకున్నారు.ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.వర్షాలు పుష్కలంగా కురవాలని,పంటలు పండాలని గట్టు మైసమ్మ తల్లి ని మొక్కు కోవడం జరిగిందన్నారు. గట్టు మైసమ్మ ఆలయ రహదారి నిర్మాణనికి 65 లక్షల నిధులు నిధులను మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే ఆషాడం వరకు పనులను పూర్తి చేస్తామన్నారు.షె డ్డు నిర్మాణానికి 10 లక్షల రూపాయల నిధులు ఇవ్వనున్న ట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్,బిజెపి పట్టణ అధ్యక్షులు రావులరాము, కౌన్సిలర్లు,నాయకులు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

ఎస్ఐ మేకల సంతోష్

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : కొద్దిపాటి పరిచయానికే ప్రలోభాలకు లోబడి అపరిచిత వ్యక్తులను నమ్మి ఇంట్లోకి ఆహ్వానించవద్దని శ్రీరాంపూర్ సబ్ ఇన్స్పెక్టర్ మేకల సంతోష్ హెచ్చరించారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియాలోని 6, 7 డివిజన్లలో కార్పొరేటర్ల సమక్షంలో ప్రజలకు తెలియని వ్యక్తులు, దొంగతనాలు వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాంగం నిర్విరామంగా విధులను నిర్వహిస్తుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం అసాంఘిక కార్యక్రమాలు, దొంగతనాల నిర్మూలనలో ప్రతి పౌరుడు బాధ్యతతో పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానిత వ్యక్తులు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కొంతమంది చెడు వ్యసనాలకు బానిసలై, సులభంగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని భరోసా ఇచ్చారు. నేరాలకు పాల్పడే వ్యక్తులను త్వరితగతిన గుర్తించేందుకు వీలుగా ప్రజలు వారి వారి వాడలలో విధిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేల్పుల రవీందర్, వనపర్తి కేత రాజేష్, స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నిర్లక్ష్యం

# విద్యార్థుల భవిష్యత్తు అంధకారం!





ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ రోజురోజుకూ దిగజారిపోతోంది. వేలాది రూపాయల ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్న కొందరు ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం, జిల్లా విద్యాశాఖ అధికారుల చేతకానితనం వెరసి పేద విద్యార్థుల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్నాయి. జిల్లాలోని మారుమూల గ్రామాలు, విద్యా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందనడానికి క్షేత్రస్థాయి పరిస్థితులే అద్దం పడుతున్నాయి.

### బడికి రాని బాధ్యత.. అటెండర్లే ఇక్కడ గురువులు!

జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లడమే గగనంగా మారింది. ఉదాహరణకు, కుబీర్ మండలం అంతర్ని గ్రామీణ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు హాజరై కూడా పాఠాలు బోధించకుండా, ఉడుము కొడుతూ (కాలక్షేపం చేస్తూ) కాలం వెళ్లదీశారు. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో ఉపాధ్యాయులు గైర్హాజరు కావడమో, లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించడమో చేస్తుండటంతో.. చివరకు పాఠశాల అటెండర్లే క్లాసులు తీసుకొని పాఠాలు చెప్పాల్సిన దారుణ పరిస్థితి ఏర్పడింది. అలాగే మమడ మండలంలోని పులిమడుగు పాఠశాలతో పాటు అనేక మారుమూల గ్రామాల బడుల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా కొందరు ఉపాధ్యాయులకు బోధనపై ధ్యాస లేకుండా పోయింది. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన కొందరు ఉపాధ్యాయులు బడి వేళల్లో కూడా బిట్‌కాయిన్ ట్రేడింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో మునిగితేలుతున్నారా..? క్లాస్ రూమ్‌లలో ఉండాల్సిన ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో అక్రమ వ్యాపారా లు చేస్తూ విద్యా సంస్థల పరువు తీస్తున్నారు.

### ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడి.. నిమ్మకు నీరెత్తిన విద్యాశాఖ!

జిల్లా విద్యాశాఖ వ్యవహార శైలి ఈ సమస్యకు ప్రధాన కారణమని చెప్పక తప్పదు. నిరంతరం పాఠశాలలను తనిఖీ చేసి, ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాల్సిన విద్యాశాఖ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రధాన ఉపాధ్యాయులు (హెచ్ఎం), టీచర్లపై గట్టి చర్యలు తీసుకుందామన్నా.. జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఒ)పై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు, విద్యాశాఖ అధికారి మృదుస్వభావి కావడం వల్ల కొందరు ఉపాధ్యాయులు ఆయనను చులకనగా చూస్తూ, నిబంధనలను బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

### కలెక్టర్ తనిఖీలు చేస్తేనే మార్పు!

జిల్లా విద్యాశాఖ పూర్తిగా నిద్రమత్తులో జోగుతోంది. జిల్లా కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి, నిరంతరం ప్రభుత్వ పాఠశాలలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, విధులకు ఎగనామం పెడుతున్న ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు లాంటి కఠిన చర్యలు తీసుకుంటే తప్ప నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మళ్లీ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యా రంగాన్ని కాపాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి:ఎఐఎస్ఎఫ్

ప్రజాపక్షం/నిజామాబాద్: పెండింగ్ ఫీజు రిఎంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం కోరారు. ఆదివారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా రైల్వే స్టేషన్ పరిధిలోని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో 3న నిర్వహించనున్నట 'విద్యార్థుల పోరు' బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేసి రఘురాం మాట్లాడారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా లక్షలాది మంది విద్యార్థులకు సంబంధించి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రిఎంబర్స్‌మెంట్ 8 వేల కోట్ల బకాయిలు విడుదల కాకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం 23న నగరంలో నిర్వహించనున్న విద్యార్థులు, యువత తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే ఈ పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావలని విజ్ఞప్తి చేశారు.ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుభోధ్, అనుషా, శివపవన్, అజేష్, విష్ణు పాల్గొన్నారు.




## 'ఎల్ నినో' ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కొందాం

మంత్రి గడ్డం వివేక్, కలెక్టర్



ప్రజాపక్షం/చెనూరు/ మంచిర్యాల : రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొందామని, రైతులంతా ఏకమై ఒకే నిర్ణయంతో వరి మినహా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి ఆయన హాజరయ్యారు. ఎల్ నినోతో రాష్ట్రంలో ఇప్పటివరకు 40 శాతం మాత్రమే వర్షపాతం నమోదైందని, రాబోవు మూడు నెలల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందన్నారు. సాగునీరు, తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున నీటి లభ్యత తక్కువగా ఉండే ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. అనంతరం చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డులో రూ.1 కోటి 40 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన బైపాస్ సీసీ రోడ్డును జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. రూ.6 కోట్ల 50 లక్షల పుష్కరాల నిధులతో రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని మైనారిటీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల వసతులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి పంటలు సాగు చేయాలన్నారు. వీటికి అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచామన్నారు. చెన్నూర్ లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ కుమార్ తివారి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవే ధ్యేయం

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



ప్రజాపక్షం/బైంసా : రాజకీయాలకతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.ఆదివారం నియోజకవర్గం లోని భైంసా లోని ఎస్. ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లో 125మంది లబ్ధిదారులకు 55 లక్షల 58 వేల రూపాయల చెక్కులను పంపిణి చేసిన ప్రజలకు ఆరోగ్య పరంగా ఇబ్బందులు తలెత్తితే కొంత సహాయం చేయాలన్న ఉద్దేశంతో తన కార్యాలయంనే ముఖ్యమంత్రి సహాయ నిధి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రత్యేకంగా ఇద్దరు పి. ఏ లను నియమించి గతంలో కంటే ఎక్కువగా రెండున్నర సంవత్సరాల్లో 5000 మందికి ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు.నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయంగా ముందుకు సాగుతానని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీలు,మహిళా సమైక్య భవనాలు,గ్రామపంచాయతీ భవనాలు,పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు.దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర అమ్మవారి ఆలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి 325 కోట్లు కేటాయించడం అదృష్టమేనన్నారు. అదేవిధంగా ఆలయ నిర్మాణం కోసం దాత 30 కోట్లు ఇవ్వడం శుభ సూచకమన్నారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు,కుంటాల మండల నాయకులు బివి రమణారావ్,కుంటాల సర్పంచ్ గజేందర్, భైంసా పట్టణ, మండల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మరెడ్డి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుపోతుల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించిన ఘనత ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ దే నన్నారు. నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో అభివృద్ధి కి నిధులు తెస్తున్న ఘనత ఆయనదేనన్నారు.

## ఊరపండగను విజయవంతం చేద్దాం



ప్రజాపక్షం/నిజామాబాద్: నగరంలో అతిపెద్ద పండగ ఊర పండగను నగర ప్రజలందరి సహకారంతో వైభవంగా నిర్వహించటం కోసం అందరి సహకారం కోరుతున్నామని సర్వసమాజ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మి నారాయణ తెలిపారు. ఆగస్టు 2న నిర్వహించనున్న ఊర పండగ నేపథ్యంలో సన్నాహక సమావేశాన్ని ఆదివారం సిర్నాపల్లి గడిలో నిర్వహించి మాట్లాడారు. 2 న ఊర పండగ నిర్వహిస్తున్నట్లు అందుకోసం ఏర్పాట్లును కూడా ప్రారంభించామన్నారు. ఊర పండగలో భాగంగా 30న బండారు పోస్తున్నట్లు, గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా నగరంలోని అన్ని సంఘాలను కలుపుకుని అత్యంత వైభవంగా ఊర పండగను నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక కమిటీలు వేయాలని నిర్ణయించామన్నారు. సర్వసమాజ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ప్రవీన్, సుదన్, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండగ



ప్రజాపక్షం/తానూర్ : మండల కేంద్రంలో పెద్దమ్మ తల్లి అమ్మవారికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను గ్రామస్తులతో కలిసి ఆదివారం ఘనంగా నిర్వహించారు.గ్రామంలోని వివిధ కుల సంఘాలు బోనాలను డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు.అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని,గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది పండుగ నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. మాజీ సర్పంచ్ జాదవ్ మాధవ్ రావ్ పటేల్, రాములు, గోవింద్ పటేల్,నూనెవార్ అశోక్,డాక్టర్ సంఘ సభ్యులు,గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

## పెద్ద శంకరంపేటలో యథేచ్ఛగా బెల్ట్ షాపులు!

ప్రజల ప్రాణాలతో చెలగాటం!




ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట్ : పెద్ద శంకరంపేట మండలంలో అక్రమ బెల్ట్ షాపులు, సిట్టింగ్ రూములు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. మండలంలోని దాదాపు ప్రతి గ్రా మంలో బెల్ట్ షాపులు నడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గల్లీకో బెల్ట్ షాపు.. ఊరికో సిట్టింగ్ రూంలు నడుస్తున్న పట్టించుకొనే నాధుడే కరువయ్యారు. అధికారులు మామూళ్ల మత్తులోనే అక్రమ వ్యాపారాలకు అండదండలు లభిస్తున్నాయా? అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని, పెద్ద శంకరంపేట్ వైన్స్, శ్రీ కనకదుర్గ వైన్స్ గ్రామం మధ్యలో, జాతీయ రహదారి పక్కనే ఉండటంతో మద్యం సేవించిన వ్యక్తులు రోడ్డుపై తిరుగుతూ మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ తంలో ప్రమాదాలు జరిగినా పరిస్థితిలో మార్పు రాలేదని చెబుతున్నారు. మరోవైపు పర్మిట్ రూముల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆరోపిస్తున్నారు. అక్రమ బెల్ట్ షాపులు, సిట్టింగ్ రూములపై ఎక్సైజ్, పోలీసు శాఖలు వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు, మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై రవాణా శాఖ ఉక్కుపాదం

286 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు ,రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా ద్వితీయ స్థానం

ప్రజాపక్షం/ఎడపల్లి: అరేయ్ మణి.. బైక్ తీసుకొని వెళ్లి పాల ప్యాకెట్ తీసుకురా పో.. అంటూ ఓ తండ్రి తన పదో తరగతి కొడుకు చేతికి తాళాలు ఇచ్చాడు. మరోచోట ఓ తండ్రి మార్కెట్‌కు వెళ్తూ మైనర్ అయిన తన కొడుక్కి డ్రైవింగ్ అప్పగిస్తూ వాహనాన్ని ఇచ్చాడు. రాష్ట్రంలో ఇలాంటి నిర్లక్ష్యపు ఘటనలే మైనార్ల పాలిట, తోటి బాటసారుల ప్రాణాల పాలిట శాపంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మైనర్ డ్రైవింగ్‌పై నిజామాబాద్ జిల్లా రవాణా శాఖ పోలీస్ యంత్రాంగం అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన సుమారు 286 వాహనాల రిజిస్ట్రేషన్లను విడతల వారీగా రద్దు చేస్తూ రవాణా శాఖ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది.మోటారు వాహనాల చట్టం, సుప్రీం కోర్టు నిబంధనలను కఠినంగా అమలు చేయడంలో రవాణా శాఖ అధికారులు స్పీడ్ పెంచారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనర్లు నడిపిన వాహనాలపై వేటు వేస్తున్నారు. ఈ చర్యల్లో 3,523 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దులు చేసి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మొదటి స్థానంలో నిలవగా, నిజామాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. 2025 జూన్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 286వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దయ్యాయి. 164వాహనాల రద్దుతో మూడవ స్థానంలో రంగారెడ్డి జిల్లా నిలిచింది.పాఠశాలలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లే విద్యార్థులు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇటీవల కామారెడ్డి మండలం ఇల్చిపూర్ శివారులో 16 ఏళ్ల మైనర్ నడిపిన బైక్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఆరేళ్ల చిన్నారితో ఓ ఎస్సై కారు డ్రైవింగ్ చేసిన ఘటన వైరల్ కావడంతో రవాణా శాఖ తీవ్రంగా స్పందించింది. ఇలాంటి ఘటనలు నగరాలలో రోజురోజుకూ పెరుగుతున్నాయి. పిల్లలు మా రం చేస్తున్నారనే నేపంతో కొందరు, గారాబంతో తల్లిదండ్రులు మైనర్ల చేతికి వాహనాలు ఇచ్చి ప్రాణాలనే ప్రమాదంలోకి నెడుతున్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

దుర్గా ప్రమీల, డిప్యూటీ ట్రాన్స్ ఫోర్ట్ కమిషనర్ నిజామాబాద్

రవాణా శాఖ నిబంధనలు ఉల్లంగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. తనిఖీల్లో మైనర్లు డ్రైవింగ్ చేస్తూ దొరికితే తక్షణమే ఆ వాహనం రిజిస్ట్రేషన్ ను రద్దు చేస్తున్నాం. అలాగే మైనర్‌కు 25ఏండ్లు వచ్చే దాకా డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేయబడదు. గతేడాది జూన్ నుంచి జిల్లాలో 286 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు చేశాం. పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారి ప్రాణాలతో పాటు రోడ్డుపై వెళ్లే ఇతరుల ప్రాణాలు కూడా గాల్లో కలుస్తున్నాయి. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు వాహనాలు ఇ వ్వడం ఆపాలి. జిల్లా వ్యాప్తంగా ఆర్టీఏ తనిఖీలు కొనసాగుతాయి. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు వాహనాలు ఇవ్వడం ఆపాలి. జిల్లా వ్యాప్తంగా ఆర్టీఏ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. అంతేగాకుండా మైనర్లు, లైసెన్స్ లేనివారు నడిపే ఈవీ వాహనాలపై తమ దృష్టి ఉందని, వీటి వల్ల జరిగే ప్రమాదాలపై, వాహన ఏజెన్సీలపై ఓ నివేదిక తయారు చేసి, దీనిపై ఓ చట్టాన్ని తీసుకురావాలని రవాణా శాఖ కమీషనర్‌కు నివేదించనున్నాము.



## శబరిమాత ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్



ప్రజాపక్షం/బోథ్‌బోథ్ : మండలంలోని కనుగుట్ట గ్రామంలో గత20సంవత్సరాలుభక్తుల ఆరాధన కేంద్రంగా కొనసాగుతున్న శ్రీ శబరి మాత ఆలయఅభివృద్ధి పనులకు ముఖ్య అతిథిగా హాజరైన అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు డా. నరేష్ జాదవ్. శబరి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ ఆలయ అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. శబరిమాత ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల ఐక్యత, సహకారంతో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఏఎమ్ చైర్మన్ మల్లెపూలసత్యనారాయణ,ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు అసిఫ్ ఖాన్,అధికార ప్రతినిధి పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రపుల్ రెడ్డి,రాష్ట్రకాంగ్రెస్ పార్టీSC సెల్ ఉపాధ్యక్షులు మహేందర్ మండల కన్వీనర్ లు బోజన్న, గాజుల పోతన్న, ఏలేటి రాజశేఖర్ ఆత్మ డైరెక్టర్ గడ్డల నారాయణ, శబరి మాత కమిటీ సభ్యులు భోజన్న కనుగుట్ట సర్పంచ్ ఆకుల అనిత రాజేందర్,దౌలత్ రావు, మాజీ సర్పంచ్ మల్లేష్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు జంగాల బోజన్న,శబరిమాత ఆలయ కమిటీ సభ్యు లు,గ్రామ పెద్దలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు,యువకులు భక్తులు పాల్గొన్నారు.

2024 సంవత్సరానికి గాను ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో 'కల్కి 2898 ఎడి' రెండు విభాగాల్లో జాతీయ అవార్డులను కైవసం చేసుకుంది. 'ఉత్తమ ప్రజాదరణ పొందిన సంపూర్ణ వినోదాత్మక చిత్రం విభాగంలో 'కల్కి 2898 ఏడీ' జాతీయ అవార్డుకు ఎంపికైంది.

# రీల్



## జాతీయ అవార్డు బాధ్యత పెంచింది : నాగ్ అశ్విన్

2024 సంవత్సరానికి గాను ప్రకటించిన 72వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో 'కల్కి 2898 ఎడి' రెండు విభాగాల్లో జాతీయ అవార్డులను కైవసం చేసుకుంది. 'ఉత్తమ ప్రజాదరణ పొందిన సంపూర్ణ వినోదాత్మక చిత్రం విభాగంలో 'కల్కి 2898 ఏడీ' జాతీయ అవార్డుకు ఎంపికైంది. అలాగే 'ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్' విభాగంలో 'కల్కి 2898 ఎడి' చిత్రానికి జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ అవార్డు రావడం గర్వకారణంగా ఉందని దర్శకుడు నాగ్ అశ్విన్ తెలిపారు. రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకోవడంతో చిత్ర బృందానికి ప్రేక్షకులు, అభిమానులు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'న్యూటన్స్ థర్డ్'లా ధమ్ ధమ్ సాంగ్ రిలీజ్



సుమంత్ హీరోగా ఈవిన్ నిర్మాణంలో తెరకెక్కిన యూనిక్ థ్రిల్లర్ 'న్యూటన్స్ థర్డ్ లా'. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించిన చిత్రాన్ని కె.హరీశ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ధమ్ ధమ్ సాంగ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ 'న్యూటన్స్ థర్డ్ లా' కథను ఒకే సిట్టింగ్‌లో ఓకే చేశాను. 'అనగనగా' తర్వాత ఈ ప్రాజెక్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. కథ విన్న వెంటనే వినయ్ పాత్ర, కార్తీక్ పాత్ర చాలా బలంగా ఉండాలని చెప్పాను. ఆ రెండు పాత్రలు అద్భుతంగా ఉంటేనే సినిమా ఆడుతుందని అప్పుడే అనుకున్నాను. నిజంగానే ఇద్దరూ అద్భుతం గా నటించారు. ఈ పాట కూడా వాళ్ల పాత్రలపైనే ఉంటుంది. సినిమాలో ప్రతి పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అందరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. అనగనగాకి బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా ఈటీవీ యాజమాన్యానికి ధన్యవాదాలు. .జులై 31న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. చాలా మంచి సినిమాతో వస్తున్నాం. సినిమా విషయంలో మేమంతా ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుంది. ఈటీవీ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ మాట్లాడుతూ న్యూటన్స్ థర్డ్ లా జూలై 31న జులై 31న థియేటర్లలో విడుదల అవుతుంది అన్నారు. దర్శకుడు రాజేష్ కర్ణ మాట్లాడుతూ ఈటివి విన్ ఈ సినిమా విషయంలో ఎక్కడా రాజీ పడకుండా మాకు పూర్తి సహకారం అందించింది. వారి గట్స్, సినిమాపై ఉన్న ప్యాషన్ అభినందనీయం. థ్రిల్లర్ జానర్ గురించి మాట్లాడినప్పుడల్లా 'న్యూటన్స్ థర్డ్ లా' పేరు కూడా తప్పకుండా వినిపిస్తుంది. ఈ సినిమా థ్రిల్లర్ జానర్‌ను రీడిఫైన్ చేస్తుంది. సంగీత దర్శకుడు సింజిత్ యర్రమిల్లి మాట్లాడుతూ కృష్ణ చైతన్య అద్భుతమైన సాహిత్యం రాశారు.ఈ సినిమాకు సంగీతం అందించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. నిర్మాత కె. హరీష్ మాట్లాడుతూ మేము చాలా మంచి సినిమా తీశాం. ఈ కథ నా దగ్గరకు రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని చెప్పారు.



## 'చెన్నై లవ్ స్టోరీ' ట్రైలర్ రిలీజ్ చేసిన అల్లు అరవింద్

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీగౌరి ప్రియ జంటగా ఎస్‌కెఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న థియేట్రికల్ రిలీజ్‌కు 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టార్ ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్ అతిథులుగా పాల్గొన్నారు. అల్లు అరవింద్ చేతుల మీదుగా సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రొడ్యూసర్ రవిశంకర్ బర్త్ డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొ డ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ సినిమా ట్రైలర్ చూస్తే, అందులోని భావోద్వేగాలు గమనిస్తే ఇది డెఫనెట్‌గా హిట్ అయ్యే సినిమా అనే ఇంప్రెషన్ కలుగుతోంది. అందులో అనుమానమేమీ లేదు. ట్రైలర్ సూపర్బ్‌గా ఉంది. కానీ ట్రైలర్ చూశాక ఇది తప్పకుండా అలాంటి విజయం సాధిస్తుందనే నమ్మకం ఏర్పడింది. ఈ నెల 24న ఈ టీమ్ అందరికీ ఒక మంచి విజయం దక్కబోతోంది. వీళ్లందరికీ మంచి గుర్తింపు దక్కుతాయి. మైత్రీ రవి ఈ సినిమాకు ఎంతో సపోర్ట్ చేశారు అన్నారు.

## రణబీర్-సాయి పల్లవి జంటగా 'రామాయణ'



రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న చిత్రం 'రామాయణ'.ఈ సినిమా ప్రెస్ మీట్ ఢిల్లీ లో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు నితేశ్ తివారీ మాట్లాడుతూ రామాయణం ప్రపంచంలో చెప్పబడిన గొప్ప కథల్లో ఒకటి. దాని గొప్పతనం పరిమాణంలో కాదు. అది ప్రతిబింబించే శాశ్వత విలువల్లో ఉంది. ఒక దర్శకుడిగా దాన్ని ప్రపంచవ్యాప్తంగా అందరికీ అర్థమయ్యేలా మార్చాలనే బాధ్యత నాకు ఎప్పుడూ అనిపించలేదు. ఎందుకంటే అది ఇప్పటికే విశ్వజనీనమైన కథ. నా బాధ్యత ఒక్కటే... దాన్ని సంపూర్ణ నిజాయితీతో, ప్రామాణికతతో, అత్యంత గౌరవంతో తెరపై ఆవిష్కరించడం అని చెప్పారు. హీరో రణబీర్ కపూర్ మాట్లాడుతూ రామానంద్ సాగర్ తెరకెక్కించిన రామాయణంలో శ్రీరాముడి పాత్రను ఆయన ఎంతో అద్భుతంగా పోషించారు. అరుణ్ ని శ్రీరాముడి పాత్రలో చూసి తరతరాల ప్రేక్షకులు స్ఫూర్తి పొందారు. ఎంతోమందికి ఆయన ఆ పాత్రతో ఆదర్శంగా నిలిచారు అని అన్నారు. నిర్మాత, క్రియేటివ్ ఆర్కిటెక్ట్ నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సమర్పణలో, డినెగ్ , మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి ఆస్కార్ విజేతలైన హాన్స్ జిమ్మర్, ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాల పరంగా 'రామాయణ' భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది అని తెలిపారు. జులై 24న అధికారికంగా ట్రైలర్ విడుదల చేస్తామన్నారు. దీపావళి 2026 సందర్భంగా 'రామాయణ: పార్ట్ 1' ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 24న 'హే చికీతా' విడుదల

అమరావతి మూవీ మేకర్స్, సుందరకాండ మోషన్ పిక్చర్స్ బ్యానర్ల మీద ఎన్. అశోక ఆర్ ఎన్ఎస్, 'గరుడవేగ' అంజి నిర్మించిన చిత్రం 'హే చికీతా'. అభినవ్ మణికంఠ, దివిజ ప్రభాకర్, తన్మయ్ ఖుషి, దేవి ప్రసాద్, ఈటివి ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీని ధన రాజ్ లెక్కల తెరకెక్కించారు. ఈ సినిమాని జులై 24న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఈ మూవీ నుంచి చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చదలవాడ శ్రీనివాస రావు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, రామ్ లక్ష్మ ణ్ మాస్టర్స్, కమెడియన్ అలీ, వివిన్ ఆదిత్య, ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలోచదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'నేను యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు 'లైలా' మూవీని చేశాను. ఆడి యో రైట్స్‌తోనే ఎంతో లాభం వచ్చింది. 'హే చికీతా' టీంని చూస్తే నాకు పాత రోజులు గుర్తుకు వచ్చాయి అన్నారు. కమెడియన్ అలీ మాట్లాడుతూ 'బద్రి' సినిమాలోని 'హే చికీతా' పాట ఎంత పెద్ద హిట్ అయిందో ఈ సినిమా కూడా అంతే హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. ఓ చిత్రాన్ని తీయడం, రిలీజ్ చేయడం ఎంతో కష్టం. భవిష్యత్తులో రైతు అనేవాడు ఉంటాడా? కనిపిస్తాడా? అని అనిపిస్తుంది. రైతు ఉంటేనే దేశం నిలబడుతుంది అన్నారు. రామ్ లక్ష్మ ణ్ మాస్టర్స్ , గరుడ వేగ అంజి నిర్మాతఎన్. అశోక ఆర్ఎన్ఎస్ దర్శకుడు ధన్ రాజ్ లెక్క మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దివిజ ప్రభాకర్, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, నటి యోధ తదితరులు పాల్గొన్నారు.




## యాక్షన్, లవ్‌స్టోరీ కామ్రేడ్ కళ్యాణ్



శ్రీ విష్ణు, మహిమా నంబియార్ జంటగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు. కామ్రేడ్ కళ్యాణ్. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. కోన వెంకట్ సమర్పణలో, వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు . విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ లవ్ మెలోడీ హీరో చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతకు హీరోయిన్ మెస్మరైజ్ అయ్యి అతనిపై ప్రేమను పెంచుకునే భావోద్వేగాలను అందంగా చూపించారు. శ్రీవిష్ణు, మహిమా నంబియార్‌ల మధ్య కెమిస్ట్రీ, ఆకట్టుకునే విజువల్స్ ఈ పాటను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. 1992 నాటి ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతున్న 'కామ్రేడ్ కళ్యాణ్' యాక్షన్, భావోద్వేగాలు, ఆకట్టుకునే ప్రేమకథ కలగలిపిన చిత్రంగా రూపొందుతోంది. ఈ రెండో పాటలో లీడ్ పెయిర్ మధ్య చిగురించే ప్రేమను, సరిహద్దులను దాటే అమాయకమైన అనుబంధాన్ని అందంగా చూపించారు. ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేదే నిజమైన జర్నలిజం


### స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేదే నిజమైన జర్నలిజం అని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేన రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో 'జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చేందుకు నిర్వహిస్తున్న రెండు రోజుల జర్నలిస్టుల శిక్షణా శిబిరాన్ని' హైదరాబాద్, నాంపల్లిలోని తెలంగాణ మీడియా ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కె. శివసేనరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మారుతున్న సాంకేతిక పరిణామాలు, డిజిటల్ మీడియా విస్తరణ, సామాజిక మాధ్యమాల ప్రభావం నేపథ్యంలో జర్నలిస్టులు నిరంతరం తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని శివసేనరెడ్డి సూచించారు. రాజకీయ,అధికార ఒత్తిళ్లకు లొంగకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వాస్తవ నిర్ధారణ, నైతిక విలువలు, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిన్న పత్రికలు, డిజిటల్ మీడియా, యూట్యూబ్ వేదికల్లో పనిచేసే జర్నలిస్టుల్లోనూ విశేష ప్రతిభ ఉందని, నిజాయితీతో పని చేసే వారికి గుర్తింపు తప్పకుండా లభిస్తుందన్నారు.
ఈ జర్నలిస్టుల శిక్షణాశిబిరంలో డిజిటల్ జర్నలిజం, సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ), మీడియా నైతిక విలువలు, సమకాలీన జర్నలిజం అంశాలపైన సీనియర్ జర్నలిస్టులు దిలీప్ రెడ్డి, మార్కండేయ, సుధాకర్ రెడ్డి, గోవింద్ రెడ్డి అవగాహన కల్పించారు. జర్నలిజంలో వృత్తి నైతిక విలువలు, వార్తా రచనలో ప్రమాణాలు, డిజిటల్ యుగంలో జర్నలిస్టులు అనుసరించాల్సిన బాధ్యతలు, మా నవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరి ని ర్మూలన, బాధితుల పునరావాసం లాంటి అంశాల్లో మీడి యా పోషించాల్సిన పాత్రపై పలువురు నిపుణులు సమగ్రం గా వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల జర్నలిస్టులు ఈ శిక్షణా శిబిరాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు విశ్వసనీయమైన, బాధ్యతాయుతమైన, నిష్పక్షపాత జర్నలిజాన్ని అందించాలని వక్తలు పిలుపునిచ్చారు.

### జర్నలిజం వృత్తిలో నిరంతర అధ్యయనం అవసరం: కె.శ్రీనివాస్‌రెడ్డి


జర్నలిజం వృత్తిలో నిరంతర అధ్యయనం అవసరమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎంతటి అనుభవం ఉన్నప్పటికీ మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త పరిజ్ఞానం, సాంకేతికత, చట్టాలు, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రామీణ జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మీడియా అకాడమీ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రజలకు ఉపయోగపడే బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని అందించాలని శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు.
కాగా ఈశిక్షణాశిబిరంలో సామాజిక సందేశంతో రూపొందిన 'నెరవేరిన కల' ఫీచర్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధు, సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు, వివిధ జిల్లాల నుంచిజర్నలిస్టులు, అధికారులు పాల్గొన్నారు.



## తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

సహజ వనరులను కొల్లగొట్టేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గిరిజనులకు అన్యాయం జరిగే ప్రతీ అంశంపై ప్రతిఘటిస్తామని తెలిపారు. గిరిజన నాయకులు సోయం గంగులు, తానూనాయక్ వారసత్వాన్ని పునికి పుచ్చుకుని గిరిజన హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ రెండు రోజుల పాటు సాగిన టిజిఎస్ రాష్ట్రమహాసభల్లో ప్రజానాట్యమండలి కళాకారుల ఆటా పాటా ఆకట్టుకున్నాయి. అనంతరం టిజిఎస్ ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన సమాఖ్య బలోపేతం ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత కాలంగా గిరిజన హక్కుల కోస ం చేసిన ఉద్యమాలను, భవిష్యత్ కార్యచరణను నివేదికలో పొందుపరిచినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పోడుభూముల పట్టాల పంపిణీని తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పన, విద్యా వైద్య రంగాల బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలపై మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్, సిపిఐ టిజిఎస్ నాయకులు ముత్యాల విశ్వనాధం మేయర్ మూడ్ గణేష్ నరాటి ప్రసాద్ సలిగంటి శ్రీనివాస్ కంచర్ల జమలయ్య వి పూర్ణ చంద్రరావు అడుసుమిల్లి సాయిబాబా భూక్యా ధ్రశు ఉప్పుశెట్టి రాహుల్ భూక్యా శ్రీనివాస్ సోందె కుటుంబ రావు వెంకట్ రాష్ట్ర జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## తప్పించుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా ముందుగా ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. పార్లమెంటులో తక్షణం దృష్టిసారించాల్సిన ప్రజా ప్రాధాన్యంగల అనేక విషయాలను ఆయన ఈ సమావేశంలో ప్రభుత్వం ముందు ప్రతిపాదించారు. ఇందులో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశం కూడా ఒకటి. అదేవిధంగా ధరల భారాలు,రోజు రోజుకూ పెద్ద బెడదగా మారుతున్న పార్టీ ఫిరాయింపుల సమస్య,మహిళా రిజర్వేషన్ చట్టం అమలు, సర్ ప్రక్రియ ద్వారా భారీ సంఖ్యలో ఓటర్ల తొలగింపు వంటి అనేక సమస్యలపై చర్చ జరపాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.
పరీక్షా ప్రశ్నాపత్రాలు ముందుగానే బహిర్గమయ్యాయని, పదే పదే ఈ ఘటనలు జరుగుతున్నాయని, దీని వల్ల పరీక్షలు రద్దవుతున్నాయని, విద్యావ్యవస్థలో విరామం లేకుండా అక్రమాలు,అవకతవకలు కొనసాగుతున్నందువల్ల లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బ తింటోందని,ప్రజలకు దేశ పరీక్షా విధానంపై ఎంత మాత్రం విశ్వాసం ఉండటంలేదని ఈ పరిస్థితుల్లో మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని అఖిలపక్ష సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి సిపిఐ నచ్చజెప్పిందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే సమస్యలు ఇంకా ఎన్నో ఉన్నాయని, వాటిపై ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా, బాధ్యతల నుండి తప్పించుకోవద్దని అధికారపక్షానికి విజ్ఞప్తి చేశారు.
ప్రభుత్వం తరచుగా పార్లమెంటు సమావేశాల్లో ప్రజా ప్రాధాన్యతగల అత్యంత కీలకమైన సమస్యలను దాటవేస్తోందని, సమాధానాలు ఇవ్వకుండా బాధ్యతల నుండి తప్పించుకుంటోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ''దేశంలో పార్లమెంటే ప్రజలకు జవాబుదారీ వహించే అత్యున్నతమైన ప్రజాస్వామ్య వేదిక,ఈ సమావేశాల్లో ప్రభుత్వం తప్పనిసరిగా అర్థవంతమైన చర్చలు జరపడానికి వీలుగా తగినంత సమయం కేటాయించాలి, కేవలం ఏదో లాంఛపూర్వకంగా శాసన కార్యక్రమాలు నిర్వహించడానికి ఈ సమావేశాలు నిర్వహించకూడదు'' అని కోరారు. ఎలాంటి రహస్యాలు,అరమరికలు లేకుండా బాహాట పద్ధతులతో చర్చలకు అవకాశం ఇవ్వండి, అలవాటు ప్రకారం బాధ్యతలనుండి తప్పించుకునే బదులు జవాబుదారీతనంతో సమాధానాలు చెప్పండి'' అని కోరారు. ఈ వర్షాకాల సమావేశాల్లో గతంలో చేసినవిధంగా కాకుండా అందరికీ అవకాశం కలిగించి సమస్యలను ప్రజా వేదికపై ప్రభుత్వం ముందుకు తెచ్చేందుకు, మంచి చర్చ జరిపి పరిష్కారాలు సాధించేందుకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.
మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై కూడా చర్చ జరగాలని సిపిఐ డిమాండ్ చేస్తోందని అఖిలపక్ష సమావేశంలో సంతోష్ కుమార్ ఉద్ఘాటించారు. పార్టీ ఫిరాయింపులు, సర్ ప్రక్రియ సందర్భంగా భారీ ఎత్తున ఓటర్ల పేర్ల తొలగింపు,ప్రజలపై రోజు రోజుకూ పెరుగుతున్న ధరల భారాలు, ఇంధనంలో ఇథనాల్ కలపడం,ఆహార భద్రతా విధానం,రైతుల సమస్యలు,ఆగస్టు 10వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా ఇచ్చిన నిరసన ప్రదర్శనల పిలుపు, ప్రభుత్వ స్కూళ్ళ మూసివేత,జమ్మూ కశ్మీరుకు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరణ వంటి అనేక విషయాలపై ఈ వర్షాకాల సమావేశాల్లో సమగ్ర చర్చలు జరపాలని అఖిల పక్ష సమావేశంలో ప్రభుత్వానికి ఆయన తెలియజేశారు. అదేవిధంగా భారతదేశం అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై పార్లమెంటులో చర్చ జరగాలని, ప్రపంచ పరిస్థితులు శరవేగంగా మారుతున్న పరిస్థితుల్లో దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని సమున్నతంగా నిలిబెట్టుకుని దానికి కట్టుబడాల్సి ఉందని ప్రభుత్వానికి పార్టీ పిలుపు ఇచ్చినట్లు సంతోష్ కుమార్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎయిర్ పోర్టు

(మొదటి పేజీ తరువాయి)

రహదారు లు, విమానాల పార్కింగ్ అప్రాన్, ట్యాక్సీ వేలు, గ్రౌండ్ సపోర్ట్ సదుపాయాల వరకు అన్ని పనులను 15 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు మాస్టర్ ప్లాన్ కూడా విడుదల చేసింది. ఈ ప్లాన్ ప్రకారం విమానాశ్రయానికి ప్రధాన ఎంట్రీ, ఎగ్జిట్ ను వరంగల్‌సూర్యాపేట జాతీయ రహదారి (ఎన్ హెచ్ 563) వైపు ప్రతిపాదించారు. అక్కడి నుంచి ప్రత్యేక యాక్సెస్ రోడ్డు ద్వారా టెర్మినల్ భవనానికి చేరుకునేలా డిజైన్ రూపొందించారు. టెర్మినల్ ఎదుట ఒకేసారి మూడు విమానాలు నిలిపే అప్రాన్, లింక్ ట్యాక్సీవే, గ్రాండ్ సపోర్ట్ ఎక్విప్మెంట్ (జీఎస్ఈ) ప్రాంతం, పెరిమీటర్ రోడ్లు, అత్యవసర యాక్సెస్ రోడ్లు కూడా ఏర్పాటు చేయ నున్నారు. 1930లోనే నిజాం హయాంలోనే మామూ నూరు ఎయిర్ పోర్ట్ ఉండగా వివిధ కారణాలతో 1980లో మూతపడిన సంగతి తెలిసిందే.

### కాకతీయ వైభవం ఉట్టిపడేలా..

తెలంగాణకు చారిత్రక వారసత్వంగా నిలిచిన కాకతీయుల కళా సంప దను ప్రతిబింబించేలా విమా మూమునూరు నాశ్రయ టెర్మినల్ భవనం, ప్రవేశ ద్వారాలు,అంతర్గత అలంకరణలను రూపొందించాలని రాష్ట్ర ప్రభు త్వం కోరగా, అందుకు కేంద్రం సానుకూలంగా స్పందిం చింది టెర్మినల్ ముఖద్వారంలో కాకతీయ కళాతోరణం శైలిని ప్రతిబింబించే నమూనాలు, లోపలి గోడలపై కాకతీయుల చరిత్రను తెలియజేసే చిత్రాలు, శిల్పాల ప్రతిరూ పాలు, తెలంగాణ జానపద సంస్కృతిని చాటిచెప్పే అలం కరణలు ఉండేలా ప్రణాళిక రూపొందించే అవకాశ ముంది. దీంతో వరంగల్ కు వచ్చే దేశీయ, విదేశీ ప్రయాణికు లకు విమానాశ్రయంలోనే కాకతీయుల గొప్పతనం పరిచయం కానుంది.2,800 మీటర్ల పొడవు, 75 మీటర్ల వెడల్పు గల రన్ వే నిర్మాణంతో ఎయిర్బస్320 వంటి పెద్ద ప్రయాణికుల విమానాలు, భారీ కార్గో విమానాలు కూడా దిగే అవకాశం ఉంటుంది. భవిష్యత్లో అంతర్జా తీయ విమానాశ్రయంగా విస్తరించే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని 949.44 ఎకరాల్లో ప్రణాళిక సిద్ధం చేశారు.

### సెప్టెంబర్ 7న ఫైనాన్షియల్ బిడ్

ఈ నెల 23న (గురువారం) ప్రీబిడ్ సమావేశాన్ని మామునూరు విమానాశ్రయ ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్టు టెండర్ నోట్ లో పేర్కొన్నారు. జూలై 29 నుంచి ఆగస్టు 12 వరకూ బిడ్ దాఖలకు అవకాశం కల్పించారు. ఆగస్టు 18న బిడ్ ఓపెన్ చేయనున్నారు. సెప్టెంబరు 7న ఫైనాన్షియల్ బిడ్ ను తెరవనున్నట్టు టెండర్ నోట్ లో పొందుపరిచారు. మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్హోల్, ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ సహా మరికొన్ని నిర్మాణాలకు త్వరలో మరో టెండర్ను పిలిచేందుకు ఏఏఐ అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com